Fragrance from the East
(Telugu)

తూరుపు తావి

ఎస్.ఎమ్. మలిక్

విషయసూచిక

1. బిస్మిల్లాహ్ ! 05
2. అల్ హమ్దులిల్లాహ్ ! 07
3. ఇన్షా అల్లాహ్ 10
4. మాషా అల్లాహ్ 13
5. అస్సలాము అలైకుమ్ 16
6. ఆరాధనకు పిలుపు – అజాన్ 19
7. అల్ – ఫాతిహా ! 22
8. ఇది రమజాన్ నెల 25
9. రమజాన్ 28
10. ఆధ్యాత్మిక వికాసం 31
11. ఉపవాస వ్రతం 34
12. సహరీ, ఇఫ్తార్ 37
13. రోజా విరమణ 40
14. రక్షణ కోసమే ఈ శిక్షణ 44
15. పండుగ శుభాకాంక్షలు ! 47
16. సంబరాలు శ్రుతిమించరాదు ! 50
17. ఖుర్ఆన్ పరిచయం 53
18. ఖుర్ఆన్ – దైవగ్రంథం ! 56
19. ఖుర్ఆన్ అవగాహనకు... 59
20. ఖుర్ఆన్ వెలుగులో మానవుడు 62
21. త్యాగమూర్తి ఇబ్రాహీమ్ ! 65
22. ముహర్రమ్ గుణపాఠం 68
23. సదాచారమే మత చిహ్నం ! 71
24. మానవులంతా ఒక్కటే ! 73
25. మనోకాంక్షల దాస్యం 76
26. ఆత్మ విమర్శన ! 78
27. మంచి కోసం ! 81
28. శాంతి, ప్రేమల సందేశం ! 84
29. కర్తవ్యం పిలుస్తోంది ! 87
30. మానవ ఔన్నత్యం 90
31. ఉపద్రవం రానున్నది 93
32. భవితవ్య రచన 96
33. చేతులు ముడుచుకు కూర్చోరాదు ! 99

ఇదీ సంగతి!

అది బహుశా 2002 సెప్టెంబరు నెల, 'ఆంధ్రజ్యోతి' పునఃరంగ ప్రవేశం చేస్తోందన్న వార్తతోపాటు మిత్రులు కె. రామచంద్రమూర్తి సంపాదకత్వ బాధ్యతలు చేపట్ట బోతున్నారన్న సమాచారం అందజేశారు సోదరులు దేవిప్రియ. ఆంధ్రజ్యోతి మలి దర్శనంలో ధార్మిక శీర్షిక ఒకటి ప్రవేశపెట్టాలని, అందులో ఇస్లామ్‌కు సంబంధించిన సమాచారం కూడా అందజేయాలని అనుకుంటున్నట్లు, దానికి నేనే కలం పట్టవలసి ఉంటుందని రామచంద్ర మూర్తి కోరుతున్నట్లు దేవిప్రియ చెప్పారు. సరే చూద్దామని అనుకున్నాము.

అక్టోబరు మొదటి వారంలో ఒక రోజు రామచంద్రమూర్తి ఫోను చేసి దేవిప్రియ చెప్పిన విషయాన్ని ధ్రువపరిచారు. దానికి శీర్షిక కూడా నన్నే నిర్ణయించవలసిందని కోరారు. అలా పారింది అలలు అలలుగా 'తూరుపుతావి'! అక్టోబరు, 2002 మొదలుకుని ఏప్రిల్, 2004 వరకు!! ఆంధ్రజ్యోతి ద్వారా 'తూరుపుతావి' తెలుగు జనావళిని తట్టి పలకరిస్తూనే ఉండింది. అనివార్య కారణాల వల్ల దాన్ని ఆపివేయవలసి వచ్చింది. ఈ చిరుపుస్తకం పరంపరలోని చివరి వ్యాసం ఆంధ్రజ్యోతిలో ప్రచురించబడలేదు. అది 2004లో జరిగిన ఎన్నికలకు పూర్వం వ్రాసింది. కారణాంతరాల వల్ల ఆ వ్యాసం ప్రచురించడం సాధ్యపడలేదు. ఆ వ్యాసం చదవండి. అందులో ముస్లిముల క్రియాశీల మయిన భూమికను గురించి చెప్పడం జరిగింది. దేశంలో వస్తున్న మార్పును గురించి భవిష్యవాణి చెప్పడం జరిగింది. దురదృష్టవశాత్తు ఆ వ్యాసం ప్రచురించబడలేదు. అది వ్యాసకర్తకు ఎనలేని ఆవేదనను కలిగించింది.

వ్యాసకర్త మరో రూపం దాల్చాడు. కలం మూసేసి నోరు విప్పాడు. పట్టణాలలో ఎందరో రాజకీయేతర నాయకులతోపాటు తన భావాలను ముస్లిములు, ముస్లిమేతర సోదరులను కలుసుకుని పంచుకున్నాడు. తరువాత సంభవించిన పరిణామాలలో (వ్యాసంలో వ్రాసినట్టుగా) ఉడతాభక్తిగా తన పాత్ర కూడా ఉందన్న సంతృప్తితో ఆనందభాష్పాలు రాల్చాడు.

నన్ను కలసుకున్న మిత్రులు మౌఖికంగానూ, కలసుకోలేని మిత్రులు ఉత్తరాల ద్వారాను ఈ వ్యాసాలను ప్రస్తావించిన తీరునుబట్టి అవి బాగానే ఆకర్షించాయని, ఆకట్టు కున్నాయని తెలిసింది. ఆ వ్యాసావళి పుస్తక రూపంలో వస్తే బావుంటుందని అభిప్రాయ పడ్డారు చాలా మంది. అది ఇస్లామ్ పరిచయానికి బాగా ఉపయోగపడుతుందని కూడా అన్నారు అనేకమంది. ఆ దృష్టితో వ్యాసాలన్నీ ఒకచోట చేర్చి నేనూ చదివాను. వ్యాసాలను అచ్చయిన తేదీల క్రమంలోకాక విషయాల దృష్ట్యా సంకలనం చేయాలని, కొన్నింటిని తీసివేయాలని కూడా అనిపించింది. అలాగే చేశాను. పుస్తకం మీ చేతిలో ఉంది. తీర్పరులు మీరే.

ఈ పుస్తకానికి మూల ప్రేరకులయిన దేవిప్రియ, రామచంద్రమూర్తి, ఆంధ్ర జ్యోతికి, పుస్తకంగా రావాలని కోరిన మిత్రులు అనేకమందికి కృతజ్ఞతలు!

హైదరాబాద్ **మలిక్**
20-9-2004

సహరీ, ఇఫ్తార్

ఆరాధనా పరిణామం ఆధ్యాత్మిక వికాసం, ఇది సందేహ రహితం. ఆరాధనా భావం స్వచ్ఛంద శారీరక యాతనా అనుభవం, ఇది మూఢత్వం. శారీరక బాధలే దైవ సామీప్యానికి సోపానాలు, దైవ సాయుజ్యానికి అగ్ర పీఠాలు, ఇది అజ్ఞానం. ఇస్లామీయ ఆరాధనా భావనలో దైవాజ్ఞాపాలన, దైవ విధేయతలకే ప్రాధాన్యం. మనిషిలో దైవదాస్య లక్షణాన్ని పటిష్టతరం చేయడమే ఆరాధనా లక్ష్యం. రోజా వ్రతం కూడా అందుకే. దాసుడు ఉపవాసంలో ఆకలిదప్పుల బాధ వల్ల తపించడం దైవానికి సంతోషకరమయిన, ప్రసన్నతా ప్రదమయిన విషయమా?

ఉపవాసం ఆచరణాత్మకంగా, దాసుని ప్రభువాజ్ఞాపాలనా ప్రదర్శనం, అంతే. ఆయన ఆదేశమయింది– దాసుడు శిరసావహించాడు. ఓ నిర్ణీత సమయం వరకు అన్నపానీయాలను ముగించుకున్నాడు. ఇక తాను దైవాదేశాలకు కట్టుబడి నడచుకుంటానని నిర్ణయించుకున్నాడు. ఆ తరువాత దైవాజ్ఞల్ని ఉల్లంఘించే ఎన్నెన్ని అవకాశాలు, ఎన్నెన్ని సన్నివేశాలు ఎదురయినా, ఆకలిదప్పులే కాదు, మరే వాంఛలయినా సరే ఎంతగా ఘోష పెట్టినా దైవాజ్ఞల్ని ససేమిరా మీరడు. ఒక్క అన్నం మెతుకు, ఒక్క నీటి చుక్క ముట్టుకోడు. ఒక్క సిగ్గుమాలిన చూపు, ఒక్క నీతి లేని పలుకు, ఒక్క చెప్పనలవికాని పని, ఒక్క చెయ్యనొల్లని మాట, దేవునికి ఒప్పుని దిక్కులో ఒక్క అడుగు– ఇక ఈ దాసుని ద్వారా కాని పనులు. దాసుని ఈ విధేయతాభావమే దేవునికి చాలా ఇష్టమయినది.

ఆ తరువాత, ఆయన ఆదేశం మేరకే అన్నపానీయాలు అనుమతించబడినప్పుడు, ప్రభువాజ్ఞకే నిరీక్షిస్తూ ఉన్నట్లు, ఒక్క క్షణం కూడా జాగు చెయ్యకుండా దాసుడు ఉపవాస విరమణకు ఉపక్రమిస్తాడు. ప్రభు సంకేతం అవగానే భోజన పానీయాలు విరమించుకుని రోజా పాటించడం మొదలెట్టి దైవప్రసన్నతను పొందినట్లే, దేవుని మరో సైగ అందగానే

రోజా వ్రతాన్ని విరమించుకుని అన్నపానీయాలు మొదలెట్టడం కూడా దైవప్రసన్నతకే కారణమవుతుంది. ఉపవాస వ్రతాన్ని ప్రారంభించే ముందు, దైవాదేశం రీత్యా, ఉషోదయానికి పూర్వం పుచ్చుకునేది 'సహరీ' అయితే, సూర్యాస్తమయం వెంటనే అదే దైవాదేశాన్ని అనుసరించి చేసే ఉపవాస వ్రత విరమణనే 'ఇఫ్తార్' అంటారు.

ఉపవాస వ్రతాన్ని సహరీతో ప్రారంభించే సంప్రదాయం ఒక్క ఇస్లామ్‌కే ప్రత్యేకం. అంతిమ దైవప్రవక్త మహనీయ ముహమ్మద్ (స) ఇలా బోధించారు:

"సహరీ చెయ్యండి, సహరీ చేయడం శుభకరమయినది." (బుఖారి, ముస్లిమ్)

సహరీ, పగలంతా దైవాజ్ఞాపాలనను గడిపేందుకు ఎంతగానో ఉపకరిస్తుంది. శరీరాన్ని బలహీనపడనివ్వదు; ముప్పూటలా తినమరిగిన శరీరం ఒక్కపూట దొరక్క పోయినా తల్లడిల్లిపోతుంది, ఢీలా పడిపోతుంది. దైవాదేశాల పాలన తృప్తికరంగా జరగదు. అందుకే సహరీ.

మహనీయ ఇర్బాజ్ బిన్ సారియా (ర) తెలిపినదాని ప్రకారం, ఒకసారి రమజాన్ నెలలో కారుణ్యమూర్తి (స) నన్ను సహరీ భుజించడానికి ఆహ్వానిస్తూ, "రావయ్యా, శుభకరమయిన అల్పాహారానికి!" అన్నారు. (అబూదావూద్, నసాయి)

ఉపవాస వ్రతం పాటించడమంటే దైనందిన కార్యకలాపాలను విరమించుకుని 'అల్లాహ్, అల్లాహ్' అనుకుంటూ మూలన కూర్చోవాలన్నది ఉద్దేశ్యం కాదు. ఉపవాస వ్రతంలో దైవాజ్ఞాపాలనకే ప్రాధాన్యం. రోజువారీ పనులకు దాసుడు దూరమవడం, ఉపవాసవ్రతంలోగల అసలు ఉద్దేశానికి విఘాతం. అందుకే సహరీ తప్పక భుజించాలని ఆదర్శమూర్తి (స) బోధించారు. అప్పుడే దైనందిన కార్యకలాపాలు సజావుగా సాగుతాయి.

మహనీయ అబూ హురైరా (ర) ప్రకారం దైవ సందేశహరులు (స), "విశ్వాసికి అత్యుత్తమమయిన సహరీ ఖర్జూరపండ్లు" అని అన్నారు, (అబూదావూద్). ఖర్జూర ఫలాలు మానవునికి అవసరమయిన ఆహార విలువలు పరిపూర్ణంగా గల పదార్థం. అందుకే దాన్ని బలపరిచారు మానవ మహోపకారి (స).

ఇక ఇఫ్తార్‌లోనూ దైవాజ్ఞాబద్ధత దర్శనమిస్తుంది. పగలంతా తన దినసరి కార్యక్రమాలలో తలమునకలయి ఉండే దాసుడు అనుక్షణం దైవాదేశాల ఉల్లంఘన జరక్కుండా జాగ్రత్తపడుతూ గడుపుతాడు. తన ఉదర వాంఛల్ని, మనోకాంక్షల్ని అదుపులో ఉంచుకుంటాడు. కాని తిరిగి దైవాదేశమయి అనుమతి లభించగానే వ్రత విరమణలో కూడా అగ్రగామిగానే ఉంటాడు. అంటే ఇంతవరకు దైవాజ్ఞే అతన్ని కట్టడి చేసింది. ఇప్పుడూ దైవాదేశమే అతన్ని విడిచిపెట్టిందని చాటుతున్నాడన్న మాట. స్వేచ్ఛగా తన కోర్కెల్ని నెరవేర్చుకుంటున్నాడు. ఇలా తాను దైవవిధేయతలో ముమ్ముందుగా ఉండే దాసుడని, 'ముస్లిమ్'నని సాక్ష్యం పలుకుతున్నాడు. ఇదే దైవానికి ఇష్టమయినది. అందుకే:

మహనీయ సహత్ (ర) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు:

"ఇఫ్తార్ చేయడంలో ఆలస్యం చెయ్యకుండా త్వరపడే వరకు మనుషులు శుభాన్ని ఆశ్రయించి ఉంటారు." (బుఖారి, ముస్లిమ్)

మహనీయ అబూ హురైరా (ర) ఉల్లేఖించిన దాని ప్రకారం, ప్రవక్త శ్రేష్ఠులు ఇలా బోధించారు:

"అల్లాహ్ తన దాసుల్లో ఇఫ్తార్ చెయ్యడానికి త్వరపడేవారంటే చాలా ఇష్టమని అంటున్నాడు." (తిర్మిజి)

'ఇఫ్తార్' చెయ్యడమే కాదు, చేయించడం కూడా పుణ్యప్రదమే.

జైద్ బిన్ ఖాలిద్ (ర) ప్రవక్తశ్రీ(స) చెప్పినట్లు ఉల్లేఖించారు, "ఒక ఉపవాసవ్రతం పాటించే వ్యక్తికి ఎవరయినా ఇఫ్తార్ (భోజనం) చేయించినట్లయితే అతనికి ఆ రోజా పాటించే వ్యక్తికి లభించే పుణ్యఫలమే ప్రాప్తమవుతుంది." (బైహకీ)

అందుకే మన కాలంలో ఇఫ్తార్ విందులు విరివిగా జరుగుతున్నాయి. కాని వాటిలో దైవభక్తి, దైవ సంస్మరణ, దైవాదేశాల ప్రస్తావన, దైవాజ్ఞాపాలనా భావన- ఏ మేరకు ఉంటున్నాయి? వీటికి ఆ పుణ్యఫలం ప్రాప్తిస్తుందా? ఏమో!

(29-11-2002)

రోజా విరమణ

అల్లాహుమ్మ లక సుమ్తు వబిక ఆమన్తు వ అలైక తవక్కల్తు వ అలా రిజ్కిక అఫ్తర్తు ఫ తకబ్బల్ మిన్నీ.

ఇది ఒక చిన్న దుఆ, ప్రార్థన, వేడుకోలు. దీని సరళమయిన అనువాదం దాదాపు ఇలా ఉంటుంది:

"అల్లాహ్! నేను నీ కోసమే రోజా ఉపవాస వ్రతాన్ని పాటిస్తున్నాను; నిన్నే విశ్వసిస్తున్నాను, నిన్నే నమ్ముకున్నాను; నీ పైనే భారమంతా మోపి ఆశలు పెట్టుకున్నాను; నీవు ప్రసాదించిన ఆహారం ద్వారానే రోజా విరమణ చేస్తున్నాను; ప్రభూ, ఇదో నా తరఫున దీన్ని స్వీకరించు!"

స్థూలంగా చూస్తే ఇది అతిసాధారణ పదాలున్న అతిసాధారణ ప్రార్థన. దాన్ని రోజా విరమణ సందర్భంలో ప్రభు సన్నిధిలో రోజా వ్రతాన్ని అర్పించుకుంటూ దాసుడు నివేదించుకుంటాడు. అయితే దీన్ని కాస్త పరిశీలనగా, కాస్త లోతుగా గమనిస్తే ఒక భావ సముద్రం ఇందులో నిక్షిప్తమయి ఉందని ద్యోతకమవుతుంది. ప్రార్థనలు నిజానికి ప్రార్థించే వ్యక్తిలోని ఆకాంక్షలు, ఆలోచనలు, ఆశయాలు, ఆశలకు ప్రతిబింబాలు. అయితే ఆలోచనల్ని, ఆశల్ని, ఆశయాలను, ఆకాంక్షల్ని సయితం సంస్కరించుకోవాలని, మానవుని ధ్యేయం, లక్ష్యం కూడా పరిశుద్ధంగా, పవిత్రంగా, ప్రకాశమానంగా ఉండాలని దైవధర్మం కోరుకుంటుంది.

తదనుగుణంగానే ప్రవక్త మహనీయులు (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) తన దివ్యమయిన బోధనల్లో మానవుల పరమార్థమేదో విశదంగా తెలిపారు. ఎటువంటి ఆశల్ని పెంచుకోవాలో, ఎటువంటి ఆశయాలను ఎన్నుకోవాలో, ఎటువంటి ఆలోచనల్ని

రూపొందించుకోవాలో, ఎటువంటి ఆకాంక్షల పరిపూర్తికై పరితపించాలో క్షుణ్ణంగా ఉపదేశించారు. ప్రవక్త దైవసన్నిధానంలో వేడుకున్న ప్రార్థనలన్నింటిలో ఈ భావాలు భవ్యరూపంలో దర్శనమిస్తాయి.

పైన పేర్కొన్న చిన్న ప్రార్థనలోని పదాలనే పరిశీలిద్దాము. రమజాన్ నెల, దైవ విశ్వాసి దైవాజ్ఞాబద్ధుడయి రోజా పాటిస్తున్న నెల. సమయం సూర్యాస్తమయం. సన్నివేశం రోజా విరమణ సందర్భం. దాసుడు విధేయతాభావంతో, ఎంతో శ్రద్ధాభక్తులతో దైవాజ్ఞాపాలన చేసినందుకు కృతజ్ఞతతో, ఒకింత సంతోషంతో, ఆనందంతో, దైవసన్నిధిలో తన రోజా వ్రతాన్ని సవినయంగా సమర్పించుకుంటున్న వేళ. అప్పుడు సంస్కార వంతుడయిన దాసుడు వినమ్ర మనస్కుడయి వేడుకుంటున్న పదాలు, అతని అంతర్యాన్ని విప్పి పెట్టిన మాటలు:

అల్లాహుమ్మ లక సుమ్తు: దేవా, నీ కోసమే రోజా వ్రతాన్ని పాటిస్తున్నాను. ఇందులో ప్రదర్శనాబుద్ధికిగాని, ఇతరుల మెప్పు పొందాలనిగాని, నలుగురిలో భక్తిపరాయణతను చాటుకోవాలనిగాని ఎటువంటి అభిప్రాయమూ నాలో లేదు. కేవలం నీ ఆజ్ఞలకు లోబడి, నీవు బోధించిన విధానానికి కట్టుబడి, నీ మెప్పును, నీ ప్రసన్నతను, నీ అభిమానాన్ని చూరగొనాలన్న ఆశతో నీ కోసమే పాటిస్తున్నాను ఈ రోజా వ్రతాన్ని.

దాసుని ఈ మనోభావానికనుగుణంగానే పరమ ప్రభువు ఇలా సెలవిచ్చాడని ప్రవక్త మహనీయులు (స) తెలిపారు: “రోజా నా కోసమే, నేనే దానికి ప్రతిఫలాన్నిస్తాను.” కాబట్టి సకల సత్కార్యాలు అల్లాహ్ కోసమే చేసినా వాటిలో ఎక్కడో ఒక చోట ప్రజలకు కానవచ్చే అంశం ఉంటుంది. కాని ఉపవాసముండేవారికీ వారి దైవానికే తప్ప రోజా ఎవరికీ కానరాదు. అందువల్లనే విశ్వాసి తన దైవానికి నివేదించుకుంటాడు- లక సుమ్తు!

బిక ఆమన్తు: నిన్నే విశ్వసిస్తున్నాను. నా ఆరాధ్యునిగా, నా సృష్టికర్తగా, నా పాలకునిగా, నా ప్రభువుగా, నా స్వామిగా, నా ప్రార్థనల నాలకించేవానిగా, నా అవసరాలను తీర్చేవానిగా, నా ఆపద్బాంధువునిగా, నా వరప్రదాతగా, నా జీవన దాతగా, నా మరణాధినేతగా, నా మార్గదర్శిగా, నా ఏకైక దైవంగా నిన్నే విశ్వసిస్తున్నాను; నీవు తప్ప మరెవ్వరి అండదండలూ నాకు లేవు; నీ దయవల్లనే పూర్తి చేయగలుగుతున్నాను ఈ రోజా వ్రతాన్ని.

ఇది చూడటానికి చాలా సులువయిన భావనగానే అగుపడుతుంది. కాని దేవుని దాస్యానికి సదృశంగా మానవుని జీవన మార్గంలో ఆకాంక్షలు, ఆశలు, అభిలాషలు ఎన్నో అడ్డువచ్చి ఈ భావనా భవనాన్ని కూలదోయ ప్రయత్నిస్తాయి. వాటినన్నింటినీ తట్టుకుని ఒకే దేవుని పట్ల ఆరాధనా భావం, దాస్యభావం, విశ్వాస భావం కలిగి ఉండటం సామాన్య విషయం కాదు. బహు దైవోపాసనను కాదనడం అంటే కేవలం ఆరాధనాలయాల్లో

ఒకే దైవాన్ని ఆరాధించడం కాదు, నిత్య జీవితంలో, వ్యక్తిగత స్థాయిలో మొదలుకుని కుటుంబం, సమాజం, సంపాదన, పరిపాలన– అన్ని రంగాలలో ఆ ఏకైక ప్రభువు విధేయతను పాటించడమన్నమాట. అదే– బిక ఆమన్తు!

అలైక తవక్కల్తు: నీ పైనే భారం మోపుతున్నాను. నా మనుగడలో ఎదురయ్యే ఇక్కట్లను కడతీర్చడానికయినా, చేసే మంచి పనులు నెరవేరటానికయినా, బ్రతుకు బాటలో తటస్థపడే మెట్టపల్లాల్లో ఆదుకోవటానికయినా, ఆశానిరాశల ఊగిసలాటలో నిలకడ ప్రసాదించటానికయినా, రకరకాల వ్యామోహాల వలల్లో జారిపడకుండా రక్షించడానికయినా– అంతా నీదే భారం, నీపైనే నా ఆశలన్నీను. నీ భరోసాతోనే ఉపవాసమున్నాను, నీ ప్రసన్నతపై ఆశతోనే విరమిస్తున్నాను ఈ రోజా వ్రతాన్ని.

అల్లాహ్‌పై భరోసా కలిగి ఉండటం తప్ప మానవునికి గత్యంతరం లేదు. ప్రపంచం మనిషికి కార్యక్షేత్రమే అయినా, కృషి చేయడమే అతని వంతు. ఆ కృషి సఫలీకృతమవడం అతని చేతుల్లో లేదు. విశ్వప్రభువు అనుజ్ఞతో, ఆయన ఆదేశం మేరకే ఏం జరిగినా. ప్రయత్నాలన్నీ చేసి, తనకున్న శక్తిసామర్థ్యాలన్నీ ప్రయోగించి, ఆ పని నెరవేరడానికి అవసరమయిన అన్ని హంగులూ వినియోగించినప్పటికీ అది సఫలీకృతమవడానికి ఆ ప్రభువు ఆదేశం పైనే ఆధారపడవలసి ఉంటుంది. అందుకే– అలైక తవక్కల్తు!

అలా రిజ్కిక అఫ్తర్తు: నీవు ప్రసాదించిన దానితోనే ఇఫ్తార్ (ఉపవాస విరమణ) చేస్తున్నాను. ఈ లోకంలో నాదేముందనీ? నేను తినేదీ త్రాగేదయినా, తొడుక్కునే బట్టలయినా, మనుగడ గడిపే గూడయినా, అన్నీ నీవు ప్రసాదించినవే. నా దేహ బలం, నా ఇంద్రియ శక్తులు, అంగాంగాల్లో నిగూఢమయిన సామర్థ్యాలు, నా మనోబలం, ధైర్యం, స్థయిర్యం, బుద్ధికుశలత, జ్ఞాన సంపన్నత, విద్య, నా సంసారం, నా సంపాదన, నాలోని సమస్తమూ నీవు అనుగ్రహించినవే. నీవు ప్రేమతో ఇచ్చిన దానితోనే విరమిస్తున్నాను ఈ ఉపవాస వ్రతాన్ని.

ఉపాధినిచ్చేది మన విద్యా విజ్ఞానాలూ కావు, ప్రతిభా పాటవాలూ కావు. అన్నీ ఉన్నా సంపాదన మాత్రం సున్న అన్న చందాన ఎన్ని కుటుంబాలు పస్తుల పాలవడం లేదు? ఎన్ని బొటనవ్రేళ్ళ జ్ఞానులు సంపాదనా ధురంధురులయి ప్రపంచంలో వెలిగిపోవడం లేదు? ఎవరికి ఎంత ఉపాధి, ఏ మార్గాన ఇవ్వాలో, అవకాశాలను ఆయనే నిర్ణయించి మరీ ప్రసాదిస్తాడు. ఎవరికి ఏది ప్రాప్తమయినా అది అతని స్వార్జితమూ కాదు, పిత్రార్జితమూ కాదు, అవకాశాలన్నీ మూలతః దైవప్రసాదితాలు. ఈ వాస్తవాన్ని ఎరిగి, ఆ స్పృహతో, ఆ కృతజ్ఞతాభావంతో మెలిగేవాడే దైవ విశ్వాసి. ప్రతిదాన్ని ఆ ప్రభువు అనుగ్రహంతో ముడిపెట్టడమే దాసుని ప్రతిభకు ఆనవాలు. అందుకే అంటాడు– అలా రిజ్కిక అఫ్తర్తు!

ఫ తకబ్బల్ మిన్నీ: కనుక స్వామి దీన్ని స్వీకరించు. నేను ఎన్ని సత్కార్యాలు చేసినా, ఎన్నెన్ని ఆరాధనలు, సాధనలు చేసినా, ఏఏ ప్రజోపయోగ కార్యాలు సాధించినా అవన్నీ నీ కోసమే అన్న సంకల్ప శుద్ధితో, నిన్నే సరయిన విధంగా విశ్వసిస్తూ, అన్నీ మంచీ చెడులకు నిన్నే నమ్ముకుని, అన్నీ నీవు ప్రసాదించినవే అన్న సద్భావంతో వాటిని నిర్వర్తించాను; ప్రభూ! ఇదో నీకు సమర్పించుకుంటున్నాను, స్వీకరించు ఈ రోజా వ్రతాన్ని.

మనిషి ఏ కార్యాలు సాధించినా అవి ప్రభువు సన్నిధిలో స్వీకారయోగ్యంగా పరిగణించబడనంతవరకు ఫలప్రదం కావు; ప్రభు చెప్పిన ఆదర్శ విధానాన్నే అనుసరించి, ఎటువంటి ప్రాపంచిక ప్రయోజనాన్ని ఆశించకుండా ఏ సత్కార్యాన్నయినా ఆచరించాలి. అప్పుడనాలి- ఫ తకబ్బల్ మిన్నీ!

ఈ చిన్న ప్రార్థన వాక్యం ఎంత భావగర్భితమో!

(7-11-03)

రక్షణ కోసమే ఈ శిక్షణ

రమజాన్ నెలలోని ఒక్కో ఘడియ ఒక్కో శుభ మహాసాగరం. మానవుల ఆలోచనాత్మక శిక్షణకు, ఆచరణాత్మక సంస్కరణకు, ఆధ్యాత్మిక వికాసానికి దైవం నియమించిన మహత్తర అవకాశం. ఇటువంటి పవిత్ర వాతావరణంలో శారీరక, మానసిక సాధనల ద్వారా విప్లవాత్మకమయిన నైతిక ప్రగతి సుసాధ్యమవుతుంది. ఈ శుభప్రదమయిన మహదవకాశం లభించినా ప్రయోజనం పొందే ప్రయత్నం చెయ్యని దౌర్భాగ్యుని గురించి విచారించి ప్రయోజనం?

రమజాన్ నెలలో ఊపిరి పీల్చే వ్యవధి దొరికినవారు, మరుసటి సంవత్సరం ఇటువంటి పుణ్యప్రదమయిన అవకాశం ప్రాప్తిస్తుందో లేదో అని బాధపడటంకన్నా దొరికిన ఈ గడువును సద్వినియోగపరచుకునేందుకు అన్ని విధాలా కృషి చెయ్యాలి. ఈ కృషిలో భాగమే రోజా- ఉపవాసవ్రతం.

> విశ్వసించిన జనులారా, మీకు ఉపవాస వ్రతాలను పాటించడం విధిగా నిర్ణయించ బడింది. మీకు పూర్వపు సముదాయాలకు విధించబడినట్లే మీకున్నూ. తద్వారా మీరు నిష్ఠాపరులు కాగలగాలని. (అల్ బకర : 183)

ఉపవాస వ్రతంలో ఏమవుతుంది? ఉషోదయానికి పూర్వం, వేళకాని వేళ ఎంతో కొంత ఆహారం పుచ్చుకుని, సాయంత్రం సూర్యాస్తమయం వరకు, దాదాపు 10 నుండి 14 గంటల వరకు ఎటువంటి ఆహారం, కనీసం నీళ్ళయినా ముట్టుకోకుండా గడపడం రోజా లేక ఉపవాస వ్రతానికి బాహ్యరూపం. ఇందులో, ఒక్క పూటయినా రెండు మెతుకులు దొరక్క ఆకలి బాధతో అలమటించే వారి ఆవేదన అర్థమవుతుంది- గ్రహించ గలిగే మనసుంటే, అనుభూతులకు స్పందించే హృదయముంటే.

ఫలితంగా నిరుపేదల కష్టాలను దూరం చేసి వారిని సకల విధాలా సముద్ధరించే సంస్కార అభిలాష జనిస్తుంది. మానవీయ సానుభూతి, ప్రేమ, దయాదాక్షిణ్యాలు పుడతాయి. బీదల కడగండ్లకు అడ్డుకట్ట వేయాలన్న సత్సంకల్పం ఏర్పడుతుంది. తోటి మానవుల పట్ల సోదరభావం, అనాథల పట్ల ఆదరణ, అగత్యపరుల పట్ల శ్రేయోభిలాష పెల్లుబుకుతాయి. అందరి బాధలు పంచుకుని శుభాలను ఆస్వాదించే సరయిన సమయం ఈ నెల.

ప్రవక్త మహనీయులు (స) తోటి వారి అందరిలో ఇతోధిక అనుగ్రహశీలి, కాని ఈ నెల రాగానే మునుపటికన్నా ఎన్నో రెట్లు అధికంగా అనుగ్రహశీలిగా మారిపోయేవారు. (బుఖారి)

రోజా వ్రతంలో మనిషి అన్నపానీయాలకు, కాంక్షలకు దూరంగా ఉంటాడు. తద్వారా సహనం, నిగ్రహం, ఓరిమి పుడతాయి. పాపపు కార్యాలను, అపరాధాల నుండి తప్పించుకునే శిక్షణ ప్రాప్తమవుతుంది. పగలంతా ధర్మసమ్మతమయిన తన అవసరాలను, ఆకాంక్షలను అదుపులో పెట్టుకోగల మనిషి అధర్మమయిన విధానాలవలంబించి తన కాంక్షల పరిపూర్తికి పాల్పడతాడా? ఆత్మ నిగ్రహానికి ఇంతకన్నా బలమయిన సాధనం మరొకటి ప్రాప్తం కాగలుగుతుందా? ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు:

మీలో రోజా వ్రతాన్ని పాటించేవారు, తమ నోటితో లజ్జాకరమయిన మాట పలకరాదు. గలభ చెయ్యరాదు, పోకిరి చేష్టలకు పాల్పడరాదు. ఎవరయినా తనతో తిట్లకు తగువుకూ దిగినా, తాను ఉపవాసం పాటిస్తున్నానన్న స్పృహ అతనిలో అనునిత్యం జాగృతమవ్వాలి, తాను దుర్భాషకు దిగరాదు. (బుఖారి)

ఈ సహన గుణం కష్టాలలో ఆపదలలో మనిషికి నిలకడను, స్థయిర్యాన్ని ప్రసాదిస్తుంది. అన్యాయంగా ప్రవర్తించిన వారి పట్ల సానుభూతి జనిస్తుంది. దౌర్జన్యం చేసినవారి పట్ల క్షమాభావం కలుగుతుంది. తనను కాదన్న వాని పట్ల దాతృగుణం ఉత్పన్నం చేస్తుంది. తన హక్కును కాజేసిన వానిపట్ల వారి హక్కుల నిర్వర్తనకు పురికొలుపుతుంది. అన్ని విధాలా, అన్ని కోణాల్లో మనిషి తన్నుతాను సహన స్థయిర్యాల ప్రతిరూపంగా మలచుకుంటాడు. ప్రవక్తశ్రీ (స) ఈ నెలను “సహనం చూపే నెల, సహనానికి ప్రతిఫలం స్వర్గం” అని సెలవిచ్చారు.

రోజా మనిషికి కేవలం ఆకలి దప్పులకు అలవాటు చెయ్యదు, దీని అసలు ఉద్దేశ్యం మనిషిని దైవ విధేయుడుగా, దుష్కార్యాలకు అతీతంగా, పవిత్రంగా తీర్చిదిద్దడం.

ప్రవక్తాగ్రసరులు (స) ఇలా బోధించారు:

ఎవరయితే రోజా పాటిస్తూ కూడా అబద్ధాలు పలకడం, అబద్ధాలు ఆచరించడం మానుకోరో, అటువంటి వారు అన్నపానీయాలను వదలి పస్తులుండటం పట్ల అల్లాహ్‌కు ఎటువంటి ఆసక్తి లేదు.. (బుఖారి)

అన్నింటికంటే ముఖ్యమయినది పరలోక చింతన. ఎన్ని ఆరాధనలు ఆచరించినా, ఎన్ని ఉపాసనలను పాటించినా పరలోక చింతన లేనిదే అన్నీ వ్యర్థ ప్రయత్నాలయి పోతాయి. మనిషి ఏది చేసినా పరలోక సాఫల్యం కొరకు, దైవప్రసన్నత కొరకు, దైవాగ్రహాన్నుండి మోక్షం కొరకు చెయ్యకపోతే మిగిలేది ప్రదర్శనాబుద్ధి మాత్రమే. ప్రదర్శనా బుద్ధితో చేసేది ఏదీ ఫలవంతం కాజాలదు. మరణానంతరం దైవసన్నిధిలో చేసిన కర్మలన్నింటికీ జవాబు చెప్పుకోవలసి ఉందన్న ఆలోచన మనిషి ఆంతర్యంలో అనుక్షణం ప్రదీప్తమయి, నిత్యం జాగృతమయి ఉండటమే కీలకం. రోజా ఆ లక్షణాన్ని ప్రేరేపిస్తుంది. తాను దైవం కొరకు, పరలోకంలో దైవప్రసన్నత కొరకు ఈ దైవాజ్ఞా పాలన చేస్తున్న స్పృహతో పాటించే రోజా వ్రతం పరలోక చింతనకు ఉత్తమ సాధనం.

పరలోకంలో అత్యధిక ఫలాలను సాధించాలని రోజా పాటించే వ్యక్తి సత్కార్యాలను ఇతోధికంగా చేసే ప్రయత్నం చేస్తాడు. ఖుర్ఆన్ అవగాహనా కృషి అయినా, దైవప్రసన్నతకు అదనపు నమాజులయినా, దానధర్మాలయినా, నిరుపేదలకు ఇఫ్తార్ చేయించడమయినా, అగత్యపరుల్ని ఆదుకోవడమయినా అన్నీ మనిషిలోని పరలోక చింతనకు ఆనవాలుగా నిలుస్తాయి.

రమజాన్ నెలలోని ఒక్కో క్షణాన్ని దైవం అనుగ్రహించిన మహా వరప్రసాదంగా భావించాలి. చెడులకు దూరమయి మంచి పనులకు చేరువయి రమజాన్ నెలను గడిపినట్లయితే మిగతా పదకొండు నెలలూ అదే దారిన సాగుతాయి. ఈ నెలలో దైవ సంస్మరణ, సహన స్థయిర్యాలు, ధర్మసేవ, సమత్వం, సహానుభూతి, అగత్యపరులను ఆదుకోవడం వంటి సద్గుణాల పెంపుదలకు కృషి చేయాలి. ఈ సాత్విక గుణాలే సంవత్సరమంతా మీకు తోడయి ఉంటాయి.

ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు:

ప్రళయ దినాన 'రోజా' దైవానికి ఇలా వేడుకుంటుంది, "ప్రభూ, నేను ఈ వ్యక్తిచేత పగలంతా అన్నపానీయాలను, ఇతర రుచులూ కాంక్షలను మాన్పించాను. దేవా, ఇతని విషయంలో నా సిఫారసు స్వీకరించు," దానికి పరమ ప్రభువు రోజా చేసిన సిఫారసును స్వీకరిస్తాడు. (మిష్కాత్)

(14-11-03)

పండుగ శుభాకాంక్షలు!

పండుగలు సముదాయాల ఆనవాళ్ళు. పండుగలు జాతుల ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు, ఆనందాలకు ప్రతీకలు. పండుగలు జన జీవనంలో మూల్యాలకు, ప్రమాణాలకు ప్రతిబింబాలు, పండుగలు సామాజిక స్వరూప స్వభావాలకు నిలువుటద్దాలు. పండుగలు మానవ జీవితంలో అత్యవసరమయిన అనివార్యపు మజిలీలు. పండుగలు సజీవ సామూహిక వ్యవస్థకు ప్రాణాలు. పండుగలు నాగరికతా సౌధాలకు, సంస్కృతీ సౌందర్యాలకు, మాన మర్యాదల శోభలకు నిర్మాణ పాత్రధారులు. ఈదుల్ ఫిత్ర్- అదే రమజాన్ పండుగ- ఇస్లామ్ ప్రబోధాలకు, ముస్లిముల ప్రకృతికి, ధార్మిక సభ్యతకు సమగ్ర స్వరూపం.

ఈద్ ఒక ఆరాధన. అది రమజాన్ నెల నెలవంక చూసిన తరువాత ప్రారంభమవుతుంది. రమజాన్ నెల మొత్తాన సాగుతుంది. రమజాన్ నెల ముగిసి, షవ్వాల్ నెల నెలవంక చూసిన తరువాత కృతజ్ఞతాభివందనాల నమాజ్- పండుగ నమాజ్-తో ముగుస్తుంది. అందుకే పండుగ శుభాకాంక్షలకు అసలయిన అర్హులు- రమజాన్ నెల సాంతం రోజా వ్రతాన్ని, దాని నియమ నిబంధనలతో పాటించిన వారు, దివ్యఖుర్ఆన్ ద్వారా ఇతోధికంగా ప్రయోజనం పొందే కృషి చేసిన వారు, దాన్ని పారాయణం చేసిన వారు, దాన్ని అవగతం చేసుకున్న వారు, దాన్ని ఆచరించే ప్రయత్నం చేసిన వారు, రమజాన్ విశ్వాసులకు బహూకరించే వరప్రసాదం, ధర్మనిష్ఠా శిక్షణ ద్వారా ప్రయోజనం పొందినవారు- వీరే శుభాకాంక్షలకు నిజమయిన హక్కుదారులు.

దివ్యఖుర్ఆన్‌లో రమజాన్ నెలలో పాటించే ఉపవాస వ్రతాలకు రెండే ఔచిత్యాలు సూచించబడ్డాయి. ఒకటి, పాటించేవారిలో 'తక్వా' (ధర్మనిష్ఠ) గుణం పెంపొందడం:

"మీకు ఉపవాస వ్రతాలు విధిగా నిర్ణయించడం జరిగింది, మీకు పూర్వపు సముదాయాలకు విధిగా నిర్ణయించినట్లే, తద్వారా మీలో 'తక్వా'- ధర్మనిష్ఠ- జనించా లన్నది ఉద్దేశ్యం."

రెండు, రమజాన్ నెలలో ఖుర్ఆన్ వంటి మహత్తరమయిన కానుక మానవులకు అల్లాహ్ అందజేసినందుకు కృతజ్ఞతలు చెల్లించుకోవడం:

"తద్వారా మీకు మార్గదర్శనం అనుగ్రహించినందుకు మీరు అల్లాహ్ మహత్తును కొనియాడాలని, ఆయనకు కృతజ్ఞతలు అర్పించుకోవాలనీను."

ఈ ఆదేశం మేరకే పండుగ రోజున 'ఈద్‌గాహ్' (పండుగ నమాజ్ జరుపుకునే స్థలం)కు వెడుతూ, నమాజ్‌కు ముందు దైవ కీర్తనం ఇలా చేస్తూ ఉంటారు భక్తులు :

అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్;
లా ఇలాహ ఇల్లల్లాహు,
అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్;
వ లిల్లాహిల్ హమ్ద్!

దేవుడే మహత్తుగల వాడు, దేవుడే గొప్పవాడు;
దేవుడు తప్ప మరో ఆరాధ్యుడెవ్వడూ లేడు,
దేవుడే గొప్పవాడు, దేవుడే మహత్తుగల వాడు;
సమస్త స్తోత్రాలు అల్లాహ్‌కే చెల్లు!

భక్తుల నోట వాతావరణమంతటా విస్తరించే ఈ ప్రకటనకు సృష్టి యావత్తు వంత పాడుతుంది!

రమజాన్ నెల అంతటా రోజా వ్రతాన్ని పాటించి, అది పెంపొందించగోరే ధర్మనిష్ఠను తనలో జాగృతం చేసుకుని, తదనుగుణంగా జీవితమంతా దేవుని అవిధేయతకు దూరంగా మెలుగుతూ ఆయన ఆజ్ఞాపాలనలో తనకు ఇష్టమయిన వాటినన్నింటినీ త్యాగం చేయడాన్ని అలవరచుకుంటే, అల్లాహ్ దాస్యానికి ఆపాదమస్తకం మనిషి సన్నద్ధమయి నట్లయితే, అతను తన మనస్సును అదుపులో ఉంచుకుని, అది తన గొంతెమ్మ కోర్కెలకు అతన్ని బలవంతపెట్టలేకపోయినట్లయితే, అల్లాహ్ ఆదేశాలకు విరుద్ధమయినదేదీ అతని చేత చేయించడంలో అది సఫలత పొందలేకపోతే, తక్వా గుణం- రోజా వ్రతం అతనిలో జనింపజేయాలని ఉద్దేశించిన గుణం- అతనికి అబ్బినట్లే- అలాంటి వారే పండుగ శుభాకాంక్షలకు యోగ్యులు!

ఖుర్‌ఆన్‌ని తన చివరి మార్గదర్శక గ్రంథంగా పంపినందుకు దేవునికి కృతజ్ఞతలు అర్పించుకునే విధానమేది? వీనుల విందుగా పారాయణం చేయడం, చేయించడం, ఒక్క మాటా అర్థంకాకపోయినా పఠించి చిలుకలా వల్లించడం; అందమయిన లేఖన కళలో అరబీ ఆయత్‌లను వ్రాయించుకుని డ్రాయింగ్ రూములలో అలంకరించుకోవడం- అంతేనా? అది కాదు; అది మానవాళికి దేవుని అమూల్యమయిన జీవనపథ నిర్దేశన అని విశ్వసించడం, మనఃపూర్వకంగా అది చూపే దారిని అన్వేషించడం, దాన్నే జీవితంలో అనుసరించే దృఢసంకల్పం చేసుకోవడం, ఆచరణాత్మకంగా జీవితంలో దాని బోధనల ద్వారా ప్రయోజనం పొందడం, అది సూచించే పరిశుద్ధ జీవితాన్ని ఆదర్శంగా గ్రహించి అవలంబించడం! ఖుర్‌ఆన్ దైవ గ్రంథమనే నమ్మినట్లయితే దాని ఆదేశాలకు విరుద్ధమయిన ప్రతిదాన్నీ తిరస్కరించడం, తన శీల స్వభావాలలో దాన్ని పూర్తిగా ఇముడ్చుకోవడం. రమజాన్ నెలలో ఈ దృష్టితో, ఈ దృక్కోణంతో ఖుర్‌ఆన్‌ని పారాయణం చేసుకున్న వాడు, అర్థం చేసుకుని ఆచరించే సంకల్పం చేసుకున్న వాడు ధన్యుడు, నిజంగా పండుగ శుభాకాంక్షలకు అర్హుడే- సందేహం లేదు!!

రమజాన్ నెలలో అబ్బిన భయభక్తుల గుణాలు, సాత్విక లక్షణాలు, సానుభూతి నిండిన మనస్తత్వం, మంచిని ఎల్లెడలా పెంచాలన్న ఆకాంక్ష, చెడులను అణచివేయాలన్న ఆవేశం, మనసుకు నచ్చని దాని పట్ల సహనం, రుజుమార్గంలో ఎన్ని కష్టాలనయినా భరించాలన్న సత్సంకల్పం, సన్మార్గంలో నిలకడ సడలరాదన్న ఆవేదన- ప్రతిదీ రమజాన్ ముగియగానే అంతమవరాదు. రమజాన్ ప్రసాదించే ఈ శిక్షణ, ఈ మానసిక ప్రక్షాళన రాబోయే పదకొండు నెలల్లోనూ కొనసాగాలన్న దృఢనిశ్చయం కూడా అంతర్యంలో సుస్థిరపడాలి. మళ్ళీ రమజాన్ నెల వచ్చేవరకు శ్వాస మిగిలి ఉంటే నేటి శిక్షణ నిదర్శనాలు ఆనాడూ దర్శనమివ్వాలి. ఈ గుణాలు మళ్ళీ రమజాన్ నెల శిక్షణలో సానదేలి ద్విగుణీ కృతమవ్వాలి, బహుగుణీకృతమవ్వాలి. ప్రతి ముస్లిమ్ పరిణతి చెందిన మానవ మూర్తిగా పరివర్తనం చెందాలి, రూపాంతరం చెందాలి. అదే రమజాన్ సందేశం, అదే పండుగ సందేశం, అదే ఈనాటి అవసరం. మనం దీనికి సిద్ధమేనా?!

(6-12-2002)

సంబరాలు శ్రుతిమించరాదు!

రమజాన్ నెలపొడుపు తన మృదుమధురమయిన నిర్మల స్వర్ణరూపంతో సూర్యాస్తమయ సంధ్యవేళ పశ్చిమాన దర్శనమివ్వగానే ఆ నగుమోము చూసిన కనులన్నీ దరహాసాన్ని అలంకరించుకుంటాయి. సంబరాలు జరుపుకుంటారు విశ్వాసులు. ఉపవాస వసంతం పులకించిందన్న తియ్యని సందేశం వాతావరణమంతా ఘుమఘుమ లాడు తుంది.

"రమజాన్ ముబారక్" అన్న శుభాకాంక్ష వచనాలు ప్రతి నోటా నాట్యమాడతాయి, ఇంటింటా పరవళ్ళుద్రొక్కుతాయి. స్త్రీ పురుషులు, యువతీయువకులు, ఆ నెలవంకలానే ముఖాలు విప్పార చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకుంటారు. ఇంతకూ ఆ నెలరేడు "పండుగ" సందేశాన్ని అందివ్వలేదు, రమజాన్ నెల, ఉపవాసాల నెల మొదలయిందని తెలిపింది.

ఇదే హడావిడి, ఇవే సంబరాలు, ఇవే శుభాకాంక్షల వాతావరణం సరిగ్గా నెల తరువాత తిరిగి దర్శనమిస్తుంది. రమజాన్ నెల ముగిసి, "షవ్వాల్" నెలవంక నిగనిగ లాడుతూ దర్శనమివ్వగానే మరోసారి "ఈద్ ముబారక్", "చాంద్ ముబారక్" అన్న వచనాలు ముస్లిముల వాడల్లో ఎల్లెడలా పుష్పిస్తుంటాయి. రమజాన్ నెల ముగిసింది, ఉపవాసాల వేడుకలు అంతమయ్యాయి, నెల అంతా సుఖశాంతులతో గడచిపోయింది. ఉపవాసాలు సలక్షణంగా పూర్తి అయ్యాయి అన్న ఆనందం ఆ ఘడియల్లో విశ్వాసుల కనురెప్పల్ని ముద్దాడుతూ ఉంటుంది. పండుగ ఉత్సాహం పెల్లుబుకుతుంది. తెల్లవారితే పండుగ - "ఈదుల్ ఫిత్ర్" - అదే రమజాన్ పండుగ!

"రమజాన్ పండుగ" అని మనం తెలుగునాట పిలుచుకునే పండుగ నిజానికి "రమజాన్" నెల గడచిన తరువాత 'షవ్వాల్' నెల మొదలయిన సందర్భంలో జరుపుకునే

పండుగ. అయినా అది రమజాన్ పండుగ అనే ప్రతీతి. దానికి కారణముంది. వాస్తవంగా ఇది రమజాన్ నెల సాంతం సాగే పండుగ. ఒక్కనాటి పండుగ కాదు. ఆ నెల మొత్తాన విశ్వాసులకు ప్రతి దినం పండుగే. నెల రోజులూ 'సహరీ', 'ఇఫ్తార్'ల హడావిడితో ఉల్లాసరవళులతో కళకళలాడుతుంటాయి ముస్లిముల లోగిళ్ళు. రాత్రిళ్ళేమో మస్జిదులన్నీ భక్తుల శ్రద్ధాపూర్వకమయిన నమాజులతో శోభిస్తుంటాయి. దీన్నేగా పండుగ అంటారు?

ఇస్లామ్ తన అనుయాయులకు రెండే రెండు పండుగలు ప్రతిపాదించింది. ఆ రెంటిలోను సంబరాలు సంతోష ప్రకటనలకు హద్దులు నిర్ణయించింది. ఎన్ని సంతోషాలు, సంబరాలు జరుపుకున్నా తమను సృష్టించి పాలిస్తున్న స్వామిని మరవరాదని బోధించింది. పండుగ రోజు ముఖ్యమయిన కార్యక్రమం ప్రత్యేక పండుగ నమాజ్ చెయ్యడం ఒకటి. స్వాదిష్టమయిన భోజనాలు ఆరగించడం, సంతోషంగా మిత్రుల్ని బంధువుల్ని కలసుకోవడం రోజంతా ఆనందంతో గడపడం, సరే అయితే సంస్కారాన్ని విడవరాదు, సభ్యతను మరువరాదు. ఇదీ ఇస్లామ్‌లో పండుగ జరుపుకునే తీరు.

హద్దుపద్దుల్లేని హంగామాలు, శ్రుతిమించిన సంబరాలు అదుపు తప్పిన ఆవేశాలు, ఆనందాలు- ఇస్లామ్ వీటిలో దేన్నీ అంగీకరించదు. ప్రతిదీ పరిమితులలో ప్రదర్శించాలని అంటుంది. సంతోషాన్నయినా దుఃఖాన్నయినా అతిగా తలకు చుట్టుకోరాదని బోధిస్తుంది. అప్పుడే జీవితం సమగ్రంగా, సమంజసంగా, సంతులితంగా సాగుతుందని ఉపదేశిస్తుంది. ఆ విధంగానే జీవితం సుఖవంతం అవుతుందని చాటుతుంది.

రమజాన్ నెల ప్రత్యేకత ఏమిటీ? అది మానవాళికి వారి ప్రభువు అల్లాహ్ తన మార్గదర్శకత్వం, అంతిమ మార్గదర్శకత్వం, దివ్యఖుర్‌ఆన్ అందజేసిన నెల. విశ్వకర్త, స్వామి, దేవుడు- మానవాళి అంతటికీ ప్రభువు, పాలకుడు. ఆయన భారతీయులకు దైవమయినట్లే అరబ్బులకు, అమెరికన్లకు, యూరోపియన్లకు, ఆఫ్రికన్లకు, చైనీయులకు అందరికీ ప్రభువే. ఆయన బోధనలు ఆదిలో మానవాళికి ఉపయోగపడినట్లే మధ్య యుగాల్లోనూ ఉపయోగపడ్డాయి, ఆధునిక కాలానికీ ఉపయుక్తమవుతాయి. ఆయన మార్గ దర్శకత్వం ఎల్లరికీ వర్తిస్తుంది. ఎల్లకాలాలకూ వర్తిస్తుంది. దైవగ్రంథమయిన దివ్యఖుర్‌ఆన్ గతంలోనూ అనుసరణీయమయినదే. వర్తమానంలోనూ అనుసరణీయమే, భావిలోనూ అనుసరణీయమయినదే.

దివ్యఖుర్‌ఆన్ తన్నుతాను పరిచయం చేసుకుంటూ దావా చేస్తుంది- అది దైవగ్రంథమని! మరే గ్రంథమూ అలా దావా చెయ్యదు. అంతే కాదు, అది ఉనికిలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు దివ్యఖుర్‌ఆన్‌లా పొల్లుపోకుండా, అక్షరక్షరం సురక్షితంగా,

ప్రామాణికంగా భద్రమయి ఉన్నట్లు మరే గ్రంథమూ ఆధారాలు చూపజాలదు. ఇటువంటి ప్రామాణికత, భద్రత కూడా దివ్యఖుర్ఆన్‌కి తప్ప మరే గ్రంథానికీ లేదు.

దివ్యఖుర్ఆన్ దేవుని మార్గదర్శక గ్రంథం. దైవానికే చెల్లు మానవులకు దారి చూపడం. ఆయనే మానవుల సృష్టికర్త గనక ఆయనకే తెలుసు మానవుల అవసరాలేమిటో, మానవుడు చేయ వలసిందేమిటో చేయకూడనిదేమిటో. దైవ మార్గదర్శకత్వం అందజేసే గ్రంథమే మానవునికి నిజమయిన మార్గదర్శక గ్రంథం. అందుకే దాని పేరును సార్థకం చేసేలా ప్రపంచంలో అనునిత్యం పఠించబడుతుంది దివ్యఖుర్ఆన్. ఖుర్ఆన్ అంటే ఇతోధికంగా చదవబడేదన్న మాట. దాన్ని పూర్తిగా కంఠస్థం చేసుకున్న కోటానుకోట్ల ప్రజలు ప్రపంచంలో ప్రతి నిత్యం ఎక్కడో ఒక చోట దాన్ని పఠిస్తూనే ఉంటారు. నమాజుల్లో పారాయణం చేసేవారు వేరు, గ్రంథం చూసి పారాయణం చేసేవారు వేరు. ఈ విధంగా దేవుని ఆదేశాలు, నిర్దేశాలు అనుక్షణం గుర్తుంచుకుంటారు విశ్వాసులు.

దివ్యఖుర్ఆన్ దేవుని అంతిమ బోధనల్ని అందజెయ్యడంతోపాటు ప్రపంచంలో దేవుని సందేశహరులు అందజేసిన గ్రంథాల సారాన్ని, వాటి బోధనల్ని ధ్రువీకరిస్తుంది. అది ప్రవక్తల మధ్య భేదభావాన్ని సమ్మతించదు. ప్రవక్తలు ఏ గడ్డపై ఆవిర్భవించినా, ఏ భాషలో దైవసందేశాన్ని అందజేసినా వారంతా దేవుని ప్రవక్తలు, సందేశహరులే, వారిని విశ్వసించడం వారి బోధనల్ని గౌరవించడం ముస్లిముల బాధ్యత అని ఘోషిస్తుంది ఖుర్ఆన్. ప్రవక్తలందరూ సమానులే, సమస్థానం గలవారే అని అంటుంది.

దివ్యఖుర్ఆన్ బోధనల్లోని ప్రధానాంశాలు - ఒకే దైవం, ఒకే ధర్మం, ఒకే మానవ సమాజం! ఈ మూలభావనల ఆధారంగానే ప్రపంచంలో కలహాలు, కలతలు సమసి పోగలవని, శాంతి పరిఢవిల్లగలదని, సోదరభావం, సానుభూతి, ప్రేమ ప్రజల్లో వర్ధిల్ల గలవని చాటుతుంది ఖుర్ఆన్!

(21-11-03)

ఖుర్‌ఆన్ పరిచయం

రమజాన్ నెల అంతా దివ్యఖుర్‌ఆన్‌కే అంకితమయిపోయింది. ఇది సహజం, సమంజసం కూడా. రమజాన్, ఖుర్‌ఆన్ అవతరించిన నెల కాబట్టి ఇది న్యాయమే అనిపిస్తోంది. ఖుర్‌ఆన్‌లోని విషయ విస్తృతి, వైవిధ్యాన్నిబట్టి చూస్తే అదొక తరగని భాండాగారంగా దర్శనమిస్తుంది. ఎన్ని విషయాలు చర్చించినా, ఎన్నెన్ని విధాలుగా పరిశీలించినా ఇంకా తృష్ణ మిగిలే ఉంటుంది. అదే ఖుర్‌ఆన్ ప్రత్యేకత. ఖుర్‌ఆన్‌ని స్థూలంగా, దాని రూపురేఖల పరిచయం చెయ్యాలన్నా ఎన్నో విధాలుగా అది ప్రత్యక్షమవుతుంది.

దివ్యఖుర్‌ఆన్‌లో చిన్నవీ పెద్దవీ అన్నీ వెరసి 6 వేల 6 వందల అరువయి ఆరు వచనాలున్నాయి. వాటిని చిన్న చిన్న అధ్యాయాలు మొదలుకుని పెద్ద పెద్ద అధ్యాయాలుగా, 114 అధ్యాయాలుగా దేవుడు ఏర్చికూర్చి పెట్టాడు. దాదాపు వెయ్యి పేజీల గ్రంథాన్ని దాదాపు సమానమయిన 30 భాగాలుగా విభజించారు- ఒక నెల లోపున, రోజుకో భాగం చొప్పున దాని పఠనాన్ని పూర్తి చెయ్యడానికి. అలా నెల లోపున పూర్తి చేసేవారే కాదు, దాని పారాయణం 3 రోజుల్లో, ఒక్కరోజులోనూ పూర్తి చేసే ఆసక్తిపరులు ప్రపంచంలో ఎల్లెడలా కానవస్తారు. "ఖుర్‌ఆన్" అంటేనే మాటిమాటికీ, అత్యధికంగా, ఇతోధికంగా పఠించబడేది అని అర్థం. ఖుర్‌ఆన్‌కి అది సార్థక నామధేయం.

ఖుర్‌ఆన్‌ని ఇలా పఠించేవారు ప్రపంచమంతటా వ్యాపించి ఉన్నారు. ప్రపంచంలో ఏదో ఒక్క దేశంలో కాదు, ఏదో ఒక్క ఖండంలో కాదు, ఏదో ఒక భూభాగంలోకాదు- దాదాపు ప్రపంచ దేశాలన్నింటిలో అనేక భాషలు మాట్లాడేవారు 'అరబీ' ఖుర్‌ఆన్‌ని పారాయణం చేస్తూ ఉంటారు.

మరో గొప్ప విషయం ఏమిటంటే ఖుర్‌ఆన్ చదవకుండా ప్రపంచంలో ఒక్క క్షణం కూడా గడవదు. ఏదో ఒక చోట, ఏదో ఒక రూపంలో అనునిత్యం ఖుర్‌ఆన్

పఠనం సాగుతూనే ఉంటుంది. అయిదు పూటలా నమాజ్ ఆచరించే విశ్వాసులు భూగోళంలో ప్రతిక్షణం ఎక్కడో ఒక చోట నమాజ్ చేస్తూనే ఉంటారు. ఈ క్షణమే తీసుకున్నా ప్రపంచంలోని సగం భూభాగం నిద్రపోతూ ఉంటే మరో సగభాగం మేల్కొని ఉంది. ఒకచోట సూర్యాస్తమయమయి మగ్రిబ్ నమాజ్ జరుగుతూ ఉంటే మరో చోట ఇది మధ్యాహ్నపు వేళ దాటి జుహర్ నమాజ్ సమయమయింది. మరోచోట సూర్యోదయానికి పూర్వం ఫజ్ర్ నమాజ్ వేళ. ఇంకొక చోట నడిరాత్రి తహజ్జుద్ నమాజ్ సమయం. అలా భూగోళంలో ఎక్కడో ఒక స్థలాన ఖుర్ఆన్ పఠనం కొనసాగుతూ ఉంటుంది. ఇంత విరివిగా చదవబడే గ్రంథం మరొకటి లేనేలేదు.

అంతేకాదు, నేటికి 1500 సంవత్సరాలకు పూర్వం అది అవతరించినప్పటి నుండి నేటి వరకు పూర్తి గ్రంథాన్ని కంఠస్థం చేసుకున్న భాగ్యశీలురు, కోటానుకోట్ల..... కాదు కాదు...... గణించవీలుకానంత మంది విశ్వాసులు ఉంటారంటే ఆశ్చర్యం కాదు. నేడు, ఈ క్షణంలోనూ భూతలాన నివసించే 600 కోట్ల మానవుల్లో దాదాపు నాల్గవ వంతు జనాభా ఖుర్ఆన్ని విశ్వసించే వారిది. ప్రపంచమంతటా విస్తరించి ఉన్న ఈ 130 కోట్ల ముస్లిముల్లో అనేక కోట్ల మంది ఖుర్ఆన్ ఆసాంతం కంఠస్థం చేసుకున్న వారున్నారు. వారు సయితం అనునిత్యం తమ స్మరణ శక్తికి పదును పట్టడానికి ఖుర్ఆన్ పారాయణం చేస్తూనే ఉంటారు. ఆ విధంగా కూడా ఖుర్ఆన్ పఠనం భూమండలమంతటా అనుక్షణం కొనసాగుతూనే ఉంటుంది. అర్థమయినా, అర్థంకాకపోయినా అత్యధికంగా చదవబడే గ్రంథం ప్రపంచంలో బహుశా ఖుర్ఆన్ ఒక్కటేనేమో!

విచిత్రమయిన విషయం ఏమిటంటే దివ్యఖుర్ఆన్ అరబీ భాషలో ఉన్న గ్రంథం. దాన్ని కంఠస్థం చేసుకున్న వారు, అనునిత్యం పారాయణం చేసేవారు, దాన్ని నమ్మేవారు అత్యధిక శాతం అరబీ మాతృభాష కానివారే! 130 కోట్ల ముస్లిముల్లో 20 శాతం ముస్లిములే అరబీ మాతృభాషగా గలవారు, 80శాతం ముస్లిములు అరబ్బేతర భాషీయులు! మరో విచిత్రమయిన విషయం ఏమిటంటే ఖుర్ఆన్ని కంఠస్థం చేసుకున్న స్మర్తల (హాఫిజ్ల) అత్యధిక సంఖ్య చైనా దేశస్థులది!! ప్రపంచ ప్రజలందరికీ వర్తించే గ్రంథం దివ్యఖుర్ఆన్ అనడానికి ఇంతకన్నా బలమయిన నిదర్శనం వేరొకటి అవసరమా?

నేటికి 1500 ఏళ్ళ ముందు అవతరించిన గ్రంథాన్ని అప్పుడే గ్రంథస్థం చెయ్యగా ఆనాటి ప్రతులు నేటికీ ప్రపంచ విఖ్యాత గ్రంథాలయాల్లో, గ్రంథ సంగ్రహశాలల్లో భద్రంగా ఉన్నాయి. అప్పటి నుండి నేటి వరకు అన్ని కాలాల్లో నిరంతరాయంగా ప్రచురితమయి వ్యాపిస్తూనే ఉన్నా, వివిధ కాలాలకు చెందిన గ్రంథం ప్రతులు ప్రపంచంలో ప్రాప్తమవుతాయి. అత్యాధునిక ముద్రణా పరికరాలతో ప్రింటయి ప్రాచుర్యం పొందిన ప్రతులూ

ఉన్నాయి. వీటిన్నింటితో పాటు చైనా మొదలుకుని అమెరికా వరకు వ్యాపించిన దేశాల్లో ఖుర్‌ఆన్ స్మర్తలు, హాఫిజులున్నారు. వీటినన్నింటినీ పోల్చి, ఎక్కడయినా, ఎప్పుడయినా ఒక్క పొల్లు మందం మార్పు పొరపాటుననయినా జరిగిన సందర్భాన్ని ఏ పరిశోధకుడూ చూపలేదు.

ఇన్ని మహిమలు, ఇన్ని మహత్తులున్న గ్రంథం, ఖుర్‌ఆన్ దైవగ్రంథం అనడం పట్ల ఇంకా సందేహమా! 'ఇది దైవగ్రంథం, ఇందులో సందేహమే లేదు' అన్న పరిచయ వాక్యంతో ప్రారంభమయిన ఖుర్‌ఆన్‌లో, దైవికంగా దాన్ని భద్రపరిచే ఏర్పాట్లు జరిగిన విషయమూ ప్రోక్తమయి ఉంది:

"మేమే ఈ గ్రంథాన్ని అవతరింపజేశాము. మేమే దీన్ని భద్రపరిచేవారము కూడా!"
(దివ్యఖుర్‌ఆన్-అల్‌హిజ్ర్ : 9)

అందుకే ఇది దైవగ్రంథం, మానవునికి దైవం పంపిన అంతిమ మార్గదర్శకగ్రంథం!

(5-12-03)

ఖుర్ఆన్ - దైవగ్రంథం!

సకలవిధ సంశోభితమయిన, సర్వరంగ సుందరమయిన అనంత చరాచర సృష్టికి కేంద్ర బిందువు మానవుడు, నిరంతరం, ప్రతిక్షణం విస్తరించే సృష్టి క్రియకు ఉన్నత శిఖరం, ఉత్తమ రూపం మానవ జీవితం, అజ్ఞాత కాలపు అంతులేని పాతాళాల నుంచి అనిర్వచనీయ సుదూర సమయ అంతరిక్షాల్లోకి వ్యాపిస్తున్న అఖండ సృష్టి రహస్యానికి మూలాంకురం ఈ చిట్టి పొట్టి మానవుని మనుగడ!

అందుకే ఈ బ్రహ్మాండంలోని ఓ చిన్న గోళంలో సృష్టి సామ్రాజ్యాన్ని జయించే సోపానాలను ఒక్కటొక్కటే దాటి ముందుకు సాగుతున్న సృష్టి శ్రేష్ఠుడయిన ఈ మానవుడికి సర్వ సృష్టి ప్రభువు అందజేసిన అంతిమ మార్గదర్శక గ్రంథం దివ్యఖుర్ఆన్ మానవుడినే తన చర్చకు కేంద్రంగా ప్రకటించింది. మానవుణ్ణి అతని స్వభావ స్వరూపాల దృష్ట్యా వర్గీకరించింది. మూలతః మానవుడు రెండు కోవలకు చెందినవాడని ప్రకటించినా, ఆచరణాత్మకంగా, గుణగణాలు విశ్వాసాల రీత్యా విభిన్న విధాలయిన మనస్తత్వాల మానవుల్ని అది ఎత్తిచూపినా సహజ ప్రకృతి వైవిధ్యం కారణాన మానవుల్ని అది ప్రధానంగా మూడు వర్గాలలో విభజిస్తుంది. ఈ వర్గీకరణను అది తన సందేశాన్ని ప్రారంభించే ముందే ప్రకటిస్తుంది. ఆదిలోనే ఖచ్చితంగా చెప్పివేస్తుంది- ఇదో ఈ భిన్న ధోరణుల మానవ నైజాలు ప్రపంచంలో ఎదురవుతాయి; వీరి మధ్యనే ఈ సందేశ స్వీకార, తిరస్కార సంఘర్షణ జరగవలసి ఉంది: విశ్వసించేవారు, తిరస్కరించేవారు, ద్వంద్వ స్వభావులు!!

ఈ మూడు వర్గాల ప్రజల గుణగణాలను, నైజాలను, వైఖరులను ఖుర్ఆన్ పరిచయ వచనాల తొలి అధ్యాయం ముగియగానే స్పష్టీకరిస్తుంది. ఇలా విశదపరిచే ముందు, అసలు ఈ గ్రంథం, దివ్యఖుర్ఆన్ ఏమిటో, ఎటువంటి గ్రంథమో, దీని ప్రాముఖ్యత, విశిష్టత ఏమిటో ఖుర్ఆన్ స్వయంగానే చెబుతుంది:

> అలిఫ్, లామ్, మీమ్. ఇది దైవగ్రంథం. ఇందులో ఎలాంటి సందేహమూ లేదు. భయభక్తులు గలవారికి ఇది మార్గదర్శకం. వారు అగోచరాలను విశ్వసిస్తారు, నమాజ్‌ను స్థాపిస్తారు, మేము ప్రసాదించిన దానిలో నుండి ఖర్చు చేస్తారు, నీకు అవతరింపజేసిన గ్రంథాన్నీ, నీకు పూర్వం అవతరింపజేసిన గ్రంథాలను అన్నింటినీ విశ్వసిస్తారు, పరలోకం పట్ల అచంచల విశ్వాసం కలిగి ఉంటారు. ఇలాంటివారే తమ ప్రభువు ద్వారా ప్రాప్తమయిన రుజుమార్గాన ఉన్నారు, సాఫల్యం పొందేవ్వారు వీరే. (బకర : 1–5)

ఒక గ్రంథం దైవగ్రంథమని ఎలా తెలుస్తుంది: స్వయంగా దాన్ని అందజేసే వ్యక్తి చెప్పాలి, లేక అంతస్సాక్ష్యంగా ఆ గ్రంథంలోనే దానికి సంబంధించిన ప్రామాణిక వచనాలు పేర్కొనబడాలి లేదా ఆ గ్రంథమే స్వయంగా ప్రకటించాలి– తాను దైవగ్రంథమని! దివ్యఖుర్ఆన్ అదే చేసింది. తొలి అధ్యాయంలోని పరిచయ వచనాలు పూర్తయిన తరువాత ప్రప్రథమంగా ఇది దైవగ్రంథమని, దీన్ని గ్రహించి అర్థం చేసుకుని దాని మార్గదర్శకత్వం ద్వారా మానవుడు తన వ్యక్తిగత జీవితాన్నీ తాను నివసించే సమాజంలోని సామూహిక జీవితాన్నీ సౌభాగ్యవంతం చేసుకోవడానికి కావలసిన మొదటి లక్షణాలు ఫలానా అని, ప్రకటిస్తాయి ఈ వచనాలు.

తాను దైవగ్రంథమని పరిచయం చేసుకునే గ్రంథం బహుశా ప్రపంచంలో మరొకటి ఏదీ లేదేమో. విలక్షణమయిన ఈ పరిచయ వాక్యాలు బహుశా దివ్యఖుర్ఆన్‌కే ప్రత్యేకం కాబోలు. ఈ ప్రకటన సాధారణమయినది కాదు. మరే శాస్త్రీయ గ్రంథమయినా తన మౌలిక లక్షణాన్ని పరిచయం చేసుకుంటే దానివల్ల ప్రయోజనం పొందగోరే వారికే దాని లాభనష్టాలు పరిమితం. కాని ఇది అలాంటిది కాదే. ఇది విశ్వవిరాట్టు, భూమ్యాకాశాలలోని సకల లోకాలకు ప్రభువయిన దైవం పంపిన గ్రంథమే అయినట్లయితే దాని పట్ల మానవుల బాధ్యత అనంతంగా పెరిగిపోతుంది.

ఈ ప్రకటన ఎంతో భయంకరమయిన సవాళ్ళను మానవాళి ముందు పెడుతోంది. విశ్వప్రభువు మానవాళికి మార్గదర్శకంగా ఒక గ్రంథాన్ని పంపించినప్పుడు మానవులు దాన్ని చదవకపోవడం, చదివినా అర్థం చేసుకోకపోవడం, అర్థం చేసుకునే ప్రయత్నం చేయకపోవడం, అర్థం చేసుకునే సాధనా సంపత్తిని ప్రోగు చేసుకోకపోవడం, అర్థం చేసుకున్నా దాని ఆదేశాలను ఆచరించకపోవడం– దీనివల్ల అత్యంత విపత్కర పరిస్థితికి గురికావడం తథ్యం. ఈ గ్రంథం ప్రకటించే సత్యాలను, అది చేసే బోధనల్ని, అది చేసే హెచ్చరికల్ని, అది చాటే శుభవార్తల్ని ఆలకించడం, ఆదరించడం, పరిశీలించడం, పరిశోధించడం, విశ్వసించడం, వాటి పట్ల జాగరూకులయి మెలగటం, ఆశలల్లుకోవడం– అంతా తప్పనిసరయిపోతుంది.

అది దైవగ్రంథం కాదని కొట్టిపారవేయాలన్నా దాన్ని అధ్యయనం చేసి సశాస్త్రీయ జిజ్ఞాసతో అన్వేషించిన మీదటనే కాదని తిరస్కరించ వీలవుతుంది తప్ప ఈ ప్రకటన

విన్న తరువాత దాని పట్ల ఉపేక్షాభావం, నిర్లక్ష్యభావం, నిర్లిప్తత కనబరిస్తే మాత్రం ఇక్కట్లపాలయ్యే ప్రమాదముంది!

ఖుర్‌ఆన్, తాను దైవగ్రంథమని ఆదిలో ప్రకటించడంతో వదలిపెట్టలేదు, గ్రంథం మధ్యలోనూ అడపాదడపా అవసరమయిన ప్రతిచోటా అది దైవగ్రంథమనడానికి కావలసిన ఆధారాలను అందజేసింది. ఇది మానవ కల్పితమని మీరు భావిస్తే ఇటువంటి ఒక అధ్యాయాన్ని, పోనీ ఒక వచనాన్ని (ఆయత్‌ని) రచించి తీసుకురండి అని, కాదనే వారి నందరినీ వెయ్యిన్నర సంవత్సరాలుగా నిరంతరం ఛాలెంజి చేస్తూ ఉంది:

ప్రవక్త స్వయంగా ఈ గ్రంథం రచించాడని ఈ జనం అంటున్నారా? వారికి చెప్పు, "సరే, నిజమయితే దీనిలాగే రచించిన పది సూరాలు మీరు కూర్చి తీసుకురండి. అల్లాహ్ తప్ప ఎవరెవరు (మీ ఆరాధ్యులుగా) ఉన్నారో (వారిని ఆరాధ్యులని భావించడంలో) మీరు సత్యవంతులే అయితే, వారిని సహాయానికి పిలుచుకోగలిగితే పిలుచుకోండి." (హూద్ : 13)

మా దాసునికి మేము అవతరింపజేసిన ఈ గ్రంథం మేము పంపినదో కాదో అన్న సందేహం మీకు ఉన్నట్లయితే ఇలాంటి సూరా ఒక్కటయినా రచించి తీసుకురండి, సహాయం కొరకు మీ తోటివారినందరినీ పిలిపించుకోవచ్చు, ఒక్క అల్లాహ్ తప్ప మరెవరి సహాయమయినా పొందవచ్చు. మీరు నిజాయితీ పరులయితే ఇది చేసి చూపండి. (బకర : 23)

ప్రవక్త స్వయంగా దీనిని రచించుకున్నాడని వీరు అంటున్నారా? చెప్పు, "ఈ ఆరోపణలో మీరు నిజాయితీపరులే అయితే ఒక్క సూరా ఇటువంటిది రచించి తీసుకురండి; ఒక్క దైవాన్ని వదలి ఎవరెవరిని పిలుచుకోగలుగుతారో తోడుగా పిలుచుకోండి." (యూనుస్ : 38)

అంతేకాదు ఇది తన పరిచయ వాక్యాలను పలుచోట్ల పలు విధాల పునరుక్తం చేసింది, తన నైజాన్ని విశదీకరించింది కూడా:

రమజాన్ నెల- ఇందులోనే ఖుర్‌ఆన్ అవతరించింది. అది ఆసాంతం మానవులకు మార్గదర్శకం, అందులో విస్పష్టమయిన బోధనలున్నాయి- అవి రుజుమార్గాన్ని చూపుతాయి, సత్యాసత్యాల వ్యత్యాసాన్ని విడమర్చి తెలుపుతాయి. (బకర : 185)

ఇది జనులకు ఎంతో స్పష్టమయిన విశదీకరణ, దైవానికి భయపడే వారికి మార్గనిర్దేశన, హితబోధన. (ఆలి ఇమ్రాన్: 138)

(21-3-03)

ఖుర్‌ఆన్ అవగాహనకు...

అనన్యమయిన రచనాశైలి, అపురూపమయిన భావప్రకటనా విధానం, అనిర్వచనీయమయిన భావధార, అసమానమయిన విషయ నిర్ధారణా కౌశలము, అఖండ నీయమయిన చర్చాపటిమ, అనితర సాధ్యమయిన కవనపు ఉరవడి ఖుర్‌ఆన్ స్వంతం.

ఖుర్‌ఆన్ సత్యాన్ని అన్వేషించేందుకు, యదార్థాన్ని గుర్తించేందుకు, వాస్తవాన్ని తెలుసుకునేందుకు మానవ మేధను చైతన్యవంతం చేస్తుంది. ఆలోచనా శక్తిని, అనుశీలనా బలాన్ని పరిపుష్టం చేస్తుంది. సాధారణంగా కానరాని కోణాలను ఎత్తిచూపి వాటిలోకి దృష్టి సారించమని ప్రేరేపిస్తుంది. హేతుబలాన్ని ఉపయోగించమంటుంది. ప్రశ్నించమంటుంది. చర్చించమంటుంది. నిజాన్ని నిర్ధారించుకోమంటుంది.

> అల్లాహ్ ఎంతో వికసిత హస్తుడు, విజ్ఞానపరుడున్నూ. తాను కోరిన వారికి వివేచనను ప్రసాదిస్తాడు, ఎవరికయితే వివేచనాశక్తి ప్రాప్తమవుతుందో వారికి వాస్తవంలో ఎనలేని సంపద ప్రాప్తమయినట్లు. అయినా వీటి ద్వారా గుణపాఠం గ్రహించగలిగే వారు బుద్ధికుశలత గలవారే. (బకర : 269)

ఖుర్‌ఆన్ సృష్టిలోని సౌందర్యాన్ని ఆస్వాదించాలని కోరుతుంది. మానవ శరీర నిర్మాణం మొదలుకుని అతని మానసిక ఆధ్యాత్మిక బలాల వరకు అన్నింటినీ చర్చిస్తుంది. గాలిలో పయనించే ధూళి రేణువులు మొదలుకుని అంతరిక్షంలో తేలియాడే మహా స్థూల గోళాల వరకు అన్నింటినీ పరిశీలించాలని బోధిస్తుంది. ఖుర్‌ఆన్‌లో ఆవిష్కరించిన సత్యాలను ఈ ప్రకృతి ప్రదర్శనల ద్వారా అర్థంచేసుకోవాలని పురికొలుపుతుంది.

> భూమీ, ఆకాశాల సృష్టిలో, రేయీ పగలూ మారిమారి వెలువడటంలో బుద్ధి కుశలత గలవారికి చాలా సూచనలున్నాయి. ఇలాంటి వారు నిలబడినప్పుడూ,

కూర్చున్నప్పుడూ, నడుంవాల్చినప్పుడూ- సర్వావస్థల్లో దైవాన్ని స్మరిస్తారు. భూమ్యాకాశాల సృజన పట్ల దీర్ఘాలోచన చేస్తుంటారు. వారు అతిసహజంగా ఇలా విన్నవించుకుంటారు, "ప్రభూ, దీన్ని నీవు నిరర్ధకంగా సృజించలేదు, పరమ పరిశుద్ధుడవు నీవు." (ఆలి ఇమ్రాన్: 190-191)

మీరు గమనించడం లేదా? అల్లాహ్ మేఘాలను మెల్లిమెల్లిగా నడిపిస్తాడు. తిరిగి వాటి తునకల్ని ఒకదానితో మరొకటి కలుపుతాడు. ఆపైన దాని మొత్తాన్ని చేర్చి దట్టమైన మబ్బుగా రూపొందిస్తాడు. అప్పుడు మీరు చూస్తారు, దాన్ని సందుల్లో నుంచి వర్షపు బిందువులు రాలడం మొదలవుతాయి. మరాయన ఆకాశం నుండి, అందులో ఎత్తుగా ఉన్న పర్వాతాల మూలంగా మంచు ముక్కలు కురిపిస్తాడు. వాటి వల్ల తాను తలచినవారికి నష్టం కలుగజేస్తాడు, మరి తాను కోరినవారిని వాటి నుండి కాపాడుతాడు. ఆయన మెరిపించే మెరుముల జిలుగులు చూపులను చెదరగొడ్తాయి. రేయింబవళ్ళ భ్రమణం ఆయనే కల్పిస్తున్నాడు. ఇందులో ఒక గుణపాఠం ఉంది కళ్ళున్నవారికి. (అల్‌నూర్: 43-44)

ఖుర్‌ఆన్ చరిత్ర ద్వారా గుణపాఠం గ్రహించాలని ఉపదేశిస్తుంది. ప్రజలచేత దైవంగా కొలవబడిన మహాఘనత వహించిన రౌద్ర శాసకులు దైవాన్ని, దైవ సందేశహరులను ధిక్కరించి చివరికి ఎలా మట్టికరవవలసి వచ్చిందో గమనించాలని కోరుతుంది. ప్రపంచమంతటా వైభవ ప్రాభవాలను చాటిన గొప్ప గొప్ప నాగరికతలు దైవాదేశాలను తిరస్కరించి తమ మనోకాంక్షల దాస్యం చేసి ఎలా నామరూపాల్లేకుండా తుడిచిపెట్టుకుపోయాయో, ఎలా తమ ఘనకార్యాల చిహ్నాలను ప్రపంచ ప్రజలకు గుణపాఠంగా వదలిపెట్టి వెళ్ళిపోయాయో కళ్ళు తెరచి చూడాలని అభిలషిస్తుంది.

నీవు చూడలేదా? ఎత్తయిన స్థంబాల ఇరమ్‌కు చెందిన ఆద్ పట్ల నీ ప్రభువు ఏ విధంగా ప్రవర్తించాడో? వారిలాంటి జాతి ప్రపంచ దేశాల్లో మరొకటి పుట్టలేదు. మరి సమూద్ పట్లనో? వారు లోయలో కొండరాళ్ళను తొలిచే వారు. ఇంకా మేకుల వాడయిన ఫిర్‌ఔన్ పట్లనో? వీరంతా ప్రపంచ దేశాలలో ఎంతో తల బిరుసుతనానికి అక్రమానికి ఒడిగట్టినారు. వాటిలో ఎంతో కల్లోలాన్ని రేకెత్తించిన వారు. చివరికి నీ ప్రభువు వారిపై యాతన కొరడాను ఝుళిపించాడు. వాస్తవంగా నీ ప్రభువు మాటువేసి పొంచి ఉన్నాడు. (అల్ ఫజ్ర్: 6-14)

ఖుర్‌ఆన్ అందజేసే సందేశం కొత్తదేమీ కాదు, ప్రపంచమంతటా విస్తరించిన మానవాళికి దైవం సదా అందజేస్తూ వచ్చిన సందేశమే ఇది, కావాలంటే దైవ గ్రంథాలలోని, మార్పులు చేర్పులకు లోనవని అంశాలలో వెదకాలని బోధిస్తుంది. దైవగ్రంథ సారం ఎరిగినవారు ఎవరయినా ఉంటే వారిని అడిగి నిర్ధారించుకోవాలని హితవు గరుపుతుంది.

ఏసుక్రీస్తు పుట్టుకను భవిష్యవాణిగా తెలుపుతూ ఖుర్ఆన్ ఈ విధంగా అంటుంది:

అలాగే జరుగుతుంది, అల్లాహ్ తాను కోరినది సృష్టిస్తాడు, ఆయన ఒక పనిని నిర్ణయిస్తే దాన్ని కేవలం 'ఉనికిలోకి రా' అని ఆదేశిస్తాడు, అది నెరవేరుతుంది. అల్లాహ్ అతనికి గ్రంథాన్నీ, వివేచననూ, తౌరాత్, ఇన్జీల్ గ్రంథాల జ్ఞానాన్నీ నేర్పుతాడు; ఇంకా ఇస్రాయీల్ వంశీయులకు సందేశహరునిగా నియమిస్తాడు. (ఆలి ఇమ్రాన్: 48)

కాని వీరిలో పరిపక్వ జ్ఞానం కలవారు, విశ్వాసం గలవారు, నీకు అవతరించిన బోధనల్నీ, నీకు పూర్వం అవతరించిన బోధనల్ని విశ్వసిస్తారు. నమాజ్‌ను స్థాపించే వారు, జకాత్‌ను సక్రమంగా చెల్లించేవారు, అల్లాహ్‌ను, అంతిమ దినాన్నీ గట్టిగా నమ్మేవారు– ఇలాంటి వారికి మేము తప్పనిసరిగా మహత్తర ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాము. (నిసా: 162)

అయితే ఈ మార్గాల ద్వారా జ్ఞాన బోధ పొందడానికి, అంటే బుద్ధిని ఉపయోగించి యదార్థాలను గురించి ఆలోచించడానికయినా, సృష్టిలో అన్వేషణ ద్వారా సత్యాన్ని తెలుసుకోవడానికయినా, చరిత్ర పరిశీలన ద్వారా గుణపాఠం గ్రహించడానికయినా, నిజమయిన ధార్మిక గ్రంథాల ద్వారా వాస్తవాల్ని నిర్ధారించుకోవడానికయినా మనిషిలో అవసరమయిన గుణగణాలేమిటో విడమర్చి తెలిపింది ఖుర్ఆన్.

అలిఫ్, లామ్, మీమ్. ఇది దైవగ్రంథం. ఇందులో ఎలాంటి సందేహమూ లేదు. ఇది మార్గదర్శకం భయభక్తులు గలవారికి. వారు అగోచరాలను విశ్వసిస్తారు, నమాజ్‌ను స్థాపిస్తారు, మేము ప్రసాదించిన దానిలో నుండి ఖర్చు చేస్తారు, నీకు అవతరింపజేసిన గ్రంథాన్నీ, నీకు పూర్వం అవతరింపజేసిన గ్రంథాలను అన్నింటినీ విశ్వసిస్తారు, పరలోకం పట్ల అచంచల విశ్వాసం కలిగి ఉంటారు. ఇలాంటివారే తమ ప్రభువు ద్వారా ప్రాప్తమయిన రుజుమార్గాన ఉన్నారు, సాఫల్యం పొందేవారు వీరే. (బకర: 1-5)

అంటే, కానరాని దైవం పట్ల విశ్వాసం, భక్తి భావంతోపాటు ఆయన ఆగ్రహానికి గురికాకుండా రక్షణ పొందే ప్రబల వాంఛ మనిషిలో చోటుచేసుకోవాలి. రుజుమార్గాన్ని అనుసరించాలి, ఇహపర జీవితాలలో శాంతిని, శ్రేయాన్ని సాధించాలి, నైతిక ఆధ్యాత్మిక వికాసం కొరకు కృషించాలి అనే కోరిక ఆంతర్యంలో ఉప్పొంగుతూ ఉండాలి. అలాంటి వారు ఆరాధనా భావంతో దైవం సమక్షంలో మోకరిల్లడమేకాక దైవం ప్రసాదించిన ప్రతి వరప్రసాదాన్ని తోటి మానవ సోదరులకు పంచిపెట్టడానికి సదా సన్నద్ధులయి ఉంటారు. సత్యం ఎక్కడ, ఏ రూపంలో ప్రత్యక్షమయినా దాన్ని విశాల హృదయంతో ఆహ్వానించడానికి, ఆదరించడానికి, ఆస్వాదించడానికి సంసిద్ధత వ్యక్తం చేస్తారు. అలాంటి వారే సాఫల్యం పొందగలవారనడంలో సందేహమేముంది?

(28-3-2003)

ఖుర్ఆన్ వెలుగులో మానవుడు

అనుభవం, ఆలోచన, అవగాహనల ఆధారంగాకాక మూఢత్వం, మొండితనం, మంకుపట్టు ఆధారంగా ఎవరయినా, ఏ మాటనయినా స్వీకరించడమో, తిరస్కరించడమో తమ పద్ధతిగా పెట్టుకుంటే అలాంటి వారి సమక్షంలో సత్యం ఎంతటి బలవత్తర నిదర్శనం తీసుకువచ్చినా అది వారి మనసులకెక్కదు.

అనేక విధాల సాకులు వచ్చి ఆంతర్యాన్ని ఆవహిస్తాయి. ఏదో ఒక మూలన 'సత్యం' కోసం కొద్దిపాటు చోటు ఏర్పడినా హృదయంలో తిష్ఠ వేసుకున్న అనుమానాలు, ఆశంకలు, అహంభావాలు, అభిమానాలు, దురభిమానాలు, అభిప్రాయాలు, దురభిప్రాయాలు, విద్వేషాలు అన్నీ కలసి ఆక్రమించుకుంటాయి. మనిషి సత్యానికి దూరమయి పోతాడు. దాన్ని పచ్చిగా తిరస్కరించడానికి సంస్కారం అడ్డువచ్చినా శాస్త్రీయ జ్ఞానం పేరు చెప్పుకుని అశాస్త్రీయ విధానాన్ని అవలంబిస్తాడు:

> ఈ విషయాలను తిరస్కరించిన వారు, నీవు హెచ్చరించినా, హెచ్చరించక పోయినా– విశ్వసించబోరు. అల్లాహ్ వారి మనస్సులను, చెవులను మూసి ముద్రవేశాడు. వారి కన్నులపై తెరపడింది. కఠిన శిక్షకు అర్హులు వారు.
>
> (బకర : 6,7)

నిజమే, సత్యం వినరాదు, నమ్మరాదు, ఒప్పుకోకూడదు, తప్పుకునే తిరగాలి అని ముందే నిర్ణయించుకున్న ప్రాణులకు సత్య తిరస్కారం వల్ల కలిగే దుష్పరిణామాలను గురించి ఎంతగా భయపెట్టినా ప్రయోజనం శూన్యం. సత్యం సహజరూపంలో సాక్షాత్కరించినా భావదాస్యం వల్ల, మానసిక బానిసత్వం వల్ల, దురభిమానాలకు తలఒగ్గి ప్రపంచంలో తలెత్తే ప్రశ్నార్థకాలకు జడసి నిజాన్ని నమ్మనిరాకరించే వారి మానసిక

స్థితిని, వారి అయోమయ వైఖరిని, సందిగ్ధ ప్రవర్తనను ప్రతిబింబిస్తాయి ఈ వచనాలు. మనసులో ఏ వాస్తవమూ దూరదు, చెవులకు ఏ యదార్థమూ సోకదు, కళ్ళకు ఏ నిజమూ కానరాదు.

ఇదే స్థితికి లోనయిన కొందరు మరో కోవకు చెందినవారు సామాజిక కారణాల వల్ల, వత్తిడికి లోనయి ధైర్యంగా సత్యాన్ని స్వీకరించలేరు. అలా అని తమ తిరస్కారాన్ని ప్రకటించే సాహసమూ చేయలేరు. వారికి పిరికితనం ఆశ్రయమిస్తుంది. ద్వంద్వ నీతిని స్వంతం చేసుకోమని, కపట వైఖరికి పాల్పడమని బోధిస్తుంది. వారు తమంతట తాము మొత్తం ప్రపంచాన్నే కాదు దైవాన్నే మోసగిస్తున్నామని భావిస్తుంటారు. అవునా?... పాపం వారెరుగరు, తామే తమ పోకడల వల్ల మోసపోతున్నారని, ఆత్మవంచనకు పాల్పడు తున్నారని:

"మేము అల్లాహ్‌నూ, అంతిమ దినాన్నీ విశ్వసించాము" అని చెప్పేవారు కూడా మనుషుల్లో కొందరున్నారు. కాని వాస్తవంగా వారు విశ్వాసంగలవారు కారు. వారు అల్లాహ్‌ను, విశ్వసించినవారినీ మోసగించపజూస్తున్నారు. నిజానికి వారు తమను తామే మోసపుచ్చుకుంటున్నారు, అయితే వారు దీన్ని గ్రహించటం లేదు. వారి హృదయాలలో ఒక రోగం తిష్ఠవేసుకుంది. దాన్ని అల్లాహ్ మరింత అధికం చేశాడు. వారు పలికే అబద్ధానికిగాను వారికి వ్యధాభరితమయిన శిక్ష పడుతుంది. (బకర : 8-10)

ఇలాంటి వారు ఒక విధంగా వ్యాధిగ్రస్తులయినవారు అన్నమాట వాస్తవం. ఆ వ్యాధి, వయసుమీరిన కొద్దీ, కాపట్యం పెరిగిన కొద్దీ ముదురుతూ పోతుంది. దైవం అలా అనారోగ్య స్థితిలోనే ఉండిపోదలచిన వారికి నడలింపునిస్తూపోతాడు. చివరికి బాధాకరమయిన యాతనలో వారు పడిపోతారు.

ఈ విధంగా ఖుర్ఆన్ ద్వారా ప్రయోజనం పొందగలవారెవరో అలా ప్రయోజనం పొందకపోవడంచేత నష్టపోయేవారెవరో దివ్యఖుర్ఆన్ ప్రారంభంలోనే స్పష్టంగా చెబుతుంది. ఖుర్ఆన్, సందేశహరుణ్ణీ, దాన్ని సందేశాన్నీ నమ్మినివారు అవలంబించే వైఖరిని, దాని పర్యవసానాలను ఆదిలోనే విడమర్చి తెలుపుతుంది. అలాగే ఖుర్ఆన్ బోధనల్ని అటు స్వీకరించి ఆచరించే ధైర్యంలేక, ఇటు తిరస్కరించే సాహసం చేయలేక సందిగ్ధంగా, సంశయావస్థలో పడి కొట్టుమిట్టాడే వారిని గురించి కూడా మొదటే హెచ్చరిస్తుంది ఖుర్ఆన్.

దివ్యఖుర్ఆన్, ప్రపంచంలో మానవాళి పోషిస్తున్న విభిన్న పాత్రల్ని చిత్రిస్తుంది. ఆ చిత్రణలో ప్రతి మానవుణ్ణి, ప్రతి జాతిని సంబోధిస్తుంది. "ఇందులో మీ ప్రస్తావన

ఉంది" (అన్బియా : 10) అంటూ హెచ్చరిక చేస్తుంది. మన పాత్ర ఎక్కడ ఉందో వెదుక్కోవడం, 'ఆత్మచేతన' ఉన్నవారికే సాధ్యం. అయితే ప్రపంచంలో మానవుని భూమికలెన్ని ఉన్నా ధార్మికంగా అవి మూడు విధాలేనని చెబుతుంది ఖుర్ఆన్. సత్యాన్ని విశ్వసించేవారు, సత్యాన్ని తిరస్కరించేవారు అటు విశ్వసించక, ఇటు తిరస్కరించక గోడ మీది పిల్లిలా ఉండే ద్వంద్వ స్వభావులు. ధార్మిక ప్రాతిపదికన చేసే ఈ విభజన, వర్గీకరణ ప్రపంచ వ్యవహారాలలో కూడా ఎలా ప్రతిఫలిస్తుందో చెబుతుంది.

పరమ సత్యాన్ని స్వీకరించిన వ్యక్తి జీవితం, నిర్భయంగా, నిర్దిష్టంగా, నిర్ణీత లక్ష్యంతో, సాఫీగా, సజావుగా సాగుతుంది. తాను చేయవలసిన కార్యక్రమం అతని కళ్ళముందర అనునిత్యం తారసపడుతూనే ఉంటుంది. లక్ష్యం కళ్ళల్లో కదలాడుతూనే ఉంటుంది. మార్గం, సుగమంగా కాకపోయినా స్వచ్ఛంగా దర్శనమిస్తూ ఉంటుంది. మార్గంలో అవాంతరాలను ఎలా తొలగించాలి అన్న సమస్య తప్ప మార్గమేదీ అన్న చిక్కు ఎన్నడూ ఎదురుకాదు. లక్ష్యాన్ని చేరుకునే సులభతర విధానమేదీ అన్నదే కాని లక్ష్యమేమయి ఉండాలి అన్న ప్రశ్నే తలెత్తదు.

కాని దీనికి భిన్నంగా సత్యాన్ని కాదన్న వారికి ఎటు వెళ్ళినా, ఎక్కడికి వెళ్ళినా, ఏ విధానం ఎన్నుకున్నా అంతా స్వేచ్ఛే అనిపిస్తుంది. కాని నిజానికి వారికి గమ్యం తెలియదు, మార్గం కనబడదు; అడుగుతీసి అడుగు వేయాలంటే ఒక దిశ అంటూ ఉండదు, మజిలీ అంటూ మిగులదు. చీకటిలో కొట్టుమిట్టాడటం తప్ప మరేమీ కాదు!

> వీరి ఉదాహరణ ఎలా ఉందంటే, ఒకరు మంటలు మండించగా అవి పరిసరాలన్నింటినీ ప్రకాశింపజేశాయి. అప్పుడు అల్లాహ్ వీరి కంటి వెలుగును హరింపజేశాడు, చీకట్లలో ఏమీ కానలేని స్థితిలో వీరిని వదలివేశాడు. వీరు చెవిటివారు, మూగవారు, గుడ్డివారు. వీరు ఇక మరలిరారు. (బకర : 17,18)

(4-4-03)

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడయిన అల్లాహ్ పేరుతో

బిస్మిల్లాహ్!

వ్రాయడానికి పెన్ను తీశాను, పేపరుపైన ఓ ప్రక్కన 'బిస్మిల్లాహ్' వ్రాశాను. వ్రాయడమే కాదు నోటితోనూ అప్రయత్నంగా పలికాను - బిస్మిల్లాహ్! అని. 'అల్లాహ్' దైవనామం. ఎంతో తీపి, ఎంతో తావి, ఎంతో హాయి ఈ పేరులో! పలికినంతనే చల్లని ప్రశాంతత అంతర్యమంతా, ఆత్మనిండా పరిమళిస్తుంది.

'అల్లాహ్' అన్నది అరబీ శబ్దమేకాని శిశువు పుట్టగానే పెదాలు కదిలించి 'అంబా', 'అమ్మ' అన్నట్లే నాలుక ఆడించి చేసే మొదటి ఉచ్చారణ 'అల్లాహ్' అన్నదే! ఇది విశ్వ ప్రభువుకు మానవాళి ఘటించే విశ్వజనీన స్తోత్రం.

మనిషి కష్టపడి సేదతీరడానికి కూర్చుంటూ పలుకుతాడు- అల్లాహ్! అని. ఎంత ధీమా అందులో! బడలిక తీరి, పనికి సమాయత్తమయి లేస్తూ పలుకుతాడు, 'అల్లాహ్' అంటూ వళ్ళు విరుచుకుంటాడు. ఎటువంటి సంకల్ప నిరతి ఆ స్మరణలో! మనిషి జీవితంలో బాధలను ఓర్చుకుని నిస్సహాయంగా మొరపెట్టుకుంటాడు- యా అల్లాహ్! అని. ఎంత భరోసా ఆ పిలుపులో!! దైవనామం సకల సందర్భాలలో మనిషిలో ఆత్మ విశ్వాసాన్ని, ఆత్మబలాన్ని, ఆత్మస్థయిర్యాన్ని పెంచే మూలపదార్థం!

ఇస్లామ్ నేర్పేది దైవవిధేయతా సంస్కృతి. ఆ సంస్కృతిలో అంతర్భాగం దైవనామ సంస్మరణ. ముఖ్యంగా ప్రతి పని ప్రారంభించేముందు దైవం పేరు పలికి మరీ ప్రారంభించాలన్నది దైవప్రవక్త మహనీయ ముహమ్మద్ (స) బోధన. ఏ పని మొదలు పెట్టినా పలుకుతాడు విశ్వాసి- బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ అని; దైవం పేరుతోపాటు ఆయన రెండు గుణాలను సయితం ఆవాహిస్తాడు- రహ్మాన్, రహీమ్ అన్నవాటిని. 'రహ్మాన్' అంటే కృపాకరుడు, 'రహీమ్' అంటే కరుణామయుడు. కృపతో మనిషికి కావలసిన

ప్రతిదీ ప్రసాదించేవాడు, అవసరాలను తీర్చేవాడు; కరుణతో తప్పుల్ని మన్నించేవాడు, ప్రశాంతతను చేకూర్చేవాడు, అక్కున చేర్చుకునేవాడు – అపార కృపాశీలుడు, పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో ఏ పనినయినా ప్రారంభించే వ్యక్తికి ఇవన్నీ ప్రాప్తిస్తాయి.

పని ప్రారంభిస్తూ దైవనామం సచేతనంగా పలికితే ఆ పనిలో దైవ విధేయత, దైవాజ్ఞాబద్ధత, దైవప్రసన్నతలకు పొసగని ఏ అంశమూ చేరకుండా జాగ్రత్త పడతాడు మనిషి. నిఖిల జగతికి ప్రభువయిన అల్లాహ్ కృప తనకు అండగా నిలవాలని, ఆయన కారుణ్యచ్ఛాయల ఒడిలో తన కార్యం నెరవేరాలని మనసారా కోరుకుంటాడు. అందుకని, ఆ పనిలోని మంచి కోణాలనే ఎంచుకుంటాడు; చెడులకు వీలయినంత మేర దూరంగా తొలిగిపోతాడు. చేసే పనిలో దుష్టలక్ష్యాలకు, వికృత ఉద్దేశ్యాలకు, అవినీతి విధానాలకు, దొంగచాటు సాధనాలకు పాల్పడడానికి జంకుతాడు. ఆ పని సవ్యంగా, సక్రమంగా, ధర్మబద్ధంగా నెరవేరాలంటే మానవాళిలో ఎవరికీ హాని కలిగించకుండా, ఎవరినీ నష్టపరచ కుండా, ఎవరి హక్కునూ కొల్లగొట్టకుండా– ఒక్క మాటలో, దైవాగ్రహాన్ని ప్రేరేపించే ఏ చేష్ట కూడా ఆ పనిలో భాగమవకుండా నడుచుకుంటాడు మనిషి.

మనస్ఫూర్తితో దైవనామ సంస్మరణ చేస్తూ ఏ పని ప్రారంభించినా అందులో మనిషి చెడు త్రోవ త్రొక్కకపోవడమేకాక ఆ కార్యనిర్వహణలో దేవుని పక్షాన సకల శుభాలు మనిషితో సహజీవనం చేస్తాయి. అవాంతరాలన్నీ అంతమవుతాయి. మార్గాలన్నీ సుగమ మవుతాయి. ఆ పని జరుగుతూ ఉన్నంత కాలం ఒక్కొక్క దశలోనూ అన్నీ మేళ్ళే జరుగుతాయి. దేవుని అగోచర సహాయం, ఆయన మార్గదర్శక ప్రేరణలు అనుక్షణం అడుగడుగునా మనిషికి తోడునీడగా నిలుస్తాయి. దైవసహాయం తనకు అంచెలంచెలుగా అందడాన్ని అతను తన చర్మచక్షువులతో వీక్షిస్తాడు.

దైవనామ సంస్మరణలోని మహత్తు అలాంటిది. రండి కలసి పలుకుదాం– బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్!

(18-10-2002)

అల్ హమ్ముదులిల్లాహ్!

ఈ వృద్ధజగతి ఇలాగే కళకళలాడుతూ, మలమల మాడుతూ, వలవల వగుస్తూ, కిలకిల నవ్వుతూ ఎన్ని కోట్ల సంవత్సరాల నుండి కొనసాగుతూ ఉందో! ఈ విశ్వంలోని సకల శోభలు, సమస్త సౌందర్యాలు, అఖిల ఆనందాలు ఎవరి కోసం? పుడమి తల్లిని ప్రభు ప్రతినిధిగా ఏలుతున్న మానవుని కోసం కాదా! అవును, ఎప్పుడయినా తీరుబడిగా, కాస్సేపు ఏకాంతంలో కూచుని గంభీరంగా ఆలోచిస్తే ఇట్టే అర్థమవుతుంది- ఈ సృష్టి కళ యావత్తు ఈ ఆరడుగుల మనిషి అనే ప్రాణి కోసమే అని. మిగతా సృష్టిరాశులన్నీ ఈ శ్రేష్ఠ సృష్టి మానవుని కొరకే అయితే మానవుడు మటుకు తన కర్త, స్వామి, ప్రభువు, విశ్వవిరాట్టు దైవం సేవ కొరకు సృష్టించబడ్డాడని! "ఆయనే కదా పుడమిని మీ కొరకు అధీనపరచినవాడు, దాని ఛాతీపైన సంచరించండి, ఆయన ఇచ్చినదాన్ని తినండి, ఆయన సన్నిధిలోనే మీరు తిరిగి లేచి వెళ్ళవలసి ఉంది" (అల్ ముల్క్ : 15). "నేను జిన్నులనూ మానవుల్నీ నా దాస్యం చెయ్యడానికే తప్ప మరి దేనికీ సృష్టించలేదు" (అజ్ జారియాత్ : 56). అల్ హమ్దులిల్లాహ్, స్తోత్రం దైవం కొరకే చెల్లు!!

"అల్ హమ్దులిల్లాహ్" స్తోత్ర వాచకం, కృతజ్ఞతాసూచకం కూడా. "స్తోత్రం అల్లాహ్‌కే చెందుతుంది" అని దాసుడు అన్నాడంటే అతని దృష్టిలో దైవమనుగ్రహించిన తన వ్యక్తిత్వం, తన శక్తిసామర్థ్యాలతోపాటు ప్రభువు తన కోసం పరచిన విస్తరిలాంటి ఈ జీవితం, ఇందులోని అసంఖ్యాకమయిన ఈ సౌలభ్యాలు, సౌకర్యాలు, విలాసమయ విలక్షణాలతో విరాజిల్లే కొంగ్రొత్త పోకడలు- అన్నీ మెదులుతాయి. ఇంకా వీటన్నింటికీ చోటిచ్చిన, సర్వశోభాయమానమయిన సృష్టికళ అతని కళ్ళల్లో మెరుస్తుంది. ప్రకృతి వింతల్ని చూసి అతని అంతర్యం దీని కర్త పట్ల ప్రశంసాభావంతో ఉప్పొంగిపోతుంది. ఇదంతా తన కోసమే అన్న తలంపు రాగానే కృతజ్ఞతాభావంతో వినమ్రమవుతుంది.

అతను అప్రయత్నంగా ఆనందంతో డోలలూగుతూ హృదయాంతరాళం నుండి పలుకుతాడు- అల్ హమ్దులిల్లాహ్, స్తోత్రం అల్లాహ్ కొరకే చెల్లు, ఆయనకే నా కృతజ్ఞతాభివందనాలు అని!

ఈ రెండు అర్థాలలోనూ దివ్యఖుర్ఆన్‌లో 'అల్ హమ్దులిల్లాహ్' వచ్చిన కొన్ని వాక్యాలను గమనించండి:

స్తోత్రం కేవలం అల్లాహ్‌కే, ఆయన నిఖిల జగతికి ప్రభువు, కృపాకరుడు, కరుణామయుడు. (ఫాతిహా :1,2)

స్తోత్రం కేవలం అల్లాహ్‌కే, ఆయన గగన భువనాలను సృష్టించాడు, చీకట్లను వెలుగునూ రూపొందించాడు. (అన్ఆమ్ :1)

వారంటారు, "అల్లాహ్‌కు వేనవేల కృతజ్ఞతలు. ఆయన మమ్మల్ని ఇక్కడికి (స్వర్గానికి) చేరే దారి చూపాడు. ఆయనే గనక మాకు దారి చూపకపోయినట్లయితే మేము ఎన్నటికీ చేరుకునేవారముకాము." (ఆరాఫ్ :43)

చెప్పు, స్తోత్రం కేవలం అల్లాహ్‌కే, ఆయనకు సంతానమూ లేదు, ఆయన రాజ్య పరిపాలనలో ఎవరూ సహవర్తులు లేరు, ఆయనకు తోడ్పాటుదారుల అవసర ముందనడానికి ఆయన బలహీనుడూ కాదు. నీవు ఆయన మహత్తును పెద్ద పెట్టున ప్రకటించు. (బనీ ఇస్రాయీల్ : 111)

స్తోత్రం కేవలం అల్లాహ్‌కే, ఆయన తన దాసునికి ఈ గ్రంథం, ఖుర్ఆన్ అవతరింప జేశాడు, ఇందులో ఎటువంటి కొరతను ఉండనివ్వలేదు. (కహఫ్ :1)

స్తోత్రం కేవలం అల్లాహ్‌కే చెల్లు, ఆయన మమ్మల్ని దుర్మార్గుల బారి నుండి కాపాడాడు. (మూ'మినూన్ : 28)

చెప్పివెయ్యి, స్తోత్రం కేవలం అల్లాహ్‌కే, అతి త్వరలోనే ఆయన తన సూచనలు చూపెట్టనున్నాడు, వాటిని మీరు స్వయాన గుర్తుపడతారు. మీరు చేస్తున్నదంతా మీ ప్రభువుకు తెలియకుండా లేదు. (నమ్ల్ : 93)

ప్రపంచంలోనూ, పరలోకంలోనూ స్తోత్రం కేవలం ఆయనకే చెందుతుంది, పరిపాలనాధికారము ఆయనదే, ఆయన వైపునకే మీరంతా మరలిపోవలసి ఉంది. (కసస్ : 70)

స్తోత్రం కేవలం అల్లాహ్‌కే చెల్లు, ఆయన స్వామ్యంలోనే ఆకాశాలలోనూ భూమిలోనూ ఉన్నవన్నీ ఉన్నాయి; పరలోకంలోనూ స్తోత్రం ఆయనకే. ఆయన మహా వివేచనాపరుడు, అన్నీ బాగా ఎరిగినవాడు. (సబా :1)

వారంటారు, "అల్లాహ్‌కు వేనవేల కృతజ్ఞతాభివందనాలు, ఆయన మా మనః క్లేశాన్ని దూరం చేశాడు; నిస్సందేహంగా మా ప్రభువు ఎంతో మన్నించేవాడు, విలువనిచ్చేవాడు." (ఫాతిర్ : 34)

అప్పుడు అంటారు, "అల్లాహ్‌కు కృతజ్ఞతలు, ఆయన మాకు చేసిన తన వాగ్దానాన్ని నెరవేర్చాడు, మమ్మల్ని ఈ నేలకు వారసులుగా చేశాడు, స్వర్గంలో మేము ఇష్టమయిన చోట నివాసం ఏర్పరచుకోవచ్చు, సదాచరణ చేసేవారికి ఎంతో ఉత్తమ ప్రతిఫలమిది!" (జుమర్ : 74)

ఎట్టి పరిస్థితిలోనూ మానవుని కృతజ్ఞతలకు అర్హుడయినవాడు ఆ ప్రభువే. ఒక మహనీయుడు అంతర్జాతీయ వాణిజ్యంలో పేరు గడించినవాడు. ధార్మిక బోధకుడు కూడా. ఒక ధర్మబోధనా సదస్సులో నిమగ్నుడయి ఉన్నవేళ ఒక పరిచారకుడు వచ్చి, అతని సరకు తెస్తున్న ఓడ సముద్ర తుఫానులో చిక్కుకుని మునిగిపోయింది అన్న సమాచారాన్ని అందజేస్తాడు. ఆయన కొన్ని క్షణాలు తలవంచి మౌనంగా గడుపుతాడు. తరువాత తలపైకి లేపి అల్‌హమ్దులిల్లాహ్! అంటాడు. తిరిగి ఆయన బోధనా పాఠం యథాప్రకారం సాగుతుంది. కొన్ని గంటల తరువాత ఆ పరిచారకుడు తిరిగివస్తాడు. లోగడ తెలిపినట్లు ఓడ మునగడం నిజమే కాని అది ఆయనది కాదు, మరెవరిదోనని, ఆయన ఓడ భద్రంగా ఉందని తెలుపుతాడు. ఆ మహనీయుడు కొన్ని క్షణాలు తలవంచి మౌనం పాటిస్తాడు. ఆపైన తలపైకెత్తి అల్‌హమ్దులిల్లాహ్! అంటాడు. మళ్ళీ ఆయన కార్యక్రమం యథావిధిగా సాగుతుంది. కార్యక్రమం ముగిసిన తరువాత ఆయన శిష్యగణంలో కొందరు, "అయ్యా, మీరు ఉభయ సమాచారాలకు 'అల్‌హమ్దులిల్లాహ్' అనే పలికారు, దాని మర్మమేమిటీ" అని అడుగుతారు. ఆయన ఇలా బదులిస్తాడు, "మొదటి వార్త విన్నప్పుడు మనసు అసాధారణంగా వికలమయిందా, బాధపడిందా అని పరిశీలనగా చింతన చేశాను, అక్కడ తృప్తి గోచరించింది. దానికి దైవానికి కృతజ్ఞతలర్పించు కున్నాను. రెండవ సమాచారం విన్న తరువాత ఆంతర్యంలో అసాధారణ మయిన ఆనందం పెల్లుబికిందా అని పరిశీలించాను. అక్కడ మళ్ళీ తృప్తే కానవచ్చింది. దానికీ ప్రభువుకు కృతజ్ఞతలు అర్పించుకున్నాను."

ఎట్టి పరిస్థితిలోనూ సంతుష్టి, సంతృప్తి, సుఖదుఃఖాలలో సమానానుభూతి భావాలే నిజమయిన దైవభక్తికి తార్కాణాలు. అదే ప్రాప్తమయితే కావలసిందే ముంది – అల్‌హమ్దులిల్లాహ్!

(1-11-2002)

ఇన్షా అల్లాహ్

మనిషి ఆశా జీవి. ఆశల వీధుల్లో విహరించడం, కొత్త కొత్త తోటలు పెంచు కోవడం అతని అభిరుచి. ఏమేమో చేయాలని, ఎన్నెన్నో సాధించాలని అనుకుంటాడు, సాధించే పథకాలు పకడ్బందీగానే నిర్మించుకుంటాడు కూడా. అంతేకాక తన కృషికి, ప్రయత్నాలకు తగినట్లు ప్రకటనలు కూడా చేస్తాడు. తాను చేయదలచుకున్నదంతా చాటి చెబుతాడు. ఎన్నో ప్రగల్భాలు పలుకుతాడు. కొన్ని పర్యాయాలు డాంబికాలుకాక చిత్తశుద్ధితో కృషి జరపాలన్న సత్సంకల్పంతోనే పలుకుతాడు. కాని వాస్తవంగా మనిషి ఏమీ చెయ్యలేడు. ప్రపంచంలో "చక్రం" మొదలుకుని ప్రగతి వికాసాల బాటన "రాకెట్టు" వరకు కనిపెట్టి భూతలం మీదనే కాకుండా గగనతలంలోనూ స్వేచ్ఛావిహారం సాగిస్తున్నవాడు మనిషే! అయినా మనిషి చెయ్యగలిగింది బహు స్వల్పం. నిఖిల జగత్తును తన హస్తగతం చేసుకుని అనుక్షణం దశాదిశల నిర్దేశనలతో విశ్వాన్ని నడుపుతున్న ప్రభువు, స్వామి, దైవం చెయ్యనివ్వనిదే, ఆయన అనుజ్ఞ, ఆజ్ఞ లేనిదే ఏదీ జరగదు, మనిషి ఏమీ చెయ్యలేడు, మనిషి చెయ్యగలిగింది ఏమీ లేదు!!

ఒక్క చిన్న సంఘటన, అనుదినం సంభవించే ఒక సాధారణమయిన ఉదంతం మానవ నాగరికతలో అంతులేని పరివర్తనకు కారణమవుతుంది; చెట్టు నుండి రాలే ఒక యాపిల్ పండు, ఉడికే టీ పాత్ర పైన కదలిన దాని మూత వల్ల మనిషి ప్రగతీ వికాసాల ఎత్తయిన సోపానాలనెక్కగలిగే స్థోమతను సంపాదించాడు. ఇది వాస్తవమే, కాని ఆ సందర్భాల కల్పన, సర్వసాధారణమయిన ఆ సందర్భాలలో మనిషి అంతర్యాన జనించిన ప్రేరణలు దైవికమయినవే తప్ప మరేమీ కావు. మనిషి ఊహాతీతంగా ఎదురయిన ఘటనల వలెనే మనిషి ఆలోచనల్లోని ఊహా సౌధాలన్నీ ఒక్క ప్రకృతి కుదుపుతో కూలి నేలమట్టమయిన సంఘటనలు కోకొల్లలు. అందుకే మానవ సమాజంలో అనుభవాల సారంగా ఏర్పడిన అనేక నానుడులలో ఒకటి "తానొకటి తలిస్తే దైవమొకటి తలచును"

అన్నది. మనిషి ఎన్నో ఆశల ఆకాశహర్మ్యాలు నిర్మించుకుని, ప్రకటించుకుని, భావనల భవంతుల్లో నివసిస్తూ, బస్సుల్లో, రైళ్ళల్లో, విమానాల్లో, ఓడల్లో ప్రయాణిస్తూ ఉంటాడు. "దుర్ఘటనలు"గా పేర్కొనబడే అనేక సంఘటనల్లో మనిషి మేనుతోపాటు ఆ మేడలు సయితం అంతుపట్టకుండాపోతాయి. ఏ ప్రయాణం చెయ్యకపోయినా ఇంటిపట్టున కూర్చున్నవాని ఆలోచనలకు, ఆచరణలకు, ఆవేశాలకు అడ్డుకట్టగా "ప్రకృతి వైపరీత్యాలు" అనబడే ప్రకృతి పరిణామాలు లేక ఆరోగ్య సంబంధమయిన అపశృతులు సంభవించి అంతా క్షణాలలో తల్లక్రిందులయిపోతుంది.

ఇవన్నీ చాటిచెబుతున్నదేమిటీ? సర్వస్వతంత్రుడయిన మనిషి సంపూర్ణ స్వతంత్రుడు కాడు. అనుకున్నవన్నీ చెప్పడానికి, చెప్పినవన్నీ నెరవేరడానికి అతని ఒక్కని ప్రమేయంతోటే విశ్వ కార్యకలాపాలు సాగటం లేదు. కోటానుకోట్ల మానవులందరిపైనా, వారి ఆశలపైనా, వారి ఆశయాలపైనా, వారి ఆక్రందనలపైనా, ఆక్రోశనలపైనా సర్వాధికారమున్న స్వామి, విశ్వం అంతటికీ ప్రభువు అయిన దైవం, ఆ దేవుని అభీష్టం, అభిమతం ఒకటుంది. అదే సకల కార్యనిర్వహణల వెనుక అసలు శక్తి. మనిషి చేస్తున్నట్లు, మనిషి తన పథకాన్ని కార్యాచరణ ద్వారా పరిపూర్ణం చేస్తున్నట్లు కనిపించినా అసలు నిర్వాహకుడు ఆ ప్రభువే. అదే మరచిపోవద్దు అని హెచ్చరిస్తున్నాడు నిజ ప్రభువు:

> ఏ పనినయినా 'నేను, రేపు తప్పక చేస్తా'నని ఎంత సేపటికీ గట్టిగా చెప్పనేరాదు. అయితే వెంటనే 'ఇన్షా అల్లాహ్' (దైవం తలచినట్టయితే) అని పలకాలి. ఇంకా ఎప్పుడయినా మరపు సంభవిస్తే, 'నా ప్రభువు నన్ను మరింతగా సన్మార్గానికి, సన్నిహితమయిన మాటకు దారిచూపుతాడ'ని చెప్పాలి. (అల్ కహఫ్ : 23,24)

ఇస్లామ్ మనిషికి నేర్పే సంస్కృతీ నాగరికతల్లో ఒకటి, మనిషి తన శక్తి సామర్థ్యాలపైన మిడిసిపాటుకు గురికాకుండా తన సృష్టికర్త అయిన దైవంపైన భారం మోపడం. దైవంపైన భారం మోపే ఆ స్పృహను, ఆ చేతనను నిత్యం జాగృతంగా, తేజోవంతంగా, చలనవిహితంగా ప్రజ్వలింపజేయడానికి, భవిష్యత్తును గురించి పలికేటప్పుడు- అది ఎంతటి సాధారణమయిన విషయమయినా, ఎంతటి తథ్యమయిన అంశమయినా, ఎంతటి అచంచల నిశ్చిత, నిర్ధారిత కార్యక్రమమయినా- 'ఇన్షా అల్లాహ్' అన్న పదబంధంతో కలిపే పలకాలి అన్న విధ్యుక్త ధర్మాన్ని బోధించింది ఇస్లామ్. దైవంపైన భారం మోపే స్పృహతోపాటు ఆ కార్యనిర్వహణకు దైవసహాయాన్ని అర్థించే ప్రేరణ కూడా తద్వారా ప్రాప్తమవుతుంది. ఏదో లాంఛనంగాకాక సచేతనంగా పలికే ఆ మాటలకు, దాని వెనక దేవుని ఇష్టం కూడా తోడవ్వాలన్న ప్రబల వాంఛ గోచరిస్తుంది. మనిషి చిత్తశుద్ధితో దైవాన్ని సహాయం అర్థిస్తే అది ప్రాప్తమవడంలో ఆశ్చర్యమేముంది?

'ఇన్షా అల్లాహ్' అన్న పదబంధం ప్రయోగించబడిన ఖుర్‌ఆన్ ఆయత్‌లను కొన్నింటిని పరిశీలిద్దామా?

తల్లిదండ్రులకు దూరమయిన మహనీయ యూసుఫ్(అ)ని రకరకాలుగా బాధ పెట్టిన సోదరులు చివరికి ఆయన్నే ఆశ్రయించగా ఆయన ఈజిప్ట్ సర్వాధికారిగా వారిని ఆదుకోవలసి వచ్చినప్పుడు ఆయన ఎంతో ఉదారంగా వారిని ఆహ్వానించారు. తల్లిదండ్రుల్ని సయితం తీసుకురమ్మని కోరారు. అలా వారు వచ్చినప్పటి సందర్భం:

> అప్పుడు ఆ పరివారమంతా యూసుఫ్ వద్దకు చేరినప్పుడు యూసుఫ్ తన తల్లిదండ్రులకు తన చెంత చోటు కల్పించాడు. ఇలా అన్నాడు, 'దేవుడు సమ్మతిస్తే' మీరంతా శాంతిభద్రతలతో ఈజిప్ట్‌లోకి ప్రవేశిస్తారు. (యూసుఫ్ : 99)

హజ్రత్ మూసా (అ), దైవం నియమించిన ఒక జ్ఞాని అయిన వ్యక్తితో కలసి ప్రయాణానికి సమాయత్తమయినప్పుడు ఆ జ్ఞాని, మీరు నా చేష్టలకు ఓపిక పట్టలేరు అని అన్న సందర్భంలో:

> మూసా ఇలా సమాధానం పలికారు, "దైవం కోరినట్లయితే మీరు నన్ను సహనశీలునిగా గుర్తిస్తారు, నేను ఏ విషయంలోనూ మీ పట్ల అవిధేయతకు పాల్పడను." (అల్ కహఫ్ : 69)

మహనీయ మూసా (అ) ఈజిప్ట్ నుండి బయలుదేరి మద్‌యన్ వెళ్ళి ఒక కుటుంబంలో పనికి చేరినప్పుడు ఆ కుటుంబం యజమాని ఆయన్ని తన ఇంట పనిచేసే ఒడంబడిక చేస్తున్నప్పుడు చెప్పిన మాటలు:

> "... మీరు ఎనిమిదేళ్ళు మా ఇంట పని చేయాలి. మీరు ఒకవేళ పదేళ్ళు పూర్తి చేసినట్లయితే అవి మీ పక్షాన ఉత్తమ ప్రవర్తనగా భావిస్తాము, నేను మిమ్మల్ని కష్టపెట్టాలని అనుకోవడం లేదు. దైవం తలచినట్లయితే ముమ్ముందు మీరు నన్ను సజ్జనునిగా కనుగొంటారు." (అల్ కసస్ : 27)

మహనీయ ఇబ్రాహీమ్ (అ) తన జ్యేష్ఠ కుమారుని తీసుకుని బయలుదేరిన తరువాత అతన్ని సంబోధించి, "నా చిట్టీ, నేను నిన్ను జిబహ్ (వధ) చేస్తున్నట్లు కలగన్నాను, ఇక నీ అభిప్రాయమేమిటో నాకు చెప్పు" అని, పురమాయించినప్పుడు హజ్రత్ ఇస్మాయీల్ (అ) ఇలా అన్నారు:

> "నాన్నగారూ, మీకు ఆదేశమయినట్లే మీరు ఆచరించండి 'దైవం తలచినట్లయితే' నన్ను మీరు సహనశీలునిగానే చూస్తారు." (అస్ సాఫ్ఫాత్ : 102)

సజ్జనుడయిన దైవభక్తుడు, ఎన్నడూ తన నైతిక బలాన్ని, బుద్ధిబలాన్ని, భుజబలాన్ని, అంగబలాన్ని ఆసరగా తీసుకుని ప్రగల్భాలు పలకడు. వినయ వినమ్రతలతో దైవంపై భారం మోపి భావిని గురించి తన సంకల్పాన్ని వ్యక్తం చేస్తాడు. ఇది దైవభక్తుని విధానం– ఇన్షా అల్లాహ్!

(20-12-2002)

మాషా అల్లాహ్

అందమయినదాన్ని పొందికగా రూపొందించడమయినా, అసాధ్యమని అనుకున్న దాన్ని సాధ్యంచేసి పెట్టడమయినా, ఏ రంగంలోనయినా ప్రశంసనీయంగా ముందడుగు వేయగలగడమయినా మనసుకు ఎంతో ఒప్పుతుంది. మనిషి అప్రయత్నంగా దాన్ని శ్లాఘించాలని అనుకుంటాడు, శ్లాఘిస్తాడు కూడా. ఆ ప్రశంస, ఆ పొగడ్త 'సుందర సృష్టి'కి కాదు, 'సౌందర్య స్రష్ట'కు చెందాలి. స్రష్టకు చేసే ప్రశంసే సృష్టికి చెందుతుంది. 'ఎంత బాగా చేశాడు, మాషా అల్లాహ్!'

'మాషా అల్లాహ్' అంటే దైవం తలచిన విధంగా, దైవం కూర్చిన విధంగా అని అర్థం. ఒక వస్తువు తనకు నచ్చినా, ఒక పని తనకు నప్పిన విధంగా జరిగినా మనిషి సంతోషిస్తాడు. 'ఎంత బాగుందో!' అనుకుంటాడు. ఆ సందర్భంలో సమస్త కార్యకారణాలకు మూలమయిన దైవశక్తి మనిషికి గుర్తుకు వస్తుంది. మెచ్చుకోలుగా "మాషా అల్లాహ్, దైవం అనుకుని కూర్చిన విధంగానే ఉంది" అంటాడు.

సృష్టి క్రియలో జరిగిన ఏ ఇష్టమయిన కార్యాన్నయినా, మానవ కృషి వల్ల రూపొందిన ఏ సృజననయినా, మానవుడు సాధించిన ఉత్కృష్టతనయినా చూడగానే, వినగానే, అనుభవించగానే మనిషి ఆంతర్యంలో నుంచి, సంతృప్తిగా, సంతోషంగా వెలువడే పదాలు 'మాషా అల్లాహ్' అన్నవి. ఆ పదాల వెనక తెలియాడే భావలహరిలో దైవం సుందర స్వరూపుడు, సౌందర్యాన్ని ఇష్టపడతాడు, తాను తలచినదేదయినా చేస్తాడు, ఆయన తలచినప్పుడే ఏదయినా నెరవేరుతుంది, కేవలం మానవ సంకల్పం వల్ల సాధ్యమయ్యేదేదీ లేదు, దైవసంకల్పం, సహాయం, సహకారం మానవ కృషికి తోడ్పాటు అందజెయ్యనిదే దానికి అందం, పొందిక, పరిపూర్ణత, పరిపక్వత చేకూరవు అన్న భావాలు, భావనలూ కలగలసి ఉన్నాయి. ఈ భావనలు, ఆలోచనలు మనిషి ఆంతర్యంలో

పరిశుద్ధంగా, పవిత్రంగా మనఃపూర్వకంగా మొలకెత్తినప్పుడు నిజంగానే మానవ శ్రమకు దైవిక సహాయం తోడవుతుంది. తన కృషి దైవం దృష్టిలో స్వీకారయోగ్యమయిందని తెలుసుకుని దాసుడు ప్రభువుకు మరింతగా చేరువవుతాడు. అంతకన్నా కావలసిందే ముంది?

దివ్యఖుర్ఆన్‌లో 'మాషా అల్లాహ్' అన్న పదాలు వచ్చిన సందర్భాలను పరిశీలిద్దాము.

సన్నివేశం: పరలోకంలో జిన్నులూ, మానవులూ తాము తిరస్కరిస్తూ వచ్చిన సత్యం కళ్ళెదుట సాక్షాత్కరిస్తూ ఉండగా చూసి, తమ తప్పిదాన్ని ఒప్పుకుంటారు; అప్పుడు అల్లాహ్ వారిని సంబోధిస్తూ ఇలా అంటాడు:

> మీరెల్లరి నివాసం ఇక నరకమే. అందులోనే మీరు సదా ఉండిపోతారు. అయితే అల్లాహ్ స్వయంగా కోరుకున్నట్లయితే అది వేరే విషయం. నిస్సందేహంగా నీ ప్రభువు ఎంతో విజ్ఞతాసంపన్నుడు, జ్ఞానధనుడు. (అల్ అన్ఆమ్ : 128)

మరో సందర్భం– మక్కా వాసులు, ప్రళయం ఎప్పుడు సంభవిస్తుంది? అని ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స)ని అడుగుతున్నారు. దాని ఎరుక దైవానికే తప్ప ఎవరికీ లేదని చెప్పమని ఆయనకు పురమాయిస్తూ–

> వారికి చెప్పివెయ్యి, "నేను స్వయంగానూ నా కొరకు కూడా ఎటువంటి మేలుకయినా కీడుకయినా అధికారం కలిగిలేను– అల్లాహ్ సంకల్పించినదేదో అదే తప్ప..." (అల్ ఆరాఫ్ : 188)

అచ్చంగా అటువంటి సందర్భంలోనే మరోసారి ఇలా చెప్పివేయాలని ఆదేశించడం జరిగింది:

> నీవు చెప్పివెయ్యి, "నేను స్వయంగా నా కొరకు కూడా ఎటువంటి లాభాన్నయినా నష్టాన్నయినా కలుగజేసుకునే అధికారం నాకూ లేదు– అల్లాహ్ సమ్మతించినదేదో తప్ప." (యూనుస్ : 49)

మరో చోట ఒక ఉపమానాన్ని ప్రస్తావిస్తూ అందులోని ఒక పాత్ర తాను పెంచిన ద్రాక్ష తోటలో విరివిగా పండిన ఫలసాయాన్ని చూసి మురిసిపోయి దైవాన్ని మరచిపోయిన వైనాన్ని పేర్కొంటూ దైవభక్తుడయిన అతని మిత్రుడు అతన్ని సంబోధిస్తూ పలికిన మాటల్ని ఉటంకిస్తుంది ఖుర్ఆన్:

> "...నీవు నీ తోటలోకి ప్రవేశిస్తూ, అల్లాహ్ మాత్రమే దేన్ని కోరినా, ఏది చేసినా, ఆయన సహాయంతోటే ఏ శక్తి అయినా ప్రాప్తించేది...అని ఎందుకు అనలేదు?" అని అంటాడు... (అల్ కహఫ్ : 39)

మరో చోట ఖుర్ఆన్‌ని వహీ ద్వారా ప్రవక్త మహనీయులు (స)ను బోధించడాన్ని ప్రస్తావిస్తూ దివ్యఖుర్ఆన్‌లోనే దేవుడు ఇలా అంటున్నాడు:

> మేము నీకు (చదువ) నేర్పుతాము, ఆ తరువాత నీవు దాన్ని మరచిపోవు. అయితే అల్లాహ్ (మరపింపాలని) కోరితే అది వేరే విషయం. ఆయన వ్యక్తమయ్యేదాన్నీ, గుప్తమయినదాన్నీ బాగా ఎరిగినవాడు. (అల్ ఆలా : 6, 7)

వీటివల్ల తెలిసేది ఒక్కటే- మంచి జరిగినా చెడు జరిగినా అన్నీ దైవ సంకల్పం వల్లనే జరుగుతాయన్న స్పృహ దైవవిశ్వాసికి, దైవదాసుని అంతర్యంలో నిరంతరం జాగృతమయి ఉండాలి. అందువల్లనే ఎటువంటి సందర్భమయినా నరే దైవాన్ని స్మరించుకునే అవకాశం కల్పించుకునేలా దైవ విశ్వాసి శిక్షణ జరుగుతుంది. జీవితంలో అలవరచుకోవలసిన మర్యాదల్లో, సంస్కారాల్లో, దైవ ప్రవక్త (స) సంప్రదాయాల్లో ముఖ్యంగా దైవనామ సంస్మరణలున్న పదాలు అనేకం భాషలో నానుడుల్లా, జాతీయాల్లా ఇమిడిపోయాయి, అమరిపోయాయి- మాషా అల్లాహ్!

(27-12-2002)

అస్సలాము అలైకుమ్

మనిషిని మరో మనిషి కలసుకోవడం అన్నది చూపుతో మొదలవుతుంది, పలక రింపుతో కొనసాగుతుంది, చేతులు కలపడంతో ఒక వంతు ముగుస్తుంది. పలకరింపులో చిరునవ్వుతోపాటు యోగక్షేమాలు తెలుసుకునేముందు ఒకరినొకరు అభివాదన చేసుకోవడం పరిపాటి. అభివాదనలు, శుభాకాంక్షలు తెలుపుకునే సంప్రదాయం మనిషి మాట నేర్పిన సంప్రదాయమంత ప్రాచీనమయినది అనంటే అతిశయోక్తి కాదేమో.

"హాయ్, హలో, గుడ్ మార్నింగ్, గుడ్ ఈవినింగు"లు పాశ్చాత్యుల అభివాదాలయితే, "నమస్తే, నమస్కారం, దండం, వణక్కం" వంటివి భారతీయ సంస్కారంలో భాగాలు. ఇంతకూ ఇస్లామ్ నేర్పిన అభివాద మర్యాదలో 'శుభాకాంక్ష' అనే భావం సంపూర్ణ స్థాయిలో గోచరిస్తుంది. ఇస్లామ్ ఆవిర్భావానికి పూర్వం అరేబియాలో "హయ్యాక" "తహయ్యాత్" అనుకునేవారు. అది దాదాపు "మీకు జయమగుగాక!" "జయం!" అన్న భావంలో ప్రయోగించుకునే వారేమో! కాని ఇస్లామ్ శుభాకాంక్షకు సహేతుకమయిన, సమంజసమయిన పదాలను దాని ఆధ్యాత్మిక సంస్కారాన్ని అనుసరించి ప్రతిపాదించింది. "అస్సలాము అలైకుమ్!" "మీకు శాంతి కలుగుగాక!"

ఇతర సంస్కృతుల్లో పిన్నలు పెద్దలకు అభివాదన తెలుపడమే మర్యాద. పెద్దలు చిన్న వారికి అభివాదన చేసే ఆనవాయితి లేదు. ఎవరయినా వయసులో పెద్దలు పిన్నలకు అభివాదం ఎప్పుడయినా చేసినట్లయితే అది పిన్నల స్థాయి 'పెద్ద'దయినప్పుడే సాధ్యం! ఈ సంప్రదాయానికి, అభివాదనకు ఉపయోగించే పదాలు కూడా చాలా మటుకు కారణం కావచ్చు. సమాన స్థాయివారు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకునేందుకు, చిన్న స్థాయివారు పెద్ద స్థాయి వారికి తమ వినయం తెలుపుకునేందుకు పనికివచ్చే అభివాదన పదాలే దాదాపు అన్ని సభ్యతాసంస్కృతుల్లో చోటుచేసుకున్నాయి. పెద్దలు

పిన్నలకు శుభాకాంక్షలు తెలుపుకునేందుకు అనువయిన పదాలు దాదాపుగా ఇస్లామేతర సంప్రదాయాల్లో వేటిలోనూ లేవనే చెప్పవలసి ఉంటుంది. కాని ఇస్లామ్ నేర్పే పదాలు ఎవరయినా తమ శుభాకాంక్షలు, తమ మనోభిలాష ఎదుటి వ్యక్తికి సంతోషంగా, సంతృప్తికరంగా తెలుపుకునేందుకు వీలు కల్పిస్తాయి.

పెద్దవారు ఎవరయినా పిన్నలకు 'దండం' పెట్టలేరు! 'నమస్కారం నాయనా' అని మోకరిల్లజాలరు, 'వణక్కం' అని వినయం చాటుకోలేరు. కాని 'అస్సలాము అలైకుమ్' అని ఆశీర్వదించగలరు, దీవించగలరు. పిన్నలు కూడా పెద్దల ఎడ గౌరవంగా "మీకు శాంతి ప్రాప్తమగుగాక!" అని వినమ్రత ప్రకటించుకోవచ్చు. ఈ పదాలు దైవం సమక్షంలో దాసుని వేడుకోలు. పిన్నలకు, పెద్దలకు, ధనవంతులకు, నిరుపేదలకు, స్త్రీలకు, పురుషులకు ఎవరికయినా ఎవరి పక్షాననయినా వర్తిస్తాయి. ఎవరయినా పలకవచ్చు, ఎవరినయినా పలకరించవచ్చు.

"ఇస్లామ్" అనే పదంలోనే శాంతి భావన ఉండటం మూలాన దివ్యఖుర్‌ఆన్‌లో శాంతిని సూచించే "సలామున్", "అస్సలాము" అన్న పదాలు, వాటి విభిన్న రూపాలు, క్రియావాచకాలు, నామవాచకాలు విరివిగా ప్రయోగించబడ్డాయి. అభివాదన రూపంలోనే కనీసం పాతిక చోట్లయినా ఈ పదం ప్రయోగించబడింది. దివ్యఖుర్‌ఆన్‌లో 'సలామ్' అనే పదాన్ని ప్రయోగించి అభివాదన చేయాలని సంస్కారం నేర్పిన కొన్ని సందర్భాలను పరిశీలిద్దాము:

సమాజంలో హీనంగా చూడబడే వారు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించడాన్ని కులీనులయినవారు ఏవగించుకోవడాన్ని ప్రస్తావిస్తూ దివ్యఖుర్‌ఆన్ ఇలా బోధిస్తుంది:

> నీ వద్దకు, మా వచనాలను విశ్వసించే వారు వచ్చినప్పుడు వారికి "మీకు శాంతి కలుగుగాక, మీ ప్రభువు, దయాదాక్షిణ్యాల విధానం తనకు తప్పనిసరి అయినదిగా నియమించుకున్నాడు....." (అల్ అన్ ఆమ్ : 54)

ప్రళయం తరువాత మంచీ చెడుల తీర్పు జరిగిన తరువాత స్వర్గవాసులు, నరకవాసుల మధ్య ఒక ఎత్తయిన తెరవంటి స్థానం ఏర్పడినప్పుడు దానిమీదున్న వారు స్వర్గవాసుల్ని సంబోధించి:

> "శాంతి మీకు నెలకొనుగాక" అని ఎలుగెత్తి సంబోధిస్తారు. ఈ జనం స్వర్గంలోకి ప్రవేశించకపోయినా స్వర్గంలోకి ప్రవేశించాలని ఆకాంక్షించేవారయి ఉంటారు. (అల్ ఆరాఫ్ : 46)

సదాచార సంపన్నులయిన వారు స్వర్గస్థులయినప్పుడు వారిని గురించి ప్రస్తావిస్తూ ఖుర్ఆన్ అంటుంది :

> అక్కడ వారి నినాదం – 'దేవా నీవు పరిశుద్ధుడవు, లోపరహితుడవు,' వారి వేడుకోలు, 'శాంతి కలుగుగాక!' అని, వారి అంతిమ వచనం 'సమస్త స్తుతి స్తోత్రాలు కేవలం సకల లోక ప్రభువుకే చెల్లు' అని మాత్రమే వెలువడుతుంది.
> (యూనుస్ : 10)

ప్రవక్త ఇబ్రాహీమ్ (అ) వద్దకు దైవదూతలు వచ్చినప్పుడు వారి సంవాదన ఇలా మొదలయింది:

> చూడండి, ఇబ్రాహీమ్ వద్దకు మా దూతలు శుభవార్తను మోసుకువెళ్ళినప్పుడు వారు అతన్ని సంబోధించి 'నీకు శాంతి కలుగుగాక!' అని అనగా ఇబ్రాహీమ్ వారికి ప్రతి అభివాదం చెబుతూ 'మీకు కూడా శాంతి కలుగుగాక!' అని అన్నారు.
> (హూద్ : 69)

స్వర్గవాసులు స్వర్గంలోకి ప్రవేశించినప్పుడు :

> దైవదూతలు అన్ని వైపుల నుండి వారిని ఆహ్వానిస్తూ ఎదురు వచ్చి, 'శాంతి మీకు కలుగుగాక, మీరు ప్రపంచంలో సహనస్థయిర్యాలు ప్రదర్శించినందుకు గానూ దాని మూలంగా నేడు మీరు దీనికి పాత్రులయ్యారు' అని అంటారు.
> (అర్‌రా'ద్ : 24)

(10-1-2003)

ఆరాధనకు పిలుపు - అజాన్

"అక్బర్'ని దైవంగా కొలుస్తారా?"

"అక్బర్'ని అల్లాహ్‌కు సమానంగా భావిస్తారా?"

"అక్బర్'ని అంతగా స్తుతిస్తారెందుకు?"

ఇవి, ఇలాంటివి అనేక ప్రశ్నలు అప్పుడప్పుడు ముస్లిమేతర సోదరుల నుండి ఎదురవుతుంటాయి. అయిదు పూటలా నమాజ్ కోసం ఇచ్చే పిలుపు 'అజాన్'ని ఉద్దేశించి వచ్చే ప్రశ్నలివి. ప్రవక్త మహనీయుల (స) కాలంలో సామూహికంగా నమాజ్ చెయ్యాలన్న ఆదేశాన్ని నెరవేర్చే అవకాశం, ఆ స్వేచ్ఛ, ఆ సౌలభ్యం ప్రాప్తమయినప్పుడు నమాజ్ కోసం పిలిచేందుకు ఏ సాధనాన్ని ఉపయోగించాలో నిర్ణయం కాలేదు. గంట కొట్టడం, బాకా లేక శంఖం ఊదటం విభిన్న మతవిధానాలను సూచించే సాధనాలు. ఇవికాక మరే కొత్త విధానమయినా ప్రయోగించాలన్నది ప్రవక్త (స) ఉద్దేశ్యం, ఆయన సహచరుల ఉద్దేశ్యం కూడా. చివరికి దైవికంగా సూచించబడిన 'అజాన్' (పిలుపు) విధానమే సరయినదిగా నిర్ణయమయింది. ఈ పిలుపులో ఏ పదాలను ప్రయోగించాలో కూడా దైవికంగా సూచించడం జరిగింది. 'అజాన్' దైవనామస్తుతితో మొదలయి ఆయన ఏకత్వ ప్రకటనతో ముగుస్తుంది.

దేవుని ఏకత్వం, దేవుని మార్గదర్శకత్వం, పరలోక సాఫల్యం ఈ మూడు అంశాలు ఇస్లామ్‌లో ఆచరణలకు ప్రాతిపదికలు, పునాదిరాళ్ళు. దేవుని ఏకత్వం విశ్వాసాంగాలలో మొట్టమొదటి అంశం. ఇందులో ఎటువంటి సడలింపునుగాని, ఎటువంటి మెతకదనంగాని చూపెట్టడాన్ని ఇస్లామ్ ఒప్పుకోదు. దీనికి విరుద్ధమయిన సిద్ధాంతం బహుదైవభావన. దీని ఛాయలు కూడా మానవుని ఊహల్లో, ఆలోచనల్లో, నమ్మకాల్లో చోటు చేసుకుంటే మనిషి ఇస్లామ్‌కు దూరమయిపోతాడు. అందుకే దీనికి ఆచరణలో ప్రాముఖ్యత ఇవ్వబడింది.

అజాన్‌లోని రెండవ అంశం దేవుని మార్గదర్శకత్వం. మానవుడు తన జీవితానికి ఇష్టమయిన మార్గాన్ని ఎంచుకుని అనుసరించే స్వేచ్ఛ కలిగి ఉన్నా దైవం అందజేసిన మార్గనిర్దేశననే రుజుమార్గంగా నమ్మి దాన్నే పాటించేందుకు ప్రయత్నించాలి అన్నదే దీని ఉద్దేశం. దేవుని ఆ మార్గదర్శకత్వమే చిట్టచివరగా దివ్యఖుర్‌ఆన్ రూపంలో అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) ద్వారా మనవాళికి అందజేయబడింది. ఆ మార్గదర్శకత్వాన్ని తు.చ. తప్పకుండా ఆచరించి ఒక ఆదర్శ వైయక్తిక జీవితాన్ని, ఆదర్శ సాముహిక జీవితాన్ని నెలకొలిపి చూపారు ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స), అదే అజాన్‌లో రెండవ అంశం.

పరలోక సాఫల్యమే మానవుని నిజసాఫల్యం, ఆ సాఫల్యమే మానవుని సకల ఆచరణలకు ప్రేరణ కావాలన్నది మూడవ ముఖ్యమయిన విశ్వాసాంగం. సంపూర్ణంగా, చిత్తశుద్ధితో పరలోకాన్ని దృష్టిలో ఉంచుకుని, అక్కడి సఫలతానిష్ఫలతల ఆకాంక్షతో చేసే సదాచరణలే మానవుని నిజధ్యేయం కావాలన్నది దీని ఉద్దేశ్యం. ఆ ఉద్దేశ్యంతో నెరవేర్చే ప్రప్రథమమయిన ఆచరణ, అతి మౌలికమయిన ఆచరణ 'నమాజ్' అనే ఆరాధన. దీనినే అజాన్‌లో మూడవ అంశంగా చేర్చడం జరిగింది. రండి ఒకసారి 'అజాన్' పిలుపులోని పదాల పునశ్చరణ చేసుకుందాము:

అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్,
అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్,
అష్‌హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహ్
అష్‌హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహ్
అష్‌హదుఅన్న ముహమ్మదర్రసూలుల్లాహ్
అష్‌హదుఅన్న ముహమ్మదర్రసూలుల్లాహ్
హయ్యి అలస్సలాహ్, హయ్యి అలస్సలాహ్,
హయ్యి అలల్ ఫలాహ్, హయ్యి అలల్ ఫలాహ్,
అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్,
లా ఇలాహ ఇల్లల్లాహ్!
దేవుడే గొప్పవాడు, దేవుడే గొప్పవాడు,
దేవుడే గొప్పవాడు, దేవుడే గొప్పవాడు.
అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడేలేడని నేను సాక్ష్యమిస్తున్నాను
అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడేలేడని నేను సాక్ష్యమిస్తున్నాను

ముహమ్మద్ దేవుని సందేశహరుడని కూడా నేను సాక్ష్యమిస్తున్నాను.

ముహమ్మద్ దేవుని సందేశహరుడని కూడా నేను సాక్ష్యమిస్తున్నాను.

నమాజ్ వైపునకు రండి, నమాజ్ వైపునకు రండి,

సాఫల్యం వైపునకు రండి, సాఫల్యం వైపునకు రండి,

దేవుడే గొప్పవాడు, దేవుడే గొప్పవాడు.

అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడు!

దేవుని ఏకత్వాన్ని చాటడం, దానికి సాక్ష్యంగా నిలువడం, దేవుని మార్గదర్శకత్వం ఆవశ్యకతను చాటడం, దానికి సాక్ష్యం పలకడం, దైవారాధన కోసం ఆహ్వానించడం, సాఫల్యాన్ని ఆకాంక్షించడం-ఇదే అజాన్‌లోని అసలు మర్మం. దీన్ని అర్థం చేసుకోకపోతే ఎన్ని అనర్థాలు - అల్లాహు అక్బర్!

(17-1-2003)

అల్-ఫాతిహా!

స్తోత్రం కేవలం అల్లాహ్ కొరకే. ఆయన నిఖిల జగతికి ప్రభువు. అపార కృపాశీలుడు, పరమ కరుణామయుడు, ప్రతిఫల దినానికి స్వామి. మేము ఆరాధించేది నిన్నే, సహాయం కొరకు అర్థించేదీ నిన్నే. మాకు ఋజుమార్గం చూపించు–నీవు వరం అనుగ్రహించినవారి, ఆగ్రహానికి గురికానివారి, మార్గవిహీనులు కానివారి మార్గం. (దివ్యఖుర్ఆన్ : అల్–ఫాతిహా :1–7)

దివ్యఖుర్ఆన్ ఏ తత్వవేత్తో, ఏ జ్ఞానియో, ఏ దైవజ్ఞుడో, ఏ మత బోధకుడో తన దివ్యదృష్టితో గ్రహించి రచించిన ధార్మిక గ్రంథం కాదు. దానిని మానవాళికి అందజేసిన బోధక శ్రేష్ఠుడూ, ప్రవక్త ముహమ్మద్ (స) రచించినది అంతకన్నా కాదు. ఆయన దాన్ని అందజేస్తూ అది తన రచనే అని ప్రకటించినా 'కాదనగలవారే లేరు. అయినా ఆయన అలా చూచాయగా కూడా పలకలేదు. దాని రచయిత స్వయంగా సృష్టికర్త, జగన్నిర్మాత, విశ్వవిధాత, పరలోక ప్రభువయిన దేవుడు, అల్లాహ్ మాత్రమే అని చాటిచెప్పాడు!

'అల్–ఫాతిహా' దివ్యఖుర్ఆన్‌లోని మొదటి సూరా, ప్రారంభ అధ్యాయం. ఫాతిహా అంటే ప్రారంభించేది, అగ్రగామిగా ఉండేది అని భావం. ప్రారంభంలో ఉండటం వల్లనే దానికి ఆ పేరు. ఇది ఖుర్ఆన్‌కు పీఠిక వంటిది, తొలిపలుకు వంటిది అని కూడా కొందరు అభిప్రాయపడ్డారు. ఈ సూరాలో పేర్కొన్న విషయాలు లాంఛన ప్రాయమయిన తొలిపలుకులకన్నా దివ్యఖుర్ఆన్‌కు పరిచయ వచనాలలా కానవస్తాయి. ఈ దిశలో ఈ సూరాను అర్థం చేసుకునే ముందు ఖుర్ఆన్ అందజేసే సందేశంలోని మౌలిక విషయాలేమిటో, దాని ప్రధాన చర్చనీయాంశం ఏమిటో, దాని సందేశానికీ చర్చకూ కేంద్ర బిందువు ఏమిటో తెలుసుకోవాలి. అప్పుడే దివ్యఖుర్ఆన్‌లో ఈ తొలి సూరాకు గల ప్రాధాన్యత ఎలాంటిదో బోధపడుతుంది.

ఖుర్‌ఆన్ బోధనాసారం 'తౌహీద్' లేక దేవుని ఏకత్వం.

మానవుడు తన వైజ్ఞానిక భ్రమలో ప్రచండమయిన ఈ అనంత సృష్టి సామ్రాజ్యం శూన్యంలో నుంచి, లేమిలో నుంచి దానంతట అదే ఉనికిలోకి వచ్చిందని మోసపోతున్నాడు. కట్టుదిట్టమయిన విశ్వంలోని ఈ సువ్యవస్థ ఇట్టే అవ్యవస్థలో నుంచి పుట్టుకువచ్చిందని ఊహించుకుంటున్నాడు. విజ్ఞానం పేరిట అజ్ఞానానికి తల ఒగ్గుతున్నాడు. కర్త లేనిదే ఏదీ నిర్మాణం కాజాలదని నమ్మే ఈ బుద్ధిజీవి, అనుక్షణం, నిరంతరం వికసిస్తున్న అంతులేని ఈ జగతికి ఏ నిర్మాణకర్త, ఏ నిర్వహణ కర్త లేనేలేదని బొంకుతున్నాడు!

మరోవంక, సృష్టికళలోని అనుపమ సౌందర్యానికి ముగ్ధుడయి, అసంఖ్యాక నక్షత్రాల, అగణ్యగ్రహాల, ఉపగ్రహాల మధ్య ఏర్పడిన అగోచరమయిన అనుబంధానికి, అనన్యమయిన సామరస్యానికి చకితుడయి, విస్తుపోయి - ఇదంతా ఒక్క సృష్టికర్తతో సంభవమవుతుందా, ఒక్క నిర్వాహకునిచేత సాధ్యమవుతుందా అని ప్రశ్నించుకున్నాడు. ఆశ్చర్యంతో అనేక కర్తల్ని, ఎందరో నిర్వాహకుల్ని ఏర్పరచుకున్నాడు; అందరినీ దైవాలుగా, తన శ్రద్ధాభక్తులకు, పూజలూ ప్రార్థనలకు అర్హులుగా నమ్ముకున్నాడు. మూర్ఖత్వం, మూఢత్వాలకు ఇది పరాకాష్ఠ!

ఈ భిన్నభావ ధ్రువాల మధ్య ఖుర్‌ఆన్ దేవుని ఏకత్వ భావాన్ని ప్రతిపాదిస్తుంది. సృష్టికర్త లేనిదే ఈ జగత్తు ఉనికిలోకి రాలేదని, అలాగే దీనికి అనేక మంది సృష్టికర్తలూ లేరని, సృష్టికి కర్త, స్వామి పాలకుడు ఉన్నాడని, ఆయన ఒక్కడే ఒక్కడన్న సత్యాన్ని గట్టిగా చెబుతుంది ఖుర్‌అన్. ఇదీ దాని సందేశంలోని మౌలిక విషయం.

ఈ మౌలిక విషయంలోనే మరో అంశముంది. విశ్వప్రభువు మానవుణ్ణి సృష్టించి వదలిపెట్టలేదు, అతనికి జీవించే మార్గం చూపించాడు. మానవుడు ఈ ప్రపంచ జీవితం చాలించి తన ప్రభువు సన్నిధిలో హాజరయినప్పుడు తాను చూపించిన మార్గాన్ని మానవుడు అనుసరించాడా లేక తన మనోకాంక్షలకు దాసుడయి, లేక ప్రపంచ ప్రజల భావాలకు ఊడిగం చేస్తూ బ్రతికాడా అన్నది విచారిస్తాడు. ప్రభువాజ్ఞను పాలిస్తే బహుమానం, ధిక్కరిస్తే శిక్షనిస్తాడు. ఇది మౌలిక భావనల్లోని మరో ముఖ్యాంశం.

మానవుడు ప్రపంచంలో ఇతర జీవరాశుల వలెనే ఒక విశేష జీవరాశి, అంతే. సమస్త ప్రాణులు తమ మనుగడ కోసం జీవికను సంపాదించే కృషి సలపడానికి, సంతానోత్పత్తి ద్వారా తమ 'జాతి' మనుగడకు ప్రయత్నించడానికీ బద్ధులయినట్లే మానవుడూ ఈ లక్ష్యాలతోనే జీవించాలని భావించేవారు కొందరు.

అయితే బుద్ధీ జ్ఞానాలున్న మానవుడు ఉత్తమ సృష్టిరాశికి చెందినవాడు గనక నైతిక ఆధ్యాత్మిక బంధనాలలో జీవించాలని భావించే వారు కొందరు. వీరు ఆధ్యాత్మిక

వికాసానికి సర్వసంగ పరిత్యాగం చేసి, సృష్టి ధర్మాలకు అతీతంగా, సహజ జీవితానికి విపరీత ధోరణిలో మనుగడ సాగించాలని అంటారు.

ఈ రెండు అతివాద వైఖరులను కాదని మధ్యస్థ మార్గాన్ని, రుజుమార్గాన్ని అనుసరించాలని, ప్రపంచ కష్టసుఖాల అనుభవ సముద్రం ఈదుకుంటూ అందులోనే పూర్తిగా మునిగిపోని విధానాన్ని అవలంబించాలని, అదే సాఫల్యానికి చేరువయ్యే మార్గమని, గమ్యానికి చేర్చే మార్గమని చెబుతుంది ఖుర్ఆన్. ఆ మార్గమేదో, ఆ గమ్యమేదో విడమర్చి తెలుపడమే ఖుర్ఆన్‌లో చర్చనీయాంశం.

ప్రపంచంలోనే కేంద్ర బిందువయినది మానవ జీవితం. అందువల్ల ఖుర్ఆన్ సందేశానికీ దాని చర్చకూ కేంద్ర బిందువు కూడా మానవుడే. ఈ సూరాలో మానవుడే విశ్వప్రభువును స్తుతిస్తాడు, అర్థిస్తాడు. తనకు రుజుమార్గం చూపమని వేడుకుంటాడు. విశ్వప్రభువేమో తన దాసుని మొరాలకించి, ఇదో నీవు కోరుకున్న రుజుమార్గం ఇదే అంటూ దివ్యగ్రంథం మొత్తాన్నీ తెరచి అందజేస్తాడు!

(14-3-2003)

ఇది రమజాన్ నెల

కాలం ఆకాశం వంటిది. అంతం లేనిది. ఆదీ లేనిదేమో! దిశలూ లేనిదే, దశలూ లేనిదే. ఆకాశానికి తూర్పు పడమరలు, ఉత్తర దక్షిణాలుండవు. కాలానికీ అంతే. కాలంలోనూ ఆకాశంలానే మెట్టపల్లాలుండవు. మంచీ చెడులూ ఉండవు. శుభా శుభాలూ ఉండవు. ఆకాశంలో ఎన్నో లోకాలున్నాయి, అంతు చిక్కని అగాధాలున్నాయి. కాలంలోనూ ఉన్నాయి అసంఖ్యాకమయిన లోకాలు, అర్థం పట్టుబడని గాథలు. ఈ లోకాలనే యుగాలని అంటాము. ఈ గాథలనే చరిత్ర అంటాము. అది వేరే కథ.

కాలం అవిభాజ్యమయినది. కాని విభజించాము. కాలం అనిర్వచనీయమయినది కాని నిర్వచించాము. కాలం నిర్గుణమయినది కాని గుణ దోషాలు ఆపాదించాము. కాలం నిరపేక్షాపరమయినది కాని దాన్ని సాపేక్షకం చేశాము. ఇదంతా మన అవసరాల కనుగుణం, ఇష్టాయిష్టాల కనుకూలంగా, లోటుపాటుల సర్దుబాటుకు చేసుకున్నాము. అంతేకాని కాలం వీటన్నింటికీ అతీతమయినది.

ఈ అనంత కాల సాగర క్షితిజంలోనే ఓ జ్ఞానజ్యోతి భాసిల్లింది. ప్రపంచానికి దారిచూపే దివ్యమయిన దివ్వె వెలిగింది. మానవ మనుగడకు సార్థకత నిచ్చే శుభసందేశం అవతరించింది. మానవునికి జీవిత పరమార్థాన్ని తెలిపే ఈ సత్యశోభితమయిన కాల శకలాన్నే 'రమజాన్' అని అంటాము. అవును, ఇది 'రమజాన్' నెల, విశ్వప్రభువు దివ్య సందేశమయిన దివ్యఖుర్ఆన్ అవతరించిన నెల. 15వందల రమజాన్ నెలల సౌరభాలను వెదజల్లుతున్న నెల. ఆ మాసంలోనే మనం శ్వాస పీలుస్తున్నామంటే ఎంతటి సౌభాగ్యమో!

కాలం నిలిచిపోవాలని అనుకుంటూ ఉంటామే అటువంటి సందర్భమిది. అవునూ, కాలం నిలిచే ఉంటుంది. మనమే ప్రయాణిస్తుంటాము. రైల్లో కూర్చున్న పసివాడు ప్రపంచ మంతా పరిగెడుతోందని భ్రమ పడుతున్నట్లు మనమూ ఆ శైశవ అనుభూతికి లోనయి

కాలం ప్రవహిస్తోందని, పరిభ్రమిస్తోందని, అదొక చక్రమని, పరిక్రమ యంత్రమని బూటకపు కట్టుకథలల్లుతుంటాము. కాని వాస్తవానికి కాలం నిశ్చలమయిన తెర అని, విశ్వంలో సంభవిస్తున్నదంతా ఆ తెరపై కదిలే బొమ్మల కథ అని తెలుసుకునే లోపునే మన పాత్ర ముగిసిపోతుందేమో!

అందుకే అవసరం విశ్వప్రభువు పంపిన మార్గదర్శకత్వం. ఆయనకు తెలుసు మనకు ఏమీ తెలియదని; మనసు చెప్పే మాయమాటలకు, మానవుల శత్రువు దానవు లయిన షైతానులు అరచేతిలో చూపే తోటలకు, దారితప్పిన లోకం నడిచే వంకబాటలకు మోసపోతామని కూడా ఆ ఏకైక స్వామికి తెలుసు. అందుకే మానవ జన్మ ఆది నుంచే తన శ్రేష్ఠ సృష్టిరాశి అయిన మానవులు పెడత్రోవ త్రొక్కకుండా ఏర్పాటు చేశాడు. ఆది మానవుడయిన ఆదమ్‌నే తన ప్రప్రథమ సందేశహరునిగా భువిపైకి పంపాడు.

ఆ సందేశ పరంపరకు అంతిమ రూపమే దివ్యఖుర్‌ఆన్, దాన్ని అందజేసిన చివరి పడియే సకల లోక కారుణ్యజ్యోతి, నాయకశ్రేష్ఠుడు, ప్రవక్తాగ్రజుడు, అనన్య ఆదర్శమూర్తి, మూర్తీభవించిన ప్రేమామృత కలశం, మహనీయ ముహమ్మద్, సల్లల్లాహు అలైహి వసల్లమ్! దివ్యఖుర్‌ఆన్ దైవవాణిగా అవతరించడం ప్రారంభమయి, అంతిమ దైవ సందేశహరుడు తన బాధ్యతలపై నియుక్తుడయిన సదవకాశమే రమజాన్ నెల. ఆ నెలలోనే మనం ఒక్కొక్క క్షణం, ఒక్కొక్క నిముషం, ఒక్కొక్క గంట, ఒక్కొక్క రోజును దాటుకుంటూ వెళ్ళిపోతున్నాము- మన అంతిమ నివాసం వైపునకు, అది పూలగంపగా ఎదురవుతుందో, ముళ్ళకంపగా తేలుతుందో!

మానవుల సృష్టికర్త, స్వామి, ప్రభువు, ఎంతో దయతో, ప్రేమతో పంపిన దివ్యగ్రంథం, పరమ పవిత్ర గ్రంథం ఖుర్‌ఆన్ పట్ల మానవుల వ్యవహారం ఎలా ఉంది? అది అవతరించిన మాసం ఎంతో శుభకరమయినదని, అది నిశీథమనస్కుల పాలిటి వెన్నెల నెలవు అని, ఆరిపోయిన జీవితాలకు ఆశాజ్యోతి అని, ఎన్నెన్ని స్తోత్రోక్తులు పలికినా అది మన జీవితాలలో వెలుగు నింపుతున్నదా? మన ఆంతర్యాలలోకి దారి చేసుకుంటున్నదా? మన బ్రతుకుబాటను సుగమం చేస్తున్నదా? అది వరప్రసాదాల మహాసాగరమే, సందేహం లేదు. కాని మన దోసిళ్ళలో ఏర్పడే విస్తృతి ఎంత అన్నదే ప్రశ్న.

రమజాన్ నెల సంఘర్షణల నెల. మంచీ చెడుల సంఘర్షణ, మానవ దానవ గుణాల సంఘర్షణ, మనసులో ప్రారంభమయి జగతిలో వెలిసే సంఘర్షణ. మనో కాంక్షలకు, దేవుని ఆంక్షలకు మధ్య సంఘర్షణ. ఆంతర్యంలో లేచే కోర్కెల తరంగాలకు, దైవం విధించే శాసనాంగాలకు మధ్య సంఘర్షణ. ఇంటివారలు సృష్టించే ఆశల, అవసరాల పర్వత శిఖరాలకు, భయభక్తుల నియమాలు, పవిత్ర ఆశయాల శక్తి సామర్థ్యాలకు

మధ్య సంఘర్షణ. లోకం ఇచ్చే ఆదేశాలకు, ధర్మం చూపే ఉద్దేశాలకు మధ్య సంఘర్షణ. మనిషి లోపలా వెలుపలా, ఇంటా బయటా సాగే నిరంతర సంఘర్షణ. ఇది సంఘర్షణలకు శిక్షణ గరిపే నెల. ఈ సంఘర్షణా పటిమను జీవితాంతం కొనసాగించాలన్న ధ్యేయంతో సాగే సంఘర్షణ!!

ప్రతి ఏటా జరిగే తంతులానే రోజావ్రతం, గ్రంథపారాయణం, ఆరాధన సాధన, నిర్భాగ్యుల ఆదరణ, ఆనవాయితీగా చేసి చేతులు దులుపుకుంటున్నామా లేక ఈ వ్రతాలు, సాధనలు, సేవలు మనలో సుస్థిరంగా ఏమయినా సహనస్థయిర్యాలు, నిగ్రహ సంయమనాలు, సానుభూతి కటాక్షాలు సృష్టిస్తున్నాయా? ఈ గుణాలను మనం పదిల పరచుకుని పది కాలాలపాటు వాడుకుంటున్నామా లేక ఈ నెలతోనే అంతా పూర్తిగా ముగించి బడలికతో నిద్రపోతున్నామా? ఈ ఆధ్యాత్మిక సాధనాలు మనలో ఆత్మవికాసానికి ఏమయినా తోడ్పడుతున్నాయా లేక మనుగడలో లోతుపాతులకు చేరకుండా పైపైనే, స్థూలంగా, ముట్టీముట్టనట్టు దాటిపోతున్నాయా? రమజాన్ నెల మరోసారి మనలో మార్పును చూడకుండానే, లేదా వచ్చిన మార్పును సుస్థిరపరచడంలో మన భూమికను సముద్ధరించకుండానే, రమజాన్ ఆశయ సిద్ధికి మనలో సంకల్పాన్ని ప్రేరేపించకుండానే వెళ్ళిపోతున్నదా? ఏమో? ఆలోచించుకోవలసిన, ఆత్మవిమర్శన చేసుకోవలసిన సమస్య ఇది!

(31-10-03)

రమజాన్

ఆధ్యాత్మిక ప్రక్షాళన, నైతిక ప్రవర్తన, ధార్మిక చింతన, మానసిక పరివర్తన, శారీరక సాధన– వీటన్నింటి మధ్యన పరస్పరం అవినాభావ సంబంధముంది. శారీరక సాధనాలు, ఉపాసనలు, ఆరాధనలు, పారాయణాలు, అధ్యయనాలు, అనుశీలనాలు, ఆంతర్యంలో పరివర్తనం తెస్తాయి, ఆలోచనా తీరు మారుతుంది, ప్రమాణాలు ఉన్నతమవుతాయి, సహనం, స్థయిర్యం, నిగ్రహం, శాంతం అలవడుతాయి. ధార్మిక చింతన పుడుతుంది, అంతశ్చక్షువులు తెరచుకుంటాయి, పదార్థాల యదార్థాలు ముందుకు వస్తాయి, విలువలు కొత్తరూపు ధరిస్తాయి. ఫలితంగా ప్రవర్తనల్లో నైతికత, ప్రశాంతత, నిష్ఠాగరిష్ఠత, నిస్వార్థత, పరోపకారం, ప్రయోజకత్వం, సదాచారం చోటు చేసుకుంటాయి. అది ఆధ్యాత్మిక వికాసానికి, ఆత్మ పరిశుద్ధతకు, పవిత్రతకు ప్రథమ సోపానం, మానవత జ్యోతిర్మయమయ్యే దశ!

'రమజాన్' ఆధ్యాత్మికతకు భౌతికతకు సేతువు. ఆంతర్యంలో కాంతికి, బాహ్యంలో శాంతికి హేతువు. దేవుని వరప్రసాదాల వసంతానికి, మానవుని సర్వతోముఖ వికాసానికి కేతువు. 'రమజాన్' దారికానని మానవాళికి స్పష్టమయిన మార్గచిహ్నాలు చూపింది; పచ్చి భౌతిక మజిలీలను దాటి ఉన్నత ఆధ్యాత్మిక గమ్యాలను చేరవచ్చని తెలిపింది. 'రమజాన్' మానవునికి విశ్వప్రభువు సందేశాన్ని, దివ్యఖుర్‌ఆన్‌ని అందజేసింది!

> రమజాన్ నెల, ఇందులోనే ఖుర్‌ఆన్ అవతరింపజేయబడింది, అది మానవాళికి ఆసాంతం మార్గదర్శకం, అతిస్పష్టమయిన ఉపదేశాలు ఇందులో ఉన్నాయి, అవి రుజు మార్గాన్ని చూపిస్తాయి, సత్యాసత్యాల వ్యత్యాసాన్ని విడమర్చి ముందుంచుతాయి. కనుక ఇకపై ఈ నెలనుగన్న వ్యక్తి తప్పనిసరిగా ఈ నెల

సొంతం ఉపవాస వ్రతాలు పాటించాలి. మరెవరయితే రోగగ్రస్తులయి ఉంటారో లేదా ప్రయాణావస్థలో ఉంటారో వారు ఇతర దినాలలో తమ ఉపవాసాల సంఖ్యను పూర్తి చేసుకోవాలి. (అల్ బకర : 185)

రమజాన్ నెల గొప్పదనం సంతరించుకున్నదంటే కారణం అది భూమి, సూర్యుడు, గ్రహాల భ్రమణంలోని ఏదో ప్రత్యేక చలనం వల్ల ఏర్పడిన శుభసందర్భంలోని మాసం కావడం కాదు. ఈ నెలలోనే దివ్యఖుర్ఆన్ అవతరించింది. అది మానవాళి అంతటికీ మార్గదర్శక గ్రంథం. అది కేవలం ఏదో ఒక జాతికి, ఒక దేశానికి చెందిన వారికి, ఒక భాష మాట్లాడే వారికి, ఒక మతాన్ని అవలంబించే వారికి సంబంధించిన గ్రంథం కాదు- మానవాళి అంతటికీ చెందిన మార్గదర్శక గ్రంథం. ఇందులో చిక్కులతో కూడుకున్న అర్థంకాని తత్వజ్ఞాన బోధనలేవీ లేవు. అన్నీ అతి స్పష్టమయిన ఉపదేశాలే, ప్రతి చదువరి అర్థం చేసుకోగల విషయాలే. అది కేవలం తాత్విక చింతనను బోధించదు, శాస్త్రీయ, సైద్ధాంతిక సూత్రాలను వల్లించదు, ఆచరణాత్మకంగా నడవవలసిన దారిని చూపుతుంది, అనుసరించవలసిన వైఖరిని నేర్పుతుంది. జీవితంలోని ప్రతి రంగంలోనూ అది వ్యక్తిగత మయినా, సామూహికమయినా, కుటుంబపరమయినదయినా, సామాజికమయిన దయినా, ఆర్థికమయినా, రాజకీయమయినా – ప్రతి జీవిత విభాగంలో ఖుర్ఆన్ సవ్య మయిన, సమంజసమయిన, శుభకరమయిన మార్గాన్ని నిర్దేశిస్తుంది. జీవితంలో ఏదో ఒక దశలో మాత్రమే కాదు అడుగడుగునా అది మానవునికి అండగా నిలుస్తుంది, సహాయ పడుతుంది, మంచీ చెడులకు గీటురాయిగా నిలుస్తుంది. ఎలా ఆచరించడం న్యాయమో, ధర్మమో, శుభకరమో, ప్రయోజనకరమో బోధిస్తుంది. ఏ ఆచరణ అధర్మమయిందో, ఎలా చేయడం వల్ల హాని కలుగుతుందో, ఏ విధానం వల్ల అశుభం దారి చేసుకుంటుందో స్పష్టంగా ఉపదేశిస్తుంది. ఇదే రమజాన్ ప్రాశస్త్యం. రమజాన్ నెలకు ప్రాముఖ్యం, ఖగోళ శాస్త్రీయమయినది కాదు, ఈ నెలలో సంభవించిన ఈ మహత్తరమయిన మానవీయ శుభం వల్ల సంక్రమించిన ఘనత అది.

ఖుర్ఆన్ అవతరణ సాధారణమయిన విషయం కాదు. మానవ నాగరికత అజ్ఞానపు అంధకార కుహరాల్లో నుంచి బయటపడి, ఆధునిక కాంతి పథంలోకి, క్రాంతి దశలోకి అడుగుపెడుతున్న చారిత్రకమయిన మలుపున అది మానవాళి చేతికి అందింది. నిరక్షరాస్యులు, అనాగరికులు, అరాచకులు, అజ్ఞానులూ అయిన అరబ్బులను విద్యాపోషకులుగా, నాగరికతా ధ్వజవాహకులుగా, క్రమశిక్షణా ధురంధురులుగా, సంస్కార ప్రియులుగా, జ్ఞాన సంపన్నులుగా తీర్చిదిద్దింది ఖుర్ఆన్. వారి ద్వారా ప్రపంచమంతటా సరికొత్త వాతావరణాన్ని నెలకొల్పడానికి మూలకారణమయింది ఖుర్ఆన్. సత్యానికీ, న్యాయానికీ, ధర్మానికీ కొత్త ఊపిరి పోసింది. మానవులను ప్రసిద్ధమయిన సత్క్రియలను

ప్రోత్సహించేవారుగా, ఆచరించేవారుగా, ప్రసిద్ధమయిన దౌష్ట్యాన్ని అడ్డగించేవారుగా, రూపొందించింది ఖుర్‌ఆన్. ఉపేక్షితుల కోసం, అణగారిన వారి కోసం, పీడితుల కోసం, బాధితుల కోసం, న్యాయం కోసం, ధర్మం కోసం పోరాడేవారుగా మనుషుల్ని తీర్చిదిద్దింది ఖుర్‌ఆన్. శ్రీమంతుల్ని, సంపన్నుల్ని, అగత్యపరుల కోసం, అవసరార్థుల కోసం, అనాథల కోసం, ఆర్తుల కోసం అండగా నిలిచేవారుగా మలచింది ఖుర్‌ఆన్. అందుకే ఆ ఖుర్‌ఆన్ అవతరించిన నెల, ఖుర్‌ఆన్ మానవాళికి అందిన నెల రమజాన్.

ఈ నెలలో దైవభక్తులు ఖుర్‌ఆన్‌ని మరీ మరీ పారాయణం చేస్తారు. రాత్రిళ్ళల్లో నిలబడి ఖుర్‌ఆన్ స్మర్తల (హాఫిజ్‌ల) ద్వారా తరావీహ్ నమాజ్‌లో నెల రోజులూ ఖుర్‌ఆన్ వినే అవకాశం కల్పించుకుంటారు. ఈ నెలలో కనీసం ఒక్క సారయినా పూర్తి ఖుర్‌ఆన్‌ని చదవాలని, వినాలని ఉవ్విళ్ళూరుతారు. కేవలం పారాయణం చేయడంతో, వినడంతో సరిపోదు. దివ్యఖుర్‌ఆన్ మన ప్రభువు మన కోసం పంపిన అంతిమ మార్గదర్శక గ్రంథం. దాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాలి.

ఖుర్‌ఆన్ గ్రంథం దేవుని అంతిమ సందేశం. మానవాళి అంతటికీ అందవలసిన సందేశం. మానవులందరికీ వారి ప్రభువు వారి కోసం పంపిన సందేశాన్ని అందజేసే బాధ్యత ఎవరిది? ఆ గ్రంథాన్ని దైవ గ్రంథమని, అది మానవాళి అంతటికీ మార్గదర్శక గ్రంథమని నమ్మే వారిది! ఆ బాధ్యత నెరిగి మసలుకుంటున్నామా? ఆలోచించాలి.

ఒక సందర్భంలో రమజాన్‌ని అంతిమ దైవప్రవక్త మహనీయ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా పేర్కొన్నారు - "ఇది మహోజ్వలమయిన, ఎనలేని శుభాల నెల.... ఇది సహనం, నిగ్రహం పాటించవలసిన నెల. సహనానికి ప్రతిఫలం స్వర్గం. ఇది సమాజంలోని ఉపేక్షితుల పట్ల, బాధితుల పట్ల సానుభూతి చూపవలసిన నెల....".

ఇది రమజాన్ నెల, ఖుర్‌ఆన్ అవతరించిన నెల, ఖుర్‌ఆన్‌ని అర్థం చేసుకోవలసిన నెల, ఖుర్‌ఆన్ సందేశాన్ని మానవాళి అంతటికీ అందజేయడానికి ప్రయత్నించవలసిన నెల, సహనం, నిగ్రహం చూపవలసిన నెల, అవసరార్థులకు సానుభూతి చూపవలసిన నెల!

(8-11-2002)

ఆధ్యాత్మిక వికాసం

ధార్మిక వ్యక్తులనగానే ఆధ్యాత్మిక వికాసమొందిన చిదానంద స్వరూపం మన ముందు నిలుస్తుంది. ఇటువంటి రూపాలు మన ఊహల్లో మెదలినప్పుడు వీరి ఆత్మలు పరమాత్మతో సాయుజ్యం పొందినవిగా మనం భావిస్తాము. అదే ఆధ్యాత్మిక వికాసానికి అత్యున్నత శిఖరాగ్రంగా మనం తలుస్తాము. ఈ ఆధ్యాత్మిక వికాసానికి సాధనం, ఆరాధనలు, ఉపాసనా సాధనలు అన్నది మత పరిభాషలో అంగీకృత సత్యం.

'ఆరాధన' అన్న మాటలో పూజాభావం స్ఫురణకు వచ్చే గుణముంది. ఆరాధన అంటే కేవలం పూజ (Worship) అన్నది మూఢభావన. మూఢ ప్రజలు తమ ఆరాధ్యులను మానవతుల్యులుగా పరిగణిస్తారు. మానవుల్లో పెద్దలు, పరిపాలకులు, అధికారులు భట్రాజు పొగడ్తలతో, ముడుపులతో సంతోషించినట్లే, నీ బాంచనని, కాల్మొక్తానని కాళ్ళమీద పడటంవల్ల ఆనందించినట్లే ఈ ఆరాధ్యులు కూడా స్తుతి కీర్తనలతో, మొక్కు బడులతో, వినమ్రతా ప్రదర్శనలతో ప్రసన్నులవుతారని తలుస్తారు. ఇలాంటి కొన్ని పూజా లాంఛనాల చెల్లింపును మాత్రమే ఆరాధనగా పేర్కొంటారు. ఇది మూఢత్వపు ఆరాధనా భావన.

ఆరాధన లేక ఆధ్యాత్మిక సాధన అంటే మరో భావన కూడా ఉంది. దైవధ్యానంలో చిత్తం లగ్నం చేసి తపస్సు (Meditation) నాచరించడం. ఈ ధ్యాన నిమగ్నత వల్ల, ఆరాధనా సాధన వల్ల అంతచ్ఛక్షువులు పెంపొంది మహిమలు, మహత్యాలు ప్రదర్శించే శక్తుల్ని సృజించుకోవడం, అంతిమంగా ముక్తిని, మోక్షాన్ని, పరమాత్మ సాయుజ్యాన్ని పొందడం ధ్యేయమవుతుంది. ఇందులో ప్రాపంచిక జీవిత సుఖభోగాలు, మానవీయ సంబంధాలు, బాధ్యతలు పరిత్యజించడం, ఆధ్యాత్మికంగా ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి అనివార్యమన్న భావం సంలీనమయి ఉంది. ఇది సన్యాసత్వపు ఆరాధనా భావన.

వీటికి భిన్నంగా ఇస్లామ్ ప్రతిపాదించే ఆరాధనా భావన విస్తృతమయింది. ఇందులో పూజాభావంకన్నా విధేయతా భావానికి ప్రాముఖ్యత, ప్రాధాన్యత ఉంటుంది. స్వామికి స్తోత్రగానం చెయ్యడంతోపాటు ఆయన ఆజ్ఞాపాలన, అప్పగించిన సేవల నిర్వ హణ, అప్పజెప్పిన సంబంధాల పరిరక్షణ ఇస్లామీయ ఆరాధనా భావంలో అంతర్భాగ మయి ఉంటాయి. అంటే సర్వసంగపరిత్యాగం చేసి, ప్రపంచాన్ని దాని మానాన వదలిపెట్టి తపోసాధన చేసి సాధించేదేమీ లేదు. ప్రపంచ కార్యకలాపాల్లో నిమగ్నమయి, ప్రాపంచిక జీవితపు సమస్త బాధ్యతలను సక్రమంగా, సవ్యంగా నిర్వహించి దైవాజ్ఞా బద్ధంగా, దైవశాసన పాలన చెయ్యడం, దైవసంస్మరణకు దూరం చేసే ప్రపంచంలోనే నిండా మునిగి, దైవాన్ని విస్మరించకుండా అనునిత్యం దైవాన్ని సంస్మరిస్తూ జీవితం గడపడం, అదే ఆరాధన. అదే నిజమయిన పూజాభావం, అదే యదార్థ ధ్యాననిమగ్నత, అదే వాస్తవ తపస్సు, అదే అసలయిన ఆరాధన!

ఇస్లామీయ ఆరాధానాభావం ఉద్దేశం మానవ జీవితమంతా దైవదాస్య దర్పణం కావాలన్నది. దానికి అది సాధనా రూపాలను ప్రతిపాదిస్తుంది. అలాంటిదే ఒక సాధన, రమజాన్ నెలలో ఇస్లామ్ అనుయాయులు పాటించే ప్రముఖ ఆరాధనా రూపం, రోజా-ఉపవాస వ్రతం.

ఇస్లామ్- దైవవిధేయతా ధర్మం, మానవుని ఆది ధర్మం, సనాతన ధర్మమయినట్లే రోజా వ్రతం కూడా ఆది నుండీ ధర్మంలో అంతర్భాగంగా భాసిల్లుతూ ఉంటూ వచ్చింది. దాని నియమాలు ఆయా కాలాల్లో వేర్వేరుగా ఉన్నప్పటికీ అది సకల దైవ శాసనాంగాల్లోనూ విడదీయరాని అంశంగా అలరారుతూ వచ్చింది. ప్రవక్తలందరూ బోధించిన ధర్మంలో తప్పనిసరి విధిగానే విరాజిల్లింది. దివ్యఖుర్ఆన్ ఇస్లామీయ సముదాయానికి ఉపవాస వ్రతాన్ని విధిస్తూ ఈ సత్యాన్ని ఇలా ప్రకటించింది:

> ఏ విధంగానయితే గతించిన సముదాయాల ప్రజలకు 'రోజా' విధిగా నియమించ బడిందో అదే విధంగా మీకూ విధిగా ఏర్పరచడం జరిగింది.
>
> (అల్ బకర : 183)

నమాజ్ ప్రతి రోజూ అయిదు పూటలా మనిషిని, నీవు దేవుని దాసుడవు, దైవాజ్ఞాపాలన నీ విధి అని గుర్తు చేస్తూ ఉంటే తాను దైవదాసుడన్న చేతన మనిషిలో సదా పునరుజ్జీవిస్తూ ఉంటుంది. అలా బాధ్యతాభావంతో మెలిగేవానిగా మనిషి రూపొందుతూ ఉంటాడు. అయితే రోజా వ్రతం రమజాన్ నెల సొంతం, ప్రతి క్షణం మనిషిలో ఈ చేతనను, ఈ స్పృహను సక్రియగా, సజీవంగా సముద్ధరిస్తూ ఉంటుంది. పైన పేర్కొన్న ఆయత్‌లో రోజా వ్రతాన్ని విధిగా నిర్ణయించిన చోటనే రోజా వ్రతం ఉద్దేశ్యాన్ని ఖుర్ఆన్ ఇలా ప్రస్ఫుటపరుస్తుంది:

> తద్వారా మీరు తక్వా (ధర్మనిష్ఠ) గుణం గలవారుగా రూపొందాలన్నది ఉద్దేశ్యం.
>
> (అల్ బకర : 183)

అంటే రోజా వ్రతం ఉద్దేశ్యం మనిషిని కేవలం ఆకలిదప్పులకు గురి చెయ్యడం కాదు, మనిషి తన సహజ వాంఛల్ని చంపుకుని సన్యాసిగా రూపొందాలన్నది కూడా కాదు, ప్రపంచానికి దూరంగా అడవుల్లోనో, కొండగుహల్లోనో ధ్యాన నిమగ్నుడవడం అంతకన్నా కాదు; అసలు ఉద్దేశ్యం తక్వా గుణం పొందడం అన్నమాట. మరి తక్వా అంటే ఏమిటీ? సర్వసంగ పరిత్యాగం కాదు గదా, అకస్మాత్తుగా జ్ఞానోదయమయి, భార్యాపిల్లల్ని శయన మందిరంలో వదలి, సాంసారిక, సామాజిక బాధ్యతలకు చరమగీతం పాడి, భవబంధాలకు కటువుగా విడాకులివ్వడం కాదు గదా, ఆధ్యాత్మిక వికాస సాధనకు భౌతిక వికాసాన్ని కాలదన్ని, శరీరాన్ని బాధలకు, యాతనలకు గురిచెయ్యడం శుష్కింపజేయడం కాదు గదా! అవును, కాదు!!

తక్వా అన్న అరబీ పదానికి అర్థం తప్పుకోవడం, తప్పించడం అన్నది. తక్వా అన్నదానికి తాత్వికంగా, ధార్మికంగా ఎన్నయినా వివరణలు, మరెన్నయినా భావార్థాలు కావచ్చు. కాని ఆచరణాత్మకంగా ప్రవక్త సహచరులకన్నా ఉత్తమ రీతిలో దీన్ని బోధపరిచే వారు ఎవరు కాగలరు? మహనీయ ఉమర్ (ర) ఒకసారి తన మిత్రులు మహనీయ ఉబై బిన్ కఅబ్‌ని అడిగారు, "తక్వా అని దేనినంటారు?" అని. దానికి ఆయన బదులుగా "ఎప్పుడయినా మీకు, ఇరువైపులా ముళ్ళ పొదలున్నటువంటి కాలి బాటలో నడిచే అవకాశం కలిగిందా? " అని అడిగారు. మహనీయ ఉమర్ (ర) "ఓ, చాలా సార్లు" అని బదులిచ్చారు. "అప్పుడు మీరేమి చేస్తారు?" అని తిరిగి అడిగారాయన. దానికి సమాధానంగా "నేను నా బట్టలను ఒంటికి దగ్గరగా పట్టుకుంటాను, పొదల్ని తప్పించుకుంటూ నడుస్తాను, బట్టలు ముళ్ళల్లో ఇరుక్కోకుండా జాగ్రత్తపడతాను" అని అన్నారు. "దాన్నే తక్వా అంటారు" చెప్పారు హజ్రత్ ఉబై.

మనిషి నడుస్తున్న జీవితపు ఈ బాటలో ఇరువైపులా ఎన్నెన్నో అతివాదాలు, కోర్కెలు, ఆకాంక్షలు, ఆశంకలు, ప్రేరణలు, మార్గవిహీనతలు, అవిధేయతలు, అతిక్రమణల ముళ్ళ పొదలు ముసురుకుని ఉంటాయి. ఈ దారిలో ఈ రకరకాల ముళ్ళ నుండి తప్పించుకుని నడవడం, విధేయతా పథాన ముందుకు సాగడమే తక్వా, ధర్మనిష్ఠ. ప్రపంచంలోనే జీవిస్తూ దైవం మోపిన బాధ్యతలనన్నింటినీ నిర్వహిస్తూ, సాంసారిక కష్టసుఖాలను సమభావంతో అనుభవిస్తూ, సుఖదుఃఖాల మధ్య, ప్రాపంచిక లాలసల మధ్య, ఆశానిరాశల మధ్య, పేరాశ అత్యాశల మధ్య, కలిమిలేముల మధ్య, ఆకర్షణలు వికర్షణల మధ్య, గెలుపూఓటముల మధ్య, జీవితాన్ని ఏ ఒక్క వైపునకూ మొగ్గకుండా కాపాడుకుంటూ, లౌకిక భోగభాగ్యాలను ఆస్వాదిస్తూనే లోకాన్ని అంటీ ముట్టనట్టుగా దైవవిధేయతా మార్గాన నడవడమే ధర్మనిష్ఠ! ఈ ధర్మనిష్ఠను సృజించడానికే పరమ ప్రభువు రోజా వ్రతాన్ని విధిగా నిర్ణయించాడు.

(15-11-2002)

ఉపవాస వ్రతం

ధార్మికతకు అత్యున్నత శిఖరం, ఆధ్యాత్మిక వికాసం. అది సాధించే మార్గం ఆరాధనలు. ఉపవాస వ్రతం కూడా ఒక ఆరాధనా సాధనే. ప్రపంచంలో ముస్లిములు ఏ మూలన నివసించేవారయినా– అరబ్బులయినా, అమెరికన్లయినా, ఆఫ్రికన్లయినా, ఆర్యులయినా, ద్రావిడులయినా, రష్యనులయినా, చైనీయులయినా, శ్రీమంతులయినా, నిరుపేదలయినా, స్త్రీలయినా, పురుషులయినా, పాలకులయినా, పాలితులయినా, రాజులయినా, సామాన్యులయినా సర్వజనులూ విధిగా పాటించవలసిన మత ధర్మం రోజా. దివ్యఖుర్‌ఆన్‌లో దైవం విధించిన నియమానుసారం ప్రతి సంవత్సరం రమజాన్ నెల సాంతం ఆచరించవలసిన విధానం రోజా ఉపవాసం. ఈ ఉపవాసాన్ని ఫార్సి భాషలో 'రోజా' అని అంటే, అరబీలో 'సౌమ్' అని అంటారు. తెలుగులో ఉపవాసవ్రతమని, ఇంగ్లీషులో ఫాస్ట్ అని అంటున్నాము.

> ఏ విధంగానయితే గత సముదాయాలకు రోజా 'విధి'గా నియమించబడిందో అదే విధంగా దీన్ని మీకూ 'విధి'గా నియమించడం జరిగింది. దీని ద్వారా మీరు తక్వా (ధర్మనిష్ఠ) గుణం గలవారుగా రూపొందాలన్నది ఉద్దేశ్యం.
>
> (అల్ బకర : 183)

ఇస్లామ్‌లో ఆరాధనలు, మానవుని దైవదాస్య భావనకు దర్పణం కావాలన్నదే కాక, దైవదాస్య భావనకు ఉత్తేజదాయకమయినవిగా కూడా రూపొందాలన్నది దేవుని ఉద్దేశం. మానవ జీవితం దైవదాస్యానికి ప్రతీకగా నిలువాలంటే ఎంతో శిక్షణ, సంస్కరణలు అవసరం. దీనికే ప్రతి దినం అయిదు పూటలా నమాజ్, సంవత్సరం మొత్తాన నెల రోజులపాటు నిర్ణీత కాలంలో ఉపవాసవ్రతం విధిగా ఏర్పరచడం జరిగింది. ఒక విధంగా ఉపవాస వ్రతం నిర్బంధ శిక్షణ వంటిదే. నిద్రామాధురి గ్రోలి మత్తుగొన్న

మననును, శరీరాన్నీ తట్టిలేపి వేళకానివేళ నిర్దిష్ట కాలపరిమితిలో ఏవయినా అన్నపానీయాలు పుచ్చుకుని 'సహరీ' నెరపమనడం క్రమశిక్షణకు ప్రారంభం. ఆ తరువాత సూర్యాస్తమయం వరకు ఉదర ఆవశ్యకతల్ని, ఇంద్రియ కాంక్షల్ని కేవలం దైవాజ్ఞాపాలన కొరకు నిగ్రహించుకుని నిర్ణీత సమయం రాగానే దైవ విధేయతను ప్రతిఫలించేలా ఉపవాస వ్రతాన్ని విరమించడం, అదీ ఒక నెల కాలంపాటు ప్రతి రోజూ క్రమం తప్పకుండా దీన్ని పాటించడం ఉన్నత స్థాయి క్రమశిక్షణను అలవరుస్తుంది.

ఉపవాస వ్రతంలో అన్నపానీయాలను, లైంగిక కాంక్షల్ని నిర్ణీత కాలవ్యవధిలో విసర్జించడం మాత్రమే కాదు. నోటి ద్వారా, కంటి ద్వారా, చెవుల ద్వారా, చేతుల ద్వారా, కాళ్ళ ద్వారా కూడా రోజా వ్రతాన్ని పాటించాలి. అంటే చెడు మాటలు పలకడం, చెడు చూపు చూడటం, చెడు విషయాలు వినడం, చెడు పనులు చేయడం, చెడు స్థానాలకు వెళ్ళడం మానుకోవాలి. దీనివల్ల ఉద్రేకాలు, ఆవేశాలు నెమ్మదిస్తాయి, భావాల్లో సంతులనం ప్రాప్తమవుతుంది, మానసిక ప్రశాంతత లభ్యమవుతుంది. ఆగ్రహంలో నిగ్రహం, సంభాషణలో మార్దవం, ప్రవర్తనలో సహనభావం, తగవులకు, జగడాలకు, పరుష వచనాలకు దూరంగా మెలగడం అలవడతాయి. మంచి పట్ల మొగ్గుదల, చెడుల పట్ల ఏవగింపు పుడతాయి. ఉపవాసికి నిరుపేదల సాధకబాధకాలు, ఆకలిదప్పుల మంటలు అనుభవపూర్వకంగా తెలిసివస్తాయి. అగత్యపరుల పట్ల సానుభూతి పెరుగుతుంది, ప్రేమ, దయ, కరుణ భావాలు జనిస్తాయి.

ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు:

"ఇది సహనం చూపవలసిన నెల, సహనానికి ప్రతిఫలం స్వర్గం; ఇది సమాజంలోని ఉపేక్షితుల పట్ల సానుభూతి చూపవలసిన నెల." (హదీసు గ్రంథం: మిష్కాత్)

"రోజా డాలు వంటిది, మీలో రోజా పాటిస్తున్నవారు నోటితో అశ్లీలమయిన మాటలు పలకరాదు, అల్లరి పనులు చేయరాదు, ఇతరులు తూలనాడినా, జగడానికి దిగినా మీరు ఉపవాస వ్రతం పాటిస్తున్న విషయాన్ని గుర్తుంచుకుని తప్పుకోవాలి." (హదీసు గ్రంథాలు: బుఖారి, ముస్లిమ్)

"రోజా పాటిస్తూ అసత్యం పలకడం, అసత్యాన్ని ఆచరించడం మానుకోని వారి ఆకలిదప్పుల పట్ల అల్లాహ్‌కు ఏమాత్రం ఆసక్తి లేదు." (హదీసు గ్రంథం: బుఖారి)

ఈ హితోపదేశాలు తెలిపేదేమిటీ?

ఉపవాస వ్రతం పాటించే వారిలో సహన గుణం జనించాలి. బాధలను భరించే, శోధనలను సహించే, బీదల పట్ల దయ చూపే, స్వార్థంవీడి పరోపకారార్థం త్యాగం చేసే లక్షణాలు అలవడాలి. అలాగే వారు చెడులు, సంస్కార విహీనమయిన మాటలు,

పనులకు దూరంగా మసగలగాలి. తగాదాలకు పురికొలిపినా దరహాసంతో అటు నుండి వైదొలగాలి. ఇంకా అసత్యం పలకడమే కాదు, అసత్యాన్ని ఆచరించడం అన్నదానిలోని విస్తృత భావం దృష్టిలో సదా ఉండాలి. మానవునికి మేలుచేసేవన్నీ సత్యాలయినట్లే హాని కలగజేసేవన్నీ అసత్య ఆచరణలే. మానవతకు, సంస్కారానికి కీడు కలగజేసే పనులన్నింటికీ తావివ్వని మనస్తత్వం ఏర్పడాలన్నమాట.

రోజా ఉపవాస వ్రతం మనిషిలో అటు శారీరకంగా ఇటు ఆధ్యాత్మికంగా రెండు విధాలా ప్రత్యేకమయిన క్రమశిక్షణ, ప్రక్షాళన, పరిశుద్ధత, జాగ్రత్తలను అలవరుస్తుంది. రోజా పాటించే వ్యక్తి రోజా పాటిస్తూ తన సృష్టికర్త, తన పోషణ కర్త, తన అనారోగ్య ఆరోగ్యాల ప్రదాత, తన జీవన్మరణాల స్వామి, సర్వశక్తిమాన్యుడయిన ప్రభువు సమక్షంలో – నా అంతట నేను – నా కళ్ళూ చెవులు, నోరూ నాలుక, మనోమస్తిష్కాలు, కాళ్ళూ చేతులు, శరీరం ప్రాణం – నా సర్వస్వం ద్వారా పగలంతా ప్రతి వక్రమార్గాన్ని తప్పించుకు మెలుగుతాను అని ప్రతిజ్ఞ చేస్తున్నాడన్న మాట. ఈ ప్రతిజ్ఞ చేసిన తరువాత అతను ప్రతి వక్రతకూ, వక్రమార్గానికీ దూరంగా మసలుకోవాలి. నోరు కేవలం సత్యం కోసమే తెరవాలి, మనసులో ఒక్క సత్యం, ధర్మం తప్ప మరో ఆలోచన రాకూడదు, కాళ్ళూ చేతులు కదలినా సత్యపథాన మటుకే కదలాలి. అదే దైవ విధేయతా సంతుష్టి, అదే దైవప్రసన్నతా ఆనందం! ఏ సుఖమయినా, ఏ మాధుర్యమయినా, ఏ రుచి అయినా, ఏ సంతోషమయినా, ఏ తన్మయత్వమయినా, ఏ ఆనందలహరి అయినా ఆ ఒక్క పరమా నందం సమక్షంలో తేలికయిపోతుంది. అది రోజా వ్రతం ప్రసాదించే మహా ఆనందం!!

(22-11-2002)

మనోకాంక్షల దాస్యం

బుద్ధి చేసే బోధలకు బానిసయి మనిషి, దైవమార్గానికి దూరమయిపోతాడు. మనసు కోరిన కోరికల మేరకు తన జీవనపథాన్ని నిర్మించుకుంటాడు. సత్యం, సదాచారం, సత్కార్యాలు అతని చూపుకు ఆనవు. వీటికి బదులు స్వార్థం, స్వలాభం, స్వప్రయోజనం ప్రాధాన్యత వహిస్తాయి. ఇటువంటి వారిని సన్మార్గానికి, సేవాపరాయణతకు, సానుభూతి తత్వానికి చేరువ చేయడం దుర్లభమయిపోతుంది. అతడు తన మనోకాంక్షలనే తనకు అనుసరణ యోగ్యమయినవిగా భావిస్తాడు. అంటే మరో విధంగా తన కాంక్షలనే తన దైవంగా ఎన్నుకుంటాడన్న మాట. ఈ పరిస్థితిని ఇలా అద్దంపట్టి చూపిస్తుంది దివ్యఖుర్‌ఆన్:

> నీవు ఎప్పుడయినా ఆ వ్యక్తి పరిస్థితిని గమనించావా– తన మనోకాంక్షలనే తన దైవంగా చేసుకున్నవాడిని? నీవు ఇటువంటి వ్యక్తిని ఋజుమార్గానికి తీసుకువచ్చే బాధ్యతను స్వీకరించగలవా? వీరిలో చాలా మంది వింటారని, అర్థం చేసుకుంటారని నీవేమయినా భావిస్తున్నావా? వీరు కేవలం పశుప్రాయ మయినవారు, ఇంకా అంతకన్నా మరీ దిగజారిపోయినవారు. (అల్ ఫుర్‌కాన్ : 43, 44)

వినలేరని, అర్థం చేసుకోలేరని అంటే వారు ఆ సామర్థ్యాలు లేనివారని అర్థం కాదు. వారు స్వయంగానే తాము ఎంచుకున్న మార్గం కారణంగా దేవుని ఆగ్రహానికి గురయి మంచీ చెడుల విచక్షణా జ్ఞానానికి దూరమయిపోయారన్నది దీని ఉద్దేశం. ఆ పరిస్థితిలో వారికి సహాయపడి రుజుమార్గం వైపునకు వారిని మళ్ళించడం అసాధ్యం. వారు స్వయంగా తమ తప్పును గ్రహించి సన్మార్గానికి మరలే యోచన చేయనంతవరకు ఎవ్వరూ నైతికమయిన, ఆధ్యాత్మికమయిన ఏ మేలునూ వారికి చేకూర్చలేరు. ఖుర్‌ఆన్ వారిని గురించి ఇలా చిత్రిస్తుంది:

'ఎవరూ ఉన్నతులు కారు, మరెవరూ నీచులు కారు.' ఏ విధమయిన అస్పృశ్యతా భావాలు వారిమధ్య దారిచేసుకోవు. ఎవరి చెయ్యి తగిలినా ఎవరూ అపరిశుద్ధులు కారు. వివాహాది సంబంధాల్లోనూ, ఆహార పానీయాల్లోనూ, కలిసి మెలిసి జీవించడంలోనూ వారి మధ్య ఎలాంటి అవరోధాలుండవు. ఎవరూ తన పుట్టుక కారణంగా లేక వృత్తి రీత్యా నీచుడుగానో తుచ్ఛుడుగానో పరిగణించబడడు. ఎవరికీ తన కులం, వర్గం, వంశం, గోత్రం కారణంగా ఎలాంటి ప్రత్యేక హక్కులు రాయితీలు లభించవు. మనిషికి శ్రేష్ఠత అతని వంశం మూలంగానో అతని సిరిసంపదల కారణంగానో ఏర్పడదు. ఎవరి నైతిక వర్తనం అందరికంటే ఉత్తమమయిందో, ఎవరు భయభక్తుల్లో అందరినీ మించిపొయ్యారో కేవలం వారే శ్రేష్ఠులు.

ఈ సమాజం, వంశం, వర్ణం భాషల పరిధుల్ని, భౌగోళిక సరిహద్దుల్ని త్రెంచివేసి భువిలో ఎల్లెడలా విస్తరించగలదు. దీని ఆధారంగా మానవాళి ఓ విశ్వజనీన సమాజంగా రూపొందుతుంది. వంశం, జాతి, కులం, గోత్రం, దేశం, ప్రాంతం, నేల, నీరు- ఈ ప్రాతిపదికలపై ఏర్పడ్డ సమాజాల్లోనయితే ఆయా జాతులు, వంశావళుల్లో పుట్టినవారే చేరగలుగుతారు. కాని ఇస్లామ్ ప్రతిపాదించే సైద్ధాంతిక సూత్రబద్ధమయిన సమాజంలో, దాని విశ్వాసాలను, నైతిక నియమాలను స్వీకరించిన ప్రతి వ్యక్తీ అన్ని హక్కులూ సమానంగా పొందుతూ చేరిపోగలడు. పోతే ఎవరయితే దాని విశ్వాసాలను, నియమాలను విశ్వసించరో వారిని ఈ సమాజం తన పరిధిలో చేర్చుకోకపోయినా మానవీయ సోదర సంబంధాలు వారితో కలిగి ఉండటమేకాక సమాన మానవ హక్కులూ వారికి ఇస్తుంది.

ఒకే తల్లికి పుట్టిన ఇద్దరు కొడుకుల భావాల్లో భిన్నత్వం కారణంగా వారి జీవిత విధానాలు వేరవుతాయి. కాని అంతమాత్రాన వారు సోదరులు కాకపోరుగా. అచ్చం అలాగే ఇరువర్గాలు కూడా విశ్వాసాల్లో, సిద్ధాంతాల్లో భిన్నత్వానికి లోనయినట్లయితే వారి సభ్యతాసంస్కృతులు, సమాజాలు కూడా నిశ్చయంగా వేర్వేరుగానే రూపొందుతాయి. కాని మానవత అన్నది ఉభయుల మధ్య సమిష్టి ప్రమాణంగా ఉంటుంది. ఈ సమిష్టి భావం, మానవత ఆధారంగా ఎన్నెన్ని హక్కులయితే ఊహించడానికి వీలుందో అవన్నీ అందరికీ సమానంగా లభించాలని ఇస్లామీయ సామాజిక నియమం అంగీకరిస్తుంది.

(24-1-2003)

అపసవ్యమయినవని ప్రకటిస్తుంది. మనిషి మనిషికీ మధ్యగల నిమ్నోన్నతా భేదభావాలు, శ్రేష్ఠులు, అధములు, తమవారు, పరాయివారు అని పుట్టుక ఆధారంగా, భాషా, ప్రాంతాల ప్రాతిపదికగా ఏర్పరచుకున్న తారతమ్యాలన్నీ ఇస్లామ్ దృష్టిలో అజ్ఞానానికి ప్రతీకలు. మీరంతా ఒకే తల్లి ఒకే తండ్రి సంతానమని, ఈ కారణంగా పరస్పరం సోదరులని, మానవులవడం మూలాన సమానులని అది ప్రపంచ మానవులందరికీ తెలుపుతుంది.

> మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుడు ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులు గానూ, తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు, నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞుడు, సకల విషయాల సమాచారం తెలిసినవాడూను.
>
> (దివ్యఖుర్ఆన్ - 49 : 13)

మానవాళికి సంబంధించిన ఈ భావనను ప్రతిపాదించి ఇస్లామ్ చెప్పేదేమంటే మనిషి మనిషికీ మధ్య అసలయిన వ్యత్యాసమంటూ ఏదయినా ఉంటే అది రంగు, వంశం, దేశం, భాషల ప్రాతిపదికపై కాదు, కేవలం సిద్ధాంతాలు, భావాలు, నైతికతల ప్రాతిపదికపైననే కాగలదు. ఒకే తల్లికి పుట్టిన ఇద్దరు బిడ్డలు తమ వంశం రీత్యా ఒకటే అయినా వారి భావాలు, నైతిక వ్యవహారాలు భిన్నమయినట్లయితే జీవితంలో వారి మార్గాలు వేరవుతాయి. దీనికి భిన్నంగా తూర్పు దిక్కు చివరన ఒకరు, పడమర దిక్కు చివరన ఒకరు నివసిస్తూ బాహ్యంగా పరస్పరం ఎంత దూరమైనా భావాల్లో సారూప్యత ఉంటే నైతిక ప్రవర్తన ఇద్దరిదీ ఒకటయితే వారి జీవనపథం ఒకటే అవుతుంది. ఈ సిద్ధాంతం ఆధారంగా ఇస్లామ్, ప్రపంచంలోని సకల వర్ణ, వంశ, దేశ, జాతి తత్వాలపై ఆధారపడిన సమాజాలకు భిన్నంగా, సైద్ధాంతిక, నైతిక సూత్రాల ఆధారంగా సమాజాన్ని నిర్మిస్తుంది.

ఇందులో మనిషిని మనిషితో కలిపే ప్రాతిపదిక అతని పుట్టుక కాదు. విశ్వాసాలు, నైతిక నియమాలు మాత్రమే. దైవాన్నే తన స్వామిగా భావించి, దైవప్రవక్తలు అందజేసిన మార్గదర్శకత్వాన్ని తన జీవిత నియమావళిగా అంగీకరించే ప్రతి వ్యక్తీ ఈ సమాజంలో చేరిపోతాడు. అతడు ఆఫ్రికా నివాసి అయినా... అమెరికా పౌరుడు అయినా... అతడు సెమెటిక్ జాతికి చెందినవాడయినా....ఆర్యుల జాతికి చెందినవాడయినా... నల్ల వాడయినా– తెల్లవాడయినా, అతను ఆంధ్రం మాట్లాడినా అరబ్బీ మాట్లాడినా సరే దానితో సంబంధం లేదు. ఎవరెవరైతే ఈ సమాజంలో చేరిపోతారో వారందరికీ సమాన హక్కులు లభిస్తాయి. వారి మధ్య ఏ విధమయిన వంశానుగత, జాతీయ, వార్గిక వివక్షలు చోటు చేసుకోవు.

మానవులంతా ఒక్కటే!

మానవులారా! మీ ప్రభువుకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి నుండి పుట్టించాడు. అదే ప్రాణి నుండి దాని జతను సృష్టించాడు. ఇంకా ఆ జంట ద్వారా ఎంతో మంది పురుషులను, స్త్రీలను అవనిలో వ్యాపింపజేశాడు. (దివ్యఖుర్‌ఆన్ - 4 : 1)

దైవం మొదట ఒకే మానవ జంటను సృజించాడు. ఆ జంట ద్వారానే ప్రపంచం లోని మానవులంతా పుట్టారు. ప్రారంభంలో చాలా కాలం వరకు ఈ దంపతుల సంతానం ఒకే సమాజంగా వ్యవహరించింది. అది అనుసరించిన ధర్మం ఒక్కటే, దాని వాడుకలో ఉన్న భాష కూడా ఒక్కటే. ఆ సమాజంలో ఎలాంటి విభేదాలుండేవి కాదు.

ఇదీ మీ సముదాయం. వాస్తవానికి ఇది ఒకే సముదాయం, నేను మీకందరికీ ప్రభువును, కనుక మీరు నన్నే ఆరాధించండి. (దివ్యఖుర్‌ఆన్ - 21 : 92)

కానీ వారి సంఖ్య పెరుగుతూపోయినకొద్దీ వారు భువిలో విస్తరించసాగారు. ఈ కారణంగా సహజంగానే విభిన్న వంశావళులుగా, వేర్వేరు జాతులుగా తెగలుగా విభజన చెందారు. వారి భాషలు కూడా వేర్వేరయ్యాయి. దేశ దేశాల శీతోష్ణస్థితులు వారి రూపురేఖల్ని, రంగు హంగుల్ని వడ్డూ పొడవును సయితం మార్చివేశాయి. ఈ విభేదాలు, తారతమ్యాలన్నీ సహజసిద్ధమయినవి. నేడు వాస్తవ జగత్తులో అవి ప్రస్ఫుటంగా గోచరిస్తాయి. అందువల్ల ఇస్లామ్ వాటిని ఒక యదార్థంగా అంగీకరిస్తుంది. వాటిని అది రూపుమాపదలచలేదు. అంతేకాక మానవుల పరస్పర పరిచయం, సహకారం ఈ విధంగానే సాధ్యమవుతుందనే ఉద్దేశ్యంతో వీటి ప్రయోజనాన్ని అంగీకరిస్తుంది.

అయితే ఈ భిన్నత్వాల మూలంగా మానవుల మధ్య రంగు, భాష, జాతి, దేశం ప్రాతిపదికగా ఉత్పన్నమయిన దురభిమానాలను ఇస్లామ్ పూర్తిగా ఖండిస్తుంది. అవన్నీ

సోదరభావాన్ని, సమానభావాన్ని, ప్రేమభావాన్ని, సానుభూతి భావాన్ని కనబరచాలని బోధిస్తుంది. వారి ధార్మిక గ్రంథం, ఖుర్‌ఆన్ "మానవులారా" అని ప్రపంచ మానవులనందరినీ సంబోధిస్తుంది. ఇదీ ముస్లిముల ప్రత్యేకత, ఇదే వారి విశిష్ఠత, విలక్షణత, ఇదే వారి మత చిహ్నం, ఇదే వారి గుర్తు, ఆనవాలు!

ఇస్లామ్ ప్రవక్త ముహమ్మద్ (స) బోధించిన కొన్ని సూక్తులు:

"పొరుగువాని పట్ల (అతడు ఏ మతస్థుడయినా) ఉత్తమ రీతిలో వ్యవహరించమని నన్ను నిరంతరం బోధించడం జరిగింది. నాకు అనుమానం కలిగింది, పొరుగువారిని వారసత్వంలో భాగం పంచివ్వమని ఆదేశమవుతుందేమోనని!"

"పీడితుడు తిరస్కారి అయినా అతని ప్రార్థన స్వీకరించబడటంలో ఏదీ అడ్డుకాదు."

"కూర వండినప్పుడు కాస్త ఎక్కువగా వండి, పొరుగులోని అగత్యపరులకు కూడా అందులో నుంచి పంపండి."

"దానధర్మాలు చేసేటప్పుడు అన్ని మతాల వారికీ అందజేయండి."

ప్రవక్తశ్రీ (స) తన జీవితకాలంలో ఒక యూదు కుటుంబాన్ని సతతం ఆదుకునేవారు. ప్రవక్త (స) పరమపదించిన తరువాత కూడా ఆ సహాయాన్ని కొనసాగనిచ్చారు సహచరులు.

ఒక యూదు వ్యక్తి ప్రవక్త (స)ను భోజనానికి పిలిచి బార్లీ రొట్టె, వెన్న పెట్టాడు, ఆయన దాన్ని సంతోషంగా స్వీకరించారు. మరో యూదు వ్యక్తి ఆయనకు త్రాగేందుకు పాలు సమర్పించుకున్నాడు. ఆయన స్వీకరించి అతనికి దైవం అందం చేకూర్చాలని ప్రార్థించారు. అతని తల జుత్తు నెరవనే లేదు.

దైవప్రవక్త (స) పాల్గొన్న సమావేశంలో ఎవరయినా ముస్లిమేతర వ్యక్తి తుమ్మినప్పుడు ఆయన, " అల్లాహ్ నీకు సన్మార్గం చూపుగాక, నీ పరిస్థితుల్ని చక్కబరచుగాక!" అని దీవించేవారు.

ప్రవక్త (స) ముందు నుంచి ముస్లిమేతరుల శవపేటిక వెళ్ళినా ఆయన గౌరవ సూచకంగా లేచి నిలబడేవారు.

ఈ విషయాలన్నీ బోధించేదేమిటీ? ముస్లిములు తోటి మానవ సోదరుల పట్ల ప్రేమానురాగాలతో, శాంతి శ్రేయోభావాలతో మెలగాలని బోధించడం లేదా? ముస్లిములు ఈ వ్యవహార సరళిని అలవరచుకుంటే, తమకు నిజమయిన గుర్తింపునిచ్చే ఈ గుణాలను, తమకే చెందిన ఈ గుణాలను, తాము స్వంతం చేసుకుంటే నేడున్న విద్వేషపూరితమయిన వాతావరణం, కంటకప్రాయమయిన పరిస్థితులు మారిపోతాయనడంలో సందేహమేముంది? సౌజన్య శీలత, సదాచార నిబద్ధత, సహిష్ణత, సహనం, సంయమనం, నిగ్రహం వంటి గుణాలు ముస్లిములు పోగొట్టుకున్న సంపద. ఆ తరగని సంపదను తిరిగి తమకు గుణాత్మకమయిన చిహ్నంగా ముస్లిములు రూపొందించుకునే అవసరం నేడు ఎంతయినా ఉంది.

(13-2-04)

సదాచారమే మత చిహ్నం!

ఇస్లామ్ మతావలంబీకులకు మతపరమయిన చిహ్నం ఏదయినా ఉందా? మన నాట సాధారణ పల్లెవాసి మొదలుకుని పట్టణవాసుల్ని అడిగినా, నిరక్షరాస్యులయిన పామరుల నుండి మహా పండితులనడిగినా, ఒక సామాన్య ఆడపడచునడిగినా, చిన్న స్కూలు పిల్లవాణ్ణి అడిగినా వెంటనే ఒకే సమాధానం ఇస్తారేమో! 'అవునూ, ఉంది' అనే అంటారు అందరు. అదేమిటంటే– నెలవంక, గడ్డం, టోపీ అని కూడా వెంటనే పలుకు తారేమో! ముస్లిములను అలాగే చిత్రించారు, కథకులు, కవులు, చిత్రకారులు, చరిత్ర కారులూ, చిత్రసీమలోనివారున్నూ! ఇది ఎంత శోచనీయమయిన స్థితి? ఇది ఇస్లామ్ చిహ్నమూ కాదు, ముస్లిముల చిహ్నమూ కాదు. ముస్లిములు తమ్ముతాము పరిచయం చేసుకోవడంలో కనబరచిన అలసత్వానికి, అలక్ష్యానికి, అసమర్థతకు చిహ్నం ఇది!

అన్యమతస్థులకు ప్రత్యేకంగా ఏదో ఒక చిహ్నం ఉన్నట్లు, బొట్టు, జుట్టు, త్రిశూలం, శిలువ ఇత్యాది చిహ్నాలు ఆయా మతస్థులకు ఆనవాళ్ళుగా అలరారినట్లు ముస్లిములకూ ఒక చిహ్నముంది అన్న ఆలోచనే పైన పేర్కొన్న చిహ్నాలను ముస్లిములతో ముడిపెట్టడానికి కారణం. ముస్లిముల చిహ్నం గడ్డం కాదు, టోపి కూడా కాదు. లాల్చీ పైజామాలు కావు, గళ్ళ లుంగీ అంతకన్నా కాదు. ముస్లిములు ఒక అంతర్జాతీయ సముదాయం. వారికి ఈ చిహ్నాలు మత చిహ్నాలుగా సరిపోవు. వీటికన్నా ప్రముఖమయినవి, ప్రత్యేక మయినవీ ముస్లిముల చిహ్నాలు! 'ఇస్లామ్' గుణవాచకం అయినట్లే ముస్లిములూ గుణాత్మక మయిన చిహ్నామున్నవారు. ఆ చిహ్నమే నిజానికి ముస్లిములను ఇతరుల నుండి వేరుచేసి చూపిస్తుంది.

ముస్లిములు తమ విశ్వాసం రీత్యా మానవులనందరినీ దేవుని దాసులు, సమానులు, సోదరులు అని భావిస్తారు. అందువల్ల అందరూ మన సద్భావనకు, సద్ప్రవర్తనకు, సదాచరణకు అర్హులని భావిస్తారు. మానవుల మధ్య వర్ణం, వర్గం, వంశం, కులం, మతం ఆధారంగా తారతమ్యాన్ని పాటించడాన్ని వారి ధర్మం నిషేధిస్తుంది. ధనిక, బీద ప్రజల మధ్య భేదభావాన్ని పాటించడాన్ని అది వారిస్తుంది. అందరి పట్ల

రాచరికం, నియంతృత్వం తనకెదురుగా ప్రజాస్వామ్యాన్ని లేక ప్రజాప్రాతినిధ్యాన్ని ఎన్నడూ సహించదు. అదే జరిగింది. ఫలితంగా రక్తపాతం సంభవించింది.

ఇదీ క్లుప్తంగా కర్బలా ఘటనల గాథ. నేడు తిరిగి "యజీద్" వారసులు అనేక చోట్ల గద్దెలు ఆక్రమించుకుని తమ నియంతృత్వ పోకడలకు ప్రాణం పోస్తున్నారు. కాని "హుసైన్" వారసులు కేవలం శోక ప్రకటనలతో, బాధ వ్యక్తీకరణలతో, రక్తసిక్త ప్రదర్శనలతో కాలం వెళ్ళబుచ్చుతున్నారు. యజీద్ తత్వాలతో సంకుల సమరానికి హుసైన్ అనుయాయులు సమాయత్తమవడం లేదు. ఫాసిస్టు ధోరణులు ఎల్లెడలా వ్యాపిస్తున్నాయి, ప్రజాప్రాతినిధ్య ధ్వజవాహకుడయిన హుసైన్ (ర)ని ఆదర్శంగా భావించే పవిత్రాత్ములు "యజీద్" శక్తులను అన్ని మైదానాల్లోనూ ధీటుగా ఎదుర్కొనేందుకు సన్నద్ధులవడం లేదు.

ముహర్రమ్ నెలలో ఇస్లామీయ కేలండరు తొలి నెలలో ఇమామ్ హుసైన్ ఘనంగా జరిపిన త్యాగోత్సవం ముస్లిముల హృదయాల్లో ప్రతిఫలించడం లేదు. నియంతృత్వ ధోరణులను ప్రతిఘటించడానికి హుసైన్ ప్రేమికుల గుండెల చప్పుళ్ళు వీధివీధిన, వాడవాడన ప్రతిధ్వనించడం లేదు. ఇంకా సమయం రాలేదా?

(20-2-04)

ప్రారంభమవుతుంది. కాని ముహర్రమ్ నెలను ముస్లిములు చిత్రించిన తీరు చాలా బాధాకరంగా ఉంది. ప్రపంచ జాతుల్లో దాదాపు అన్ని జాతులవారు, ఆయా దేశాల కేలండరును పాటిస్తారు. సంవత్సరాదిని లేక కొత్త సంవత్సరం ప్రారంభాన్ని వేడుకగా జరుపుకుంటారు. ఆ రోజు సంతోషంగా గడుపుతారు. జనవరి మొదటి తేదీన జరిగే హంగామాను అలా ప్రక్కన పెడితే స్వయంగా మన తెలుగు ఉగాది నాడు హుందాగా, ఆనందంగా సంవత్సరాదిని జరుపుకోవడం ఎంత ఉల్లాసభరితంగా ఉంటుంది! అలాగే పార్శీ ప్రజలు తమ సంవత్సరాదిని 'జష్నె నౌబహుర్' (నవ వసంతోత్సవం) లేక 'నౌరోజ్' (నవ దినోత్సవం)గా జరుపుకోవడం ఎంత హాయిగా ఉంటుంది. దీనికి భిన్నంగా ముస్లిములు శోక గానాలతో కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తారు!

నిజానికి ఇస్లామ్‌లో ఏ దినానికీ ఎటువంటి ప్రాముఖ్యం లేదు. సంతోషంగా పండుగ జరుపుకునే సందర్భాలను ఇస్లామ్ రెంటినే సూచించిన విషయం కూడా వాస్తవమే. అయినా మిగతా రోజుల్లో ఏవయినా ప్రత్యేక సందర్భాలు వస్తే- ధార్మిక ప్రాధాన్యత నివ్వకుండా సంబరాలు జరుపుకోవడంలో తప్పులేదు. కొత్త సంవత్సరాన్ని శోక దినంతో ప్రారంభించే అవసరమేముంది?

ప్రవక్త మహనీయులు (స) గతించి అర్ధ శతాబ్ది కూడా గడవక మునుపే ముహర్రమ్ 10వ తేదీన ఇరాక్‌లోని కర్బలా మైదానంలో సంభవించిన ఘటనా క్రమం ఎంతయినా విచారకరమయినదే. అందులో స్వయాన ప్రవక్త మనుమడు హజ్రత్ ఇమామ్ హుసైన్(ర), ఆయన కుటుంబ సభ్యులు పలువురు అమరగతులయిన వైనం కూడా అత్యంత విషాద కరమయినదే, సందేహం లేదు. కాని ఆ దౌర్భాగ్యకరమయిన ఘటన చరిత్రలో ఒకానొక నాడు గడిచింది. అలా జరగవలసింది కాదు. కాని అంత మాత్రాన ఆ సంఘటనను పురస్కరించుకుని ప్రతి సంవత్సరం దాదాపు 6 నెలలు బాధను వ్యక్తం చేయడం వల్ల సాధించేదేముంది? హజ్రత్ హుసైన్ (ర) ఏ ఆశయ సిద్ధి కోసం తన ప్రాణాలను అర్పించారో ఆ ఆశయ మార్గాన ఒక్క అడుగూ వేయక, ఒక్క అంగుళం కూడా కదలక, కేవలం బాధను వ్యక్తం చేస్తూ, ఆవేదనను ప్రదర్శిస్తూ సంకేతప్రాయంగా మనమూ మన రక్తాన్ని చిందించినంత మాత్రాన ఆ ఆశయం సిద్ధించదు.

హజ్రత్ హుసైన్, ఇస్లామీయ పరిపాలనా వ్యవస్థను తల్లక్రిందులు చేసే రాచరిక వ్యవస్థ, ఖిలాఫత్ (ప్రాతినిధ్య వ్యవస్థ) స్థానంలో తిష్ఠ వెయ్యడం పట్ల నిరసనగా ఉద్య మించారు. ఖలీఫా స్థానంలో, వంశానుగతంగా అధికారాన్ని చేజిక్కించుకున్న వ్యక్తి ఆనాటి పాలకుడు "యజీద్"తో సంప్రదింపులకు వెళ్ళారు. రాచరికానికి బదులు ఖిలాఫత్ లేక నేటి పరిభాషలో, ప్రజాస్వామిక వ్యవస్థను పునరుద్ధరించేందుకు చేసిన ప్రయత్నమది.

ముహర్రమ్ గుణపాఠం

కాలాన్ని ఎన్నో విధాలుగా విభజించుకున్నాము. సెకెన్లు, నిముషాలు, గంటలు గానేకాక ఘడియలు, విఘడియలు, జాములుగా కూడా విభజించాము. ప్రకృతి సిద్ధమయిన విభజన సూర్యోదయం, సూర్యాస్తమయం, చంద్రోదయం, పౌర్ణిమ, అమావాస్య, రేయి, పగలు, దినం, వారం, నెల, సంవత్సరం- ఎలాగూ ఉంది. ప్రకృతి సిద్ధమయిన విభజనలే అనాదిగా మనిషి అనుసరిస్తూ వస్తున్నాడు. సంవత్సరాన్ని రుతువుల ఆధారంగానేకాక చంద్రమానం- అంటే నెల పొడుపును బట్టి కూడా విభజించడం జరిగింది. ఇస్లామీయ కేలండరు, హిజ్రి శకంలో చంద్రమానం ప్రకారం జరిగిన విభజనే పాటించబడుతుంది. చంద్రమానానికి రుతువులతో ఎటువంటి సంబంధం లేదు. అయితే క్రీస్తు శకం కేలండరు సూర్యమానం ప్రకారం నడుస్తుంది.

హిజ్రీ శకంలో అనుసరించబడే చంద్రమానం వల్ల లభించిన అనేక ప్రయోజనాల్లో ఒకటేమిటంటే, 'రమజాన్' నెలలో పాటించబడే ఉపవాస వ్రతాలయినా, 'జిల్‌హజ్జ' నెలలో చేసే హజ్జ్ యాత్ర అయినా నిత్యం ఒకే రుతువులో జరగవు. చలికాలం, ఎండ కాలం, వాన కాలం- అన్ని కాలాల్లో ఇవి మారి మారి వస్తుంటాయి. దాదాపు 30 సంవత్సరాలలో ఒక రుతుచక్రం పూర్తవుతుంది. ఉదాహరణకు క్రీ.శ. 2000లో రమజాన్ నెల చలికాలంలో డిసెంబరు మాసంలో వచ్చిందంటే దాదాపు 30 ఏళ్ళ క్రితం 1970లోనూ డిసెంబరులోనే వచ్చి ఉంటుంది. ముప్ఫయ్యేళ్ళ తరువాత 2030లోనూ తిరిగి డిసెంబరు నెలలో వస్తుంది. చంద్రమానం ప్రత్యేకత ఇది. ముస్లిములకు ఏ రుతువులోనయినా, ఎట్టి దేశకాల పరిస్థితుల్లోనయినా దైవాదేశాలను పాటించే సుశిక్షణ ఈ చంద్రమానం వల్ల ప్రాప్తమవుతుంది.

హిజ్రీ కేలండరు చివరి నెలలో హజ్జ్ యాత్ర ముగుస్తుంది. తరువాత వచ్చే నెల ముహర్రమ్, కొత్త సంవత్సరం ప్రారంభం. హిజ్రీ కేలండరు ముహర్రమ్ నెలతో

అంతేకాదు తాను నమ్ముకున్న ప్రభువు కూడా తన్ను పరీక్షించగోరినప్పుడు ఆ పరీక్షకూ వెరువలేదు. తన జ్యేష్ఠ పుత్రుడు ఇస్మాయీల్ (అలైహిస్సలామ్)ని బలిగొనాలని దైవాదేశమయినా విధేయతా శిరస్సును వంచాడే తప్ప మారు పలుకలేదు. తనయుని త్యాగానికి సిద్ధమయ్యాడు. కారుణ్య ప్రభువయిన దైవం అతని త్యాగనిరతికి, దైవాజ్ఞా బద్ధతను ఎంతగానో కొనియాడుతూ హజ్రత్ ఇస్మాయీల్ (అ) బలిదాన సంకల్పాన్ని స్వీకరించి ఆ బలిదానం జరగనివ్వలేదు, దాని స్థానంలో పశు బలిని ఆమోదించాడు. ఆ పశుబలిని ప్రళయం వరకూ మానవాళి సాంప్రదాయికంగా అనుసరించాలని నిర్ణయించాడు. అదే 'ఈదుల్ అజ్‌హా' అనబడే బక్రీద్ పండుగ!

(6-2-04)

వంశపారంపర్యంగా వచ్చే నమ్మకాలు, ఆచారాలు, సంప్రదాయాలు ఏవీ అతని జిజ్ఞాసకు అవాంతరాలుగా నిలువలేదు. నిలిచినా అతను అన్నింటినీ త్రోసిరాజని ముందుకు సాగాడు. నక్షత్రాలు, చంద్రుడు, సూర్యుడు, అన్నింటినీ పరిశీలించాడు. అన్నీ ఏదో నియమావళికి బద్ధమయి పరిభ్రమిస్తూ, ఉదయిస్తూ, అస్తమిస్తూ ఉన్నాయని గమనించాడు. ఇలా మరో శక్తికి మరో నియమావళికి అధీనమయినవేవీ తనకు ప్రభువు, స్వామి కాజాలవని నిర్ణయానికి వచ్చాడు. సకల విశ్వ వ్యవస్థను తన ఆజ్ఞాబద్ధమయి నడచుకునేలా చేయగల శక్తి మాన్యుడయిన, బలోపేతమయిన ప్రభువు మరొకడున్నాడని తెలుసుకున్నాడు. ఆయనే తన దైవం, స్వామి, ప్రభువు, ఆరాధ్యుడు, మొరలాలకించేవాడని అర్థం చేసుకున్నాడు.

సత్యం ముందుకు వచ్చినా, సత్యాన్ని సత్యమని గుర్తించి తెలుసుకున్నా కేవలం జాతీయ దురభిమానాల కారణంగా, వంశానుగత ప్రేమానురాగాల ఫలితంగా, వారసత్వపు నమ్మకాల మూలంగా సత్యాన్ని తిరస్కరించలేదు; అప్పటివరకు అపరిచిత మయిన విశ్వాసాన్ని త్రోసిపుచ్చలేదు; పరాయి భావమని ఏవగించుకోలేదు. ఒక్క క్షణం కూడా ఆలోచించక తక్షణమే దాన్ని స్వీకరించాడు, ఆశ్రయించాడు, తన స్వంతం చేసుకున్నాడు. అంతేకాదు, స్వంత తండ్రినీ, కుటుంబాన్నీ, వంశాన్నీ, జాతి ప్రజల్నీ సంబోధించి తన నిర్ణయాన్ని ప్రకటించాడు.

"ఇదో, నేను మీ దారికి భిన్నంగా నా దారినే వేరు చేసుకున్నాను. మీరు ఆచరిస్తున్న బహుదైవారాధనను అనుసరించలేను. మీ నక్షత్ర పూజను, బహుదైవారాధనను అనుసరించలేను. ఇదో నేను మీతో వేరయిపోతున్నాను" అని తన ఇంటిని, కుటుంబాన్నీ త్యజించాడు. ఇది అతని తొలి త్యాగం. తన తాతముత్తాతల అంధానుకరణకు వీడ్కోలు పలకడం అతని మొదటి త్యాగం. తన అభిమానాలను, దురభిమానాలను, విలాస వంతమయిన జీవితాన్ని, గౌరవాదరాల సామాజిక స్థానాన్ని, పలుకుబడిని, ఆదాయాన్ని వదలిపెట్టాడు. తన బలహీనతల్ని, మనోకాంక్షల్ని సన్యసించాడు. అతని ఆంతర్యంపైన అంతరాత్మకు లభించిన ప్రథమ విజయమది.

విశ్వంలోని పరమ సత్యం దేవుని ఏకత్వం అని, సరయిన మార్గం ఏకేశ్వరోపాసన అని, నిజమయిన జీవన విధానం దైవవిధేయతా వ్యవస్థ అని తెలుసుకున్నాడు. ఆ వాస్తవం అతనికి సర్వాంగసుందరంగా ఆవిష్కృతమయింది. దాన్ని బహిరంగంగా ప్రకటించాడు. ఫలితంగా సామాజిక బహిష్కారానికి గురయ్యాడు, ఏలికల ఆగ్రహానికి లోనయ్యాడు. అయినా నమ్ముకున్న సత్యం కోసం, ప్రాణత్యాగానికయినా సిద్ధమయ్యాడు కాని వెనుకంజవేయలేదు. అగ్నిలో వేయాలని పాలకులు నిర్ణయించినా అతని విశ్వాసంలో చలనం రాలేదు, సడలింపు రాలేదు.

త్యాగమూర్తి ఇబ్రాహీమ్!

జీవితంలో అనివార్యమయిన యదార్థం త్యాగమయితే, త్యాగానికి అనన్యమయిన ప్రతీక, అపూర్వమయిన దృష్టాంతం హజ్రత్ ఇబ్రాహీమ్ (అలైహిస్సలామ్). నేటికి నాలుగు వేల ఏళ్ళ పూర్వపు గాథ. ఇరాక్ భూభాగంలో పుట్టిన ఒక బాలుడు, చారిత్రకమయిన జననం ఆ బాలుడిది. మానవ మనుగడ గాథ పైన చెరగని ముద్ర వేసిన గాథ అతనిది. ప్రపంచంలో బహు దైవారాధన రకరకాల రూపం ధరించిన సమయం అది. జనం, నక్షత్రాలను, గ్రహాలను, సూర్యచంద్రుల్ని, చెట్లను, కొండల్ని పూజించేవారు. అటువంటి ప్రజల మధ్యన, పూజారుల కుటుంబంలో పుట్టిన ఆ బాలుడు ప్రత్యేక కార్యసిద్ధికై ఆవిర్భవించిన కారణజన్ముడు.

పురోహితుల కుటుంబం గనక పౌరోహిత్యంకన్నా పరపతిగల వృత్తి, ఆదాయం అందజేసే వ్యాపకం, ప్రముఖ స్థానం, పలుకుబడి, ప్రత్యేక గౌరవాదరణలు ప్రాప్తం కాగల మార్గం మరొకటి ఏదీ లేదంటే అందులో అతిశయవాదన ఏదీ లేదు. ఆ వృత్తినీ, పరపతినీ, పలుకుబడినీ, గౌరవాన్నీ, ఆదాయాన్నీ పొందడం సులభతరమే కాదు, ప్రపంచ పోకడ ప్రవహించే దిశకు సాగే ప్రవాహమే గనక, అది అందరికీ ఆమోదయోగ్యం కూడా. అందునా ఆ వైఖరికి, ఆ మార్గానికి భిన్నమయినదేదీ అప్పట్లో కానవచ్చేది కూడా కాదు.

మా పూర్వీకులు, పెద్దలు తప్పుత్రోవ నడవలేరన్న గుడ్డినమ్మకంతో అతను తన తాతముత్తాతల దారిని, జాతి నడిచే బాటను కళ్ళు, చెవులూ, నోరూ మూసుకుని త్రొక్కడానికే నిర్ణయించుకోలేదు. పాత బాటలో ఏదో అపశ్రుతి ఉందన్న స్పృహ మాటిమాటికీ అతని అంతర్యాన్ని కెలకసాగింది. తన దారేదో తానే వెదకాలని నిర్ణయించుకున్నాడు. పరిశోధన ప్రారంభించాడు. స్వేచ్ఛగా సమస్త పక్షపాత ధోరణులకు, దురభిమానాలకు అతీతంగా కొత్తబాట అన్వేషణకు ఉపక్రమించాడు.

కాని ఈ దుర్మార్గులు ఏమీ ఆలోచించకుండా, ఏమీ అర్థం చేసుకోకుండా తమ మనోభావాల వెంటపడిపోతున్నారు. ఇలా దారితప్పడానికి దైవమే వదలిపెట్టిన వ్యక్తికి దారి చూపడం ఎవరి తరం? ఇలాంటి వారికి ఎవ్వరూ సహాయపడలేరు.

(అర్‌రూమ్ : 29)

వీరు, తమ మనోకాంక్షలనే తమ దైవంగా భావించి తాము వ్యవహరించే తీరును 'సత్యం'గా భావిస్తున్నారు. ప్రకృతి అంతటా పరచుకున్న సిద్ధాంతం ఒకవేళ ఇదే అయి నట్లయితే, అంటే ఒక క్షణం కాలానికయినా, ప్రకృతిలోని ప్రతి వస్తువు, ప్రతి అంశం స్వేచ్ఛగా తనకు నచ్చిన దారిన తాను వ్యవహరించే పరిస్థితి ఏర్పడితే సృష్టి యావత్తూ అల్లకల్లోలం పాలయిపోయేది. రుతువులు తారుమారయిపోయేవి, గ్రహాలు ఉపగ్రహాలూ ఘర్షించుకునేవి. విశ్వవ్యవస్థ అంతా అస్తవ్యస్తంగా తయారయ్యేది. విశ్వంలోని జీవ రాశులన్నీ ఎన్నడో సమసిపోయేవి.

మరి సత్యం ఎక్కడయినా వీరి మనోకాంక్షల వెంట నడిచే మాటయితే భూమీ ఆకాశాలు, వాటిలోని జీవకళ, వ్యవస్థ అంతా ఛిన్నాభిన్నమయిపోయేది.

(అల్ ము'మినూన్ : 71)

సృష్టిలోని సమస్తమూ శోభతో, సువ్యవస్థతో, సామరస్యంతో వ్యవహరిస్తోందంటే, అంతా ఒకే సృష్టికర్త, ఒకే ప్రభువు, ఒకే నిర్వహణ కర్త అయిన దైవం ప్రచండ అధికారానికి తల ఒగ్గినందుకే. సర్వం ఆయన దాస్యంలో స్వయం సమర్పణ చేసుకోవడం మూలానే ప్రకృతి వ్యవస్థలో ఈ సమన్వయం, సామరస్యం సాధ్యమయింది. ప్రపంచ వ్యవస్థలో, మానవ సమాజంలో, స్వయంగా మానవుని జీవితంలో అతని ఆంతర్యంలోనూ నెమ్మది, శాంతి, తృప్తి నెలకొనాలంటే మానవుడు సయితం ఆ ఒక్క దైవానికే తల వంచాలి. ఆయనకు విధేయుడయ్యే జీవించాలి. అదే ప్రకృతితో సామరస్యం పొందగల మార్గం. అదే ప్రకృతి అనుసరించే విధానం. అదే విశ్వమంతటా విస్తరించిన వాస్తవం. అలాకాక దైవానికి తోడుగా మరెన్నో శక్తుల్ని సహవర్తులుగా భావించే వైఖరిని మానవులు అనుసరించి నట్లయితే ఆ దైవభావన, ఆ జీవన విధానం కేవలం మానవ ఊహా రచితం, మానవ మనోకాంక్షల సృష్టి మాత్రమే. దానికి దైవం తరఫున ఎటువంటి ఆధారంగాని, గుర్తింపుగాని, ఆమోదంగాని ప్రాప్తం కావు:

ఇవన్నీ కేవలం కొన్ని పేర్లు మాత్రమే- మీరునూ్న మీ తాతముత్తాతలూ సృష్టించుకుని వీటికి పెట్టుకున్నవి. అల్లాహ్ వాటికి ఏ ఆధారమూ పంపలేదు. వీరు కేవలం తమ ఊహాల వెంట, తమ మనోకాంక్షల వెంటపడి ఉన్నారు.

(అన్ నజ్మ్ : 23)

(18-4-03)

ఆత్మ విమర్శన!

మనిషికి ఏదయినా విపత్తు పట్టుకున్నప్పుడు మమ్మల్ని పిలుస్తాడు, పరుండినా, కూర్చున్నా, నిల్చున్నా; ఆ తరువాత మేము ఆ విపత్తును తొలిగించినప్పుడు అతను పూర్తిగా మారిపోతాడు– తనకు దాపురించిన ఆపదకు తాను ఎన్నడూ మమ్మల్ని పిలువనే పిలువనట్టుగా. ఈ హద్దులు మీరి ప్రవర్తించే వారికి వారి చేష్టలు ఇలాగే అందమయినవిగా చేసి చూపెట్టబడ్డాయి.

(దివ్యఖుర్‌ఆన్ - యూనుస్ : 12)

మానవుని ఓ ప్రత్యేక లక్షణాన్ని ఇక్కడ ప్రస్తావించడం జరిగింది. కష్టం కలగగానే దైవాన్ని తలచుకుంటాడు. కూర్చున్నా లేచినా పరుండినా ఎల్లవేళలా దైవాన్ని గుర్తుచేసు కుంటాడు. దేవుడు ఎలాగయినా ఈ విషమ స్థితి నుండి తన్ను రక్షించాలని అతని అంగాంగమూ కోరుకుంటుంది. అనుక్షణమూ అతను తన ఈ బాధ ఎలా తొలిగిపోతుందా అని అనుకుంటూ ఉంటాడు. సాధారణ రీతిలో అది తొలిగే సూచనలు మృగ్యమయిపోతూ ఉంటే దైవం తన మహిమ వల్ల అద్భుత రీతిలోనయినా సరే దాన్ని అప్పటికప్పుడు తొలిగించాలని దేవుణ్ణి వేడుకుంటాడు. అంతేకాదు ఒక్కోసారి ఆ ఆపదమాయమయి పోయినట్లు, తనకు తెలియకుండానే ఏదో అనూహ్యమయిన అగోచర శక్తి దాన్ని దూరం చేసివేసినట్టు కలలు కూడా కంటాడు. ఇది మనిషిలోని మానసిక దౌర్బల్యం.

మనిషికి ఏదయినా వ్యాధి సోకినప్పుడు, ఏదయినా బాధ కలిగినప్పుడు, తన ఉపాయాలతో, యుక్తులతో, తన సాధనలతో, ఆ బాధను తొలిగించుకునే ప్రయత్నాలన్నీ చేసి అలసిపోయి ఇక ఏమీ చేయలేని స్థితి ఏర్పడిందని తెలుసుకున్నప్పుడు ఆ బాధ అకస్మాత్తుగా మాయమయినట్లు ఊహించుకుంటాడు. ఆ వ్యాధి అసలు సోకనే లేదన్నట్లు

తాను స్వాస్థత పొందాలని ఆశిస్తాడు. నిరుద్యోగంతో తల్లడిల్లిపోతూ, ఆదాయంలేక, ఇంటివారినీ తనను ఆదుకునే దిక్కులేక సహాయం ఆకాశం నుండి ఊడి పడాలని, ఉద్యోగం, పని తనను వెదుక్కుంటూ వస్తుందని ఆశలల్లుకుంటాడు. అప్పుల వాళ్ళు వచ్చి వేధిస్తూ ఉంటే ఏదో అదృశ్య హస్తం తన అప్పులు తీర్చే ఏదయినా ఉపాయం చూపెడుతుందని, ఎక్కడి నుండో అజ్ఞాత దిశ నుండి డబ్బు వచ్చి తనను ఆదుకుంటుందని స్వాప్నిక జగత్తులో విహరిస్తాడు. అలా జరగాలని దైవాన్ని మరీ మరీ అర్థిస్తాడు!

సామూహికంగానయితే కరవుకాటకాలు దాపురించినప్పుడు, వరదలు వచ్చి నప్పుడు, పంటలకు తెగులు ముట్టుకున్నప్పుడు, జనవాసాల్లో మహమ్మారి ముట్టడించి నప్పుడు, నీరులేక జనం ఇక్కట్లు పడుతున్నప్పుడు, బావులు, చెరువులూ ఎండిపోయి నేల నెర్రలుబాసినప్పుడు అందరూ కలసి సామూహికంగా, దైవాన్ని వేడుకుంటారు, ప్రార్థనలు, విశేష ప్రార్థనలు, ప్రత్యేక ఆశయంతో ప్రార్థనా సభలు, సమావేశాలు జరుపు కుంటారు. తాము మునుపెన్నడూ పూజించని విధంగా, సంస్మరించని విధంగా పూజిస్తారు, దైవ సంస్మరణా సభలు ఏర్పాటు చేసుకుంటారు. దైవం వైపునకు మనుషులు చిత్తశుద్ధితో మరలుతారు. ఇకపై ఎటువంటి దైవాజ్ఞా ఉల్లంఘన జరపమని దైవంతో వాగ్దానం చేసుకుంటారు. తాము ఇతఃపూర్వం చేసిన తప్పిదాలకు మనసారా మన్నింపును వేడు కుంటారు. ఇకపై అలాంటి అపచారాలకు పాల్పడమని పశ్చాత్తాపంతో కుమిలిపోతారు. తమ పాపాలను క్షమించి ఈ ఆపదను, విపత్కర పరిస్థితిని తొలిగించమని, ఇకపై దైవాజ్ఞాబద్ధమయిన జీవితం గడుపుతామని దైవంతో ప్రమాణాలు చేస్తారు.

అదో, అటువంటి పరిస్థితినే ఖుర్ఆన్ ఇక్కడ ఎత్తి చూపుతుంది. ఇది దేవుని పరీక్ష! ఏ ఆపద వచ్చినా వ్యక్తికి సోకినా, సముదాయాలకు మూడినా, ఆపద అన్నది పరీక్ష రూపంలో వచ్చినా లేక శిక్ష రూపంలో తాకినా దైవం పంపగానే వస్తుంది. మానవులు తమ్ముతాము సంస్కరించుకోవాలని, సమాజాన్ని సంస్కరించాలనీ దేవుడు హెచ్చరికగా అనేక రూపాలలో వ్యక్తులను, సముదాయాలను పరీక్షిస్తాడు, శిక్షిస్తాడు.

అన్యాయవర్తనులు, దుర్మార్గులు, అధికార దుర్వినియోగం ద్వారా ధనార్జనకు పాల్పడేవారు, ప్రజల హక్కుల్ని కాలరాసేవారు, బలహీనుల్ని, అల్పసంఖ్యాకుల్ని అధికార బలంతో, ఐశ్వర్యబలంతో అణగద్రొక్కేవారు, తమను వ్యతిరేకించేవారిని కారాగారాల్లో బంధించేవారు, బంధుప్రీతితో, ఆశ్రిత పక్షపాతంతో పరిపాలనా వ్యవస్థను అస్తవ్యస్తం చేసేవారు, ప్రజల ధనమాన ప్రాణాలకు రక్షణ కల్పించకపోవడమేకాక వాటిని అధికార పాదంతో నులిమివేసేవారు, ఒక ప్రత్యేక భావనాస్రవంతికి మార్గం సుగమం చేసి, ఇతర ఆలోచనా విధానాలను రూపుమాప యత్నించేవారు, సాంస్కృతిక ఉగ్రవాదంతో ప్రజలను

రేయింబవళ్ళు భయాక్రాంతులను చేసేవారు, నేరస్థులకు, అపరాధులకు రాజ్యంలో ఆశ్రయమిచ్చి అధికారాన్ని కట్టబెట్టేవారు, కులతత్వాన్ని, మతతత్వాన్ని ప్రచారం చేసేవారు పాలకుల రూపంలో ప్రజలపై అధికారం చెలాయిస్తే అర్థం ఏమిటీ?

ప్రవక్త మహనీయులు ముహమ్మద్ (స) ఒక ప్రవచనంలో ఇలా తెలిపారు:

"మీరు ఏ విధమయినవారో అటువంటివారే మీకు పాలకులుగా నియుక్తులవుతారు." (మిష్కాత్)

ఇదీ ఒక పరీక్షే, లేక శిక్ష! ప్రవక్తశ్రీ (స) మరో చోట ఇలా సెలవిచ్చారు:

దుర్మార్గులూ దౌర్జన్యపరుల అధికారాన్ని ఎదిరించి సత్యవాక్కును పలకడం అత్యుత్తమమయిన జిహాద్– సతత సమరం– నిరంతర పోరాటం! (మిష్కాత్)

మరో హదీసులో ఇలా ఉపదేశించారాయన (స):

మీలో ఎవరయినా చెడును చూస్తే దాన్ని తన హస్తబలంతో ఆపివెయ్యాలి. ఆ మేరకు శక్తి లేకపోతే నోటితో వ్యతిరేకించాలి. అదీ చేతకాకపోతే కనీసం మనసులో అది "చెడు" అని నమ్మాలి, దాన్ని రూపుమాపేందుకు దైవాన్ని వేడుకోవాలి. ఇది విశ్వాసంలో అధమాతి అధమ స్థానం. (మిష్కాత్)

ఇది ప్రజాస్వామిక యుగం. ప్రజాభిప్రాయం ద్వారా పాలనా వ్యవస్థను, పాలకులను, పాలనా విధానాలను ఎన్నుకునే, నిర్ణయించుకునే, ప్రతిష్టించుకునే అవకాశమున్న కాలమిది! నేడు మనం, మన పాలకుల వర్గం, వారి ఎడల మన వైఖరి– అన్నింటినీ పునస్సమీక్షించుకోవలసిన, ఆత్మపరీశీలన చేసుకోవలసిన తరుణం ఇంకా రాలేదా?

(27-2-04)

మంచి కోసం!

మానవ ఆత్మ మీద, దాన్ని తీర్చిదిద్దిన శక్తి మీద ఒట్టు- ఆ తరువాత దాని దుర్మార్గాన్ని, దాని నిష్ఠాపరత్వాన్ని ఆ శక్తి దానికి అంతఃప్రేరణ ద్వారా ఎరుక పరచింది. తన ఆత్మను పరిశుద్ధపరచుకున్నవాడు నిస్సందేహంగా సాఫల్యం పొందాడు, దాన్ని అణగద్రొక్కినవాడు నిష్ఫలుడయ్యాడు.

(దివ్యఖుర్‌ఆన్- అష్షమ్స్ : 7-10)

మానవునిలోనే దుర్మార్గమయినా, నిష్ఠాపరత్వమయినా ప్రకృతి సహజంగానే నిబిడీకృతమయి ఉన్నాయని తెలుపుతున్నాయి ఈ వచనాలు. మనిషి ఏ పనినయినా చేయడానికి ఉపక్రమించినప్పుడు దైవికమయిన అంతర్‌ప్రేరణ కలుగుతుంది. ఆ పని దుర్మార్గపు కోవకు చెందినదో నిష్ఠాపరత్వాన్ని సూచించేదో ఆ అంతర్ ప్రేరణ మనిషికి స్పష్టపరుస్తుంది. ఆ పని, ధార్మికంగా, నైతికత దృష్ట్యా, సామాజిక పరిణామాల రీత్యా, చట్టం ప్రకారం ఏ విధమయినదో అతని మనస్సే అతనికి సాక్ష్యం పలుకుతుంది. అది మానవునికి వ్యక్తిగతంగా, సమాజానికి సమిష్టిగా మేలు చేకూరుస్తుందో, కీడు మూడ జేస్తుందో అతని అంతరాత్మే అతనికి బోధపరుస్తుంది. ఆ విచక్షణాజ్ఞానాన్ని, ఆ అవగాహనను, ఆ తారతమ్యాన్ని అంతరాత్మకు ప్రబోధించిన శక్తి దైవిక శక్తి అంటుంది ఖుర్‌ఆన్.

మానవుణ్ణి సృష్టించి, మానవునికి సృష్టి యావత్తు మీద ఆధిక్యతనిచ్చి, ప్రకృతి మొత్తాన్ని పరిపాలించగలిగిన సత్తానిచ్చి పంపిన దేవుడు మనిషిని అజ్ఞానపు చీకట్లల్లో విహరింప వదలలేదు. తన సందేశహరుల్ని, ప్రవక్తల్ని, సంస్కర్తల్ని, బోధకుల్ని పంపాడు. తన సందేశహరుల ద్వారా తన పక్షాన మార్గదర్శక గ్రంథాలనిచ్చి మరీ పంపాడు. ఆ

గ్రంథాలను ప్రవక్తలు బోధించడమేకాక వారి అంతర్యాలను పరిశుద్ధపరచుకునే మార్గాలనూ సూచించాడు. దైవమార్గదర్శకత్వాన్ని తమ వ్యక్తిగత, సాంసారిక, సామూహిక జీవితంలో అనుక్షణం, అడుగడుగునా ఆచరించి ఆదర్శంగా నిలిచారు ఆ ప్రవక్తలు, దేవుని సందేశహరులు. ఆ పరమ ప్రభువు మానవ మార్గదర్శకత్వానికి తన సందేశ గ్రంథాలను, ఆదర్శవంతులయిన సందేశహరుల్ని పంపడంతోపాటు మానవుని అంతరాత్మలో సయితం అంతర్ ప్రేరణ ద్వారా మంచీ చెడుల విచక్షణా జ్ఞానాన్ని బోధించాను అని అంటున్నాడు ఆయన ఈ వచనాల్లో.

ఇన్ని విధాలుగా మానవునికి సన్మార్గాన్ని బోధించిన తరువాత మానవుడు తన్ను తాను చక్కదిద్దుకోకపోతే సంస్కరించుకోకపోతే శిక్షించడం అన్యాయమా? శిక్షించక పోవడమే అన్యాయం! అదే అంటున్నాడు పరమ ప్రభువు– "తన ఆత్మను పరిశుద్ధపరచుకున్నవాడు నిస్సందేహంగా సాఫల్యం పొందాడు" దాన్ని పరిశుద్ధపరచడమంటే ఆత్మను ఉన్నత పరచడం, నిష్ఠాపరత్వానికి దగ్గరగా, దాని కనుగుణంగా ఆత్మను లేవనెత్తడం. దీనికి భిన్నంగా– "దాన్ని అణగద్రొక్కిన వాడు నిష్ఫలుడయ్యాడు" అంటే నైతికంగా ఉన్నత శిఖరాలను అధిరోహించకుండా నైతిక పతనాలకు అణచడం. సఫలత అంటే దేవుని బహుమానాలకు అర్హుడవడం, నిష్ఫలత అంటే దేవుని ఆగ్రహానికి పాత్రుడవడం.

ప్రపంచ విఖ్యాత దుర్మార్గుల్ని వినాశపరిచేముందు, నిష్ఫలతకు గురిచేసే ముందు దేవుడు వారికి అవకాశాలనిచ్చాడు. తమ ఆత్మల ప్రక్షాళనకు, ఆత్మ ఔన్నత్యానికి సన్నద్ధత వారిలో కలగాలని కోరాడు. తన సందేశహరుణ్ణి, మూసా (అ)ని ఫిర్ఔన్ లాంటి దురహంకారి వద్దకు పంపుతూ–

> ఫిర్ఔన్ వద్దకు వెళ్ళు; అతను ధిక్కరించి మితిమీరిపోయాడు, అతనికి చెప్పు, "పరిశుద్ధుడవు అవడానికి నీవు సిద్ధమేనా? నీ ప్రభువు వైపునకు నేను నీకు మార్గం చూపుతాను, ఆయన భయం నీలో కలగటానికి" అని ఆదేశించాడు.
>
> (దివ్యఖుర్ఆన్– అన్నాజిఆత్ : 17–19)

అలాగే మరో చోట ఫిర్ఔన్ పట్ల:

> "మృదు సంభాషణా విధానాన్ని అవలంబించు, అలా అయినా అతను ఉపదేశాన్ని స్వీకరిస్తాడేమో లేక దుష్పరిణామానికి భయపడతాడేమో" (తాహా : 44)

అని పురమాయించాడు.

మంచి వైపునకు ఎవరిని పిలిచినా వారిలోని అంతరాత్మను ప్రేరేపించాలన్నది దైవికమయిన పద్ధతి, అదే పద్ధతి మానవులు సయితం అనుసరించాలి. ఆత్మ పరిశుద్ధత, ఆత్మ ప్రక్షాళన, సన్మార్గ గమనంలో తొలిమెట్టు. ఆత్మ ప్రక్షాళన జరుపుకోకుండా సన్మార్గాన

ఒక్క అడుగూ వెయ్యలేడు మనిషి. దైవాగ్రహం పట్ల, దుష్పరిణామం పట్ల భీతి ఏర్పడటం, ఆత్మ పరిశుద్ధతకు సన్నద్ధత కనబరచడం మానవుడు దైవికమయిన ఉపదేశాన్ని గ్రహిం చేందుకు సిద్ధంగా ఉన్నాడనడానికి సంకేతం. చెడును మంచి ద్వారానే నిర్మూలించాలని సూత్రీకరించే ఇస్లామ్ బోధనలు, మనిషిని మంచి వైపునకు పిలువడంలోనూ మార్దవాన్ని అనుసరించాలని ఉపదేశిస్తాయి. సంభాషణలోని కరకుదనం వల్ల దుర్మార్గాన్ని అవలం బించే వారిలో మొండితనం, మంకుతనం గట్టిపడే ప్రమాదముంటుంది. అందువల్ల 'నేను మహోన్నత ప్రభువును' అని ప్రకటించిన ఫిర్‌ఔన్‌లాంటి దురహంకారుల ఎడల కూడా మృదుసంభాషణనే ఆయుధంగా ప్రయోగించాలని బోధిస్తుంది దివ్యఖుర్‌ఆన్.

మంచిని పెంచాలని కోరుకునే వారు ఈ దైవిక విధానాన్నే అనుసరించాలి. అదొక్కటే సరయిన పద్ధతి ధర్మసంస్థాపనకు. మనిషిలోని సత్యాన్ని ప్రేమించే గుణాన్ని, మంచిని అభిమానించే లక్షణాన్ని, నిష్పాపరత్వాన్ని వృద్ధిపరిచే తత్వాన్ని జాగృతం చెయ్య గలిగితే మంచిని నిలబెట్టే పని సగం పూర్తి అయినట్లే. మనిషి అంతరాత్మలోని ఈ ఆత్మనైజాన్ని మేలుకొలిపే ప్రయత్నమే సత్యాన్ని స్థాపించే కృషిలోని ప్రథమ సోపానం. మనిషిలోని ఆ ప్రవృత్తిని జాగరూకపరిచే కృషి జరపడమే మంచిని కోరుకునే వారి బాధ్యత; మిగతా కార్యక్రమం మనిషిలోని అంతరాత్మ పూర్తి చేసుకుంటుంది.

(5-3-04)

శాంతి, ప్రేమల సందేశం!

కొందరు మిత్రులు గుజరాత్ ఘోరకలి సంభవించి రెండేళ్ళయిన సందర్భంలో మానవతను జాగరూకపరచడానికి సమావేశం ఒకటి ఏర్పరిచారు. గుజరాత్ దుర్ఘటన జరిగి రెండేళ్ళయ్యాయి. అదొక మాయని గాయమయి, మరుగుపడని మచ్చయై సున్నిత మనస్కులలో వ్యధను కెలుకుతూనే ఉంటుంది. ఆవేదనను రగుల్చుతూనే ఉంటుంది. ఇది ఒక్క ముస్లిమ్ సముదాయానికి సంబంధించిన అంశం కాదు భారతీయ సంస్కృతికి, భారతీయ ఆత్మ స్వరూపానికి చెందిన అంశం. అందువల్ల గుజరాత్ గాయం భారతీయ ఆత్మకు కలిగిన గాయం. భారతీయ సాంస్కృతిక స్వరూపానికి కలిగిన గాయం. దెబ్బతిన్న వారు, గాయపడినవారు, బాధలు అనుభవిస్తున్నవారు, పీడనలకు గురవుతున్నవారు ముస్లిమ్ సముదాయానికి చెందినవారే కావచ్చు. కాని ఆవేదన మొత్తం భారతాత్మ అనుభవిస్తోంది. ఇది ఆ సభ అందజేసిన సందేశం.

ముస్లిములు ఈ దేశంలో దాదాపు వెయ్యేళ్ళుగా నివసిస్తున్నారు. కొత్తవారేమీ కాదు, బయటి వారేమీ కాదు; పరాయివారుకారు, పరదేశీయులూకారు; వైరులు కారు, శత్రువులూకారు. అయినా ఇంచుమించు 60 ఏళ్ళుగా మతకల్లోలాలన్న ఏకపక్ష మారణహోమానికి 'గురి'గా నిలుస్తూ వస్తున్నారు. దాదాపు ఇటువంటి అఘాయిత్యాలకు అలవడిపోయారేమో అనిపిస్తుంది. ముస్లిముల ఈ స్థితికి కారణాలను బయట వెదకడం ఒక ఎత్తయితే వారిలోనే అన్వేషించడం మరో ఎత్తు.

బయటి కారణాలలో ఇస్లామ్, ముస్లిముల పట్ల విద్వేష ప్రచారం చేసే వారి ప్రముఖ పాత్ర కనిపిస్తుంది. కాని అంతకన్నా ముఖ్యమయింది ముస్లిముల అంతరంగిక వ్యవహారం. అదే నేటి పరిశీలనాంశం.

> ఇదే విధంగా మేము మిమ్మల్ని మధ్యస్థ సమాజంగా రూపొందించాము. తద్వారా మీరు మానవులకు సాక్షులుగా నిలువాలని; ప్రవక్త మీకు సాక్షిగా నిలుస్తాడు.
>
> (దివ్యఖుర్ఆన్)

మీరు సముదాయాలలో ఉత్తమమయిన సముదాయం. మానవుల్లో నుంచి ప్రత్యేకంగా ఎన్నుకోబడినవారు. మీరు మంచిని ఆదేశిస్తారు, చెడులను నిరోధిస్తారు, దైవాన్ని విశ్వసిస్తారు. (దివ్యఖుర్ఆన్)

ఇదీ ముస్లిముల ప్రత్యేకత. ముస్లిములు, భారత దేశానికి వచ్చినవారెవరయినా ఈ బాధ్యత నిర్వహించేందుకే వచ్చారు. వారి వ్యక్తిగత ప్రవర్తన, శీల స్వభావాలు, వారి నీతి, నిజాయితీ చూసి ముగ్ధులయిన ఆనాటి భారతంలోని దళితులు, ఉపేక్షితులు, బలహీనులు, సదాత్మీయులు వారికి చేరువయ్యారు. వారితోపాటు కలసిపోయారు. వారి పురుషులకు తమ కూతుళ్ళనిచ్చి పెళ్ళి చేశారు, వారిని తమ అల్లుళ్ళుగా చేసుకున్నారు, వారిని మాప్పిళ్ళై (అల్లుడుగారు) అన్నారు. వారే మనం మోపలాలని పిలుచుకునే కేరళ సోదరులు. కాని ముస్లిములు తమ ఆ కర్తవ్యాన్ని క్రమేణ మరచిపోయారు. పర్యవసానంగా నేడు వెయ్యేళ్ళ పొరుగు, సహవాసం ఉన్నప్పటికీ నేటికీ అపరిచితులుగానే మిగిలిపోయారు.

ముస్లిములు ఈ దేశంలో రాజ్యమేలారు. చిన్న చిన్న జమీందారులు మొదలుకుని నవాబులు, చక్రవర్తుల స్థాయి వరకూ పరిపాలనా రంగంలో ఎంతో గొప్పగా రాణించారు. సాహిత్యం, కళ, సాంస్కృతిక రంగాల్లో ఎన్నో సేవలు అందజేశారు. కొందరు మిత్రులు చెప్పినట్లు, ఎర్రకోటనిచ్చారు, తాజ్‌మహల్‌నిచ్చారు, కుతుబ్ మీనారిచ్చారు, చార్మినార్ ఇచ్చారు, షేర్వానీ ఇచ్చారు, బిర్యానీ ఇచ్చారు. నిజమే. కాని వాస్తవంగా ఇవ్వవలసినదేమిటో అదే ఇవ్వలేదు. భారతీయ హస్తకళను సుసంపన్నం చేశారు; సంగీత, చిత్ర, శిల్పకళల్లో తమదయిన ఓ ప్రత్యేక శైలిని, స్థానాన్నీ ఏర్పరచుకున్నారు. సాహిత్య రంగంలో ఎనలేని సేవలు చేశారు. భారతదేశానికే కాదు ప్రపంచానికి కూడా గర్వకారణమయ్యే ఓ అంతర్జాతీయ భాషను, మధురమయిన భాషను, 'ఉర్దూ'ను అందజేశారు. ఇవి సాధారణ మయిన సేవలు కావు. నిజమే, ఇందులో సందేహం లేదు. కాని తమ కర్తవ్యాన్ని మరచి పోయారు!

ఇస్లామ్ ఒక సర్వజనీనమయిన, సర్వకాలికమయిన ధర్మమని, ఇది శాంతిని, ప్రేమను పెంచే సందేశమని, మానవాళిని ఏకం చేసే సిద్ధాంతమని భారతీయ ప్రజలకు అవగతపరచలేకపోయారు. ఖుర్ఆన్, విద్వేషాన్ని కాదు, అనురాగాన్ని పంచిపెట్టే గ్రంథ మని, విభేదాలు సృష్టించడం కాదు, ఐక్యతా మార్గాలను తెరువడం దాని లక్ష్యమని ఎరుకపరచలేకపోయారు. ఖుర్ఆన్‌ని అవలంబించే వ్యక్తి శీలస్వభావాలు, ప్రవర్తనలు, ఆచార వ్యవహారాలు ఎలా ఉంటాయో తమ వ్యక్తిగత, సామూహిక జీవితం ద్వారా ఆచరణాత్మకంగా ప్రదర్శించలేకపోయారు. ఫలితంగా దుష్ప్రచారం చెయ్యగోరేవారి

పాచికలు పారాయి, విద్వేష విషాన్ని వ్యాపింపజెయ్యగోరేవారి పంట పండింది. మతం పేరిట మారణహోమాలు దేశమంతటా పెచ్చరిల్లాయి.

ఎన్ని ప్రాణాలు పోయాయో, ఎందరు మానవతులు తమ సర్వస్వాన్నీ కోల్పోయారో, ఎందరు పిల్లలు తల్లిదండ్రులను ధారబోసి నిరాశ్రయులయ్యారో, ఎన్ని కుటుంబాలు సర్వనాశనమయ్యాయో, భర్తలుపోయిన వితంతువులు, తండ్రిలేని అనాధలు ఎందరు దిక్కుతోచని స్థితిలో అగోచర గమ్యం కోసం కళ్ళప్పగించి అన్వేషించారో, ఈ లెక్క ఎవరడగాలి? అడిగినా చెప్పేవారెవరు? కాని ఇదంతా ముఖ్యం కాదు. ముస్లిములు తమను తాము పరిచయం చేసుకోలేకపోతే, తమ ధర్మాన్ని, తమ సిద్ధాంతాలను, తమ ఆచార వ్యవహారాలను పారదర్శకంగా అందరికీ చూపెట్టకపోతే ఎన్ని గుజరాతులయినా జరగవచ్చు. వాటిని అరికట్టే విధానం ఒక్కటే, శాంతి ప్రేమల సందేశం, ఇస్లామ్ సందేశం అరమరికల్లేకుండా, హెచ్చుతగ్గుల్లేకుండా ప్రజలందరికీ అందుబాటులో తీసుకురావాలి. అదే ఏకైక సఫలతా మార్గం- ఇహంలోనూ పరంలోనూ!

(12-3-04)

కర్తవ్యం పిలుస్తోంది!

విశ్వసించినవారలారా, అల్లాహ్‌కు భయపడండి, ఆయనకు భయపడవలసిన రీతిలో. మీరు ముస్లిములుగా ఉన్న స్థితిలోనే తప్ప మీకు మృత్యువు ఆసన్న మవరాదు. అల్లాహ్ ధర్మపాశాన్ని అందరూ కలిసి పటిష్టంగా పట్టుకోండి, విభేదాలకు లోనవకండి, అల్లాహ్ మీకు చేసిన మహోపకారాన్ని గుర్తుంచుకోండి. మీరు పరస్పరం శత్రువులయి ఉండగా ఆయన మీ మనస్సులను సన్నిహితం చేశాడు, కాగా, ఆయన కృపానుగ్రహాల వల్ల మీరు సోదరులుగా అలరారారు. మీరు ఒక నిండయిన నిప్పు గుండం అంచున ఉండగా అల్లాహ్ మిమ్మల్ని దాన్నుండి కాపాడాడు. ఈ విధంగా అల్లాహ్ తన సూచనలను మీ ముందు ప్రకాశమానం చేస్తాడు- బహుశా వీటి ద్వారానయినా మీకు సాఫల్యానికి సన్మార్గం కానవస్తుందేమోనని. మీలో కొందరు మంచి వైపునకు పిలిచేవారు, సత్కార్యాలను ఆదేశించేవారు, దుష్కార్యాలను నిరోధిస్తూ ఉండేవారు తప్పనిసరిగా ఉండాలి. ఈ కార్యాలు చేసే వారే సాఫల్యం పొందేవారు. వర్గాలు వర్గాలుగా చీలిపోయి నటువంటి వారిలా, ప్రస్ఫుటమయిన బోధనలు పొందిన తరువాత మళ్ళీ విభేదాలకు లోనయినటువంటి వారిలా మీరున్నూ రూపొందేరు సుమా! ఈ వైఖరినవలంబించిన వారు ఆ రోజున కఠిన శిక్షకు పాత్రులవుతారు.

(దివ్యఖుర్‌ఆన్-ఆలి ఇమ్రాన్ : 102-105)

ఈ ఆయత్ (వచనా)లు, ముస్లిముల ఆంతరంగిక స్థితిని, వారి ప్రవర్తనను, విధినిషేధాలను, బాధ్యతల్ని, కర్తవ్యాలను, ఫలితంగా కలిగే పరిణామాలను కొన్నింటిని స్పష్టంగా నిర్వచిస్తున్నాయి. నేడు ముస్లిములు ఆత్మ పరిశీలనతోపాటు చిత్తశుద్ధితో ఆత్మ ప్రక్షాళనకు పూనుకుంటే ఈ ఆయత్‌లలో వారికి దారిచూపే మార్గనిర్దేశాలెన్నో ఉన్నాయి.

నేడు ముస్లిముల చుట్టూ నెలకొన్న పరిస్థితులు, వాటి పట్ల ముస్లిముల నిరాసక్తత, స్తబ్దత, ముస్లిముల్లో పేరుకుపోయిన నైరాశ్యం, వైరాగ్యం, అన్నీ పటాపంచలయిపోతాయి– కాస్త ఈ వచనాలను శ్రద్ధగా అర్థం చేసుకుంటూ ఏకాగ్రతతో ఆచరించే ప్రయత్నం చేసినట్లయితే!

మొదటి ఆదేశం దైవానికి భయపడుతూ జీవితం గడపాలని. దైవం, మానవాళి పట్ల ప్రేమైకమూర్తి ఆయనకు భయపడటమేమిటీ? ఆయన అనునిత్యం మానవుల్ని కనిపెట్టుకునే ఉన్నాడు, మానవులు చేసే ప్రతి చిన్న పని అయినా ఆయన దృష్టికి మరుగుపడి లేదు. కడకు మానవుల మనస్సుల్లో మెదిలే ఆలోచనల్ని సయితం ఆయన కనిపెట్టుతూనే ఉన్నాడు. అందువల్ల సదా ఆయన అనుగ్రహం పొందేందుకు, ఆగ్రహానికి పాత్రులవకుండా ఉండేందుకు ప్రయత్నిస్తూ ఉండాలి.

రెండవ అంశం, మానవులు చివరి శ్వాస వరకూ ముస్లిములయి, అంటే దైవాజ్ఞా బద్ధులయి, దైవవిధేయులయి జీవించాలి అన్నది. ఆ తరువాత అందరూ కలసి ధర్మాన్ని సామూహికంగానూ ఆచరించాలి అని ఆదేశించడం జరిగింది. దైవవిశ్వాసులు చెట్టుకొకరు, పుట్టకొకరుగా జీవించేందుకు అవకాశం లేదు. వారంతా కలసికట్టుగా జీవించాలి, సంఘటిత వ్యవస్థను రూపొందించుకుని దానికనుగుణంగానే జీవించాలి. వ్యక్తిగత శీల నిర్మాణం, సామూహిక సత్సమాజ నిర్మాణానికి దోహదపడకపోతే దాని ఉపయోగమే లేదు. సుసంఘటిత వ్యవస్థను పటిష్టంగా పాటించాలని సకారాత్మకంగా చెప్పడమేకాక, నకారాత్మకంగా 'విభేదాలకు లోనయి', 'చిందువందయి' జీవించకండి అని కూడా బోధించడం జరిగింది.

ఆ తరువాత, ఇస్లామ్ ఆవిర్భావానికి పూర్వం అరేబియా భూభాగంలో నెలకొని ఉన్న పరిస్థితిని ప్రస్తావించి, పరస్పరం శత్రువులయి, రక్తపిపాసులయి ఉన్న వారిలో దైవధర్మం, సమానతా భావాన్ని, ఏకతాభావాన్ని ఎలా సృజించిందో సానుభూతి, దయ, కరుణ, ప్రేమానురాగాలతో వాతావరణమంతా ఎలా సరికొత్త రూపు ధరించిందో, అగ్నిగుండం, ఉద్యానవనంలా ఎలా మారిపోయిందో ఎత్తి చూపడం జరిగింది. ఒక దేశకాల పరిస్థితుల్లో మానవుల మధ్య ఇది సాధ్యమయినప్పుడు ఏ దేశంలో, ఏ కాలంలోనయినా ఇది ఎందుకు సాధ్యమవదు, ఈ చారిత్రక ఘటనల ద్వారా గుణపాఠం గ్రహించి సాఫల్య మార్గాన్ని కానగలగాలి అన్నది ఈ ఆదేశంలో గల ఉద్దేశం.

ఇలా వ్యక్తిగత సంస్కరణ, నైతిక ప్రక్షాళన, ఆత్మవికాసాలకు సంబంధించిన సూచనలు, సామూహిక జీవిత నిర్మాణానికి ఆదేశాలు అందజేసిన తరువాత అతి ముఖ్యమయిన బాధ్యత, కర్తవ్యం వైపునకు విశ్వాసుల దృష్టిని మళ్ళించడం జరిగింది. మానవులు సదాచారులు, సంస్కారవంతులు, నీతిమంతులుగా జీవించడం, తమ వ్యక్తిగత

సాంఘిక వ్యవహారాలను ఆ నియమాలకనుగుణంగా తీర్చిదిద్దుకుని మనుగడ సాగించడంతో సరిపోదు. వారు సుసంఘటితమయి అత్యున్నత స్థాయి సామూహిక వ్యవస్థను రూపొందించుకున్నా సరిపోదు.

ఆ వ్యవస్థ సవ్యంగా, సజావుగా, సువ్యవస్థగా సమృద్ధిగా ప్రగతీ వికాసాలు సాధించాలంటే ఆ సమాజంలో ఒక వర్గం సత్కార్యాలాచరిస్తూ సత్కార్యాలను ఆదేశించే వారిది, మంచిని బోధించే వారిది, చెడును అరికడుతూ, దుష్కార్యాలను నిరోధించే వారిది తప్పక ఉండాలని చెబుతోంది ఖుర్ఆన్! అదే పరిపూర్ణ సాఫల్యానికి మార్గం అంటోంది!! అలా జరగకపోతే సమాజం వర్గాలు వర్గాలుగా చీలిపోతుందని, దైవగ్రంథం, ప్రవక్త మార్గదర్శకత్వం, ఆయన ఆదర్శ జీవితం తమ మధ్య ఉన్నప్పటికీ విభేదాలకు లోనయి సమాజం ఛిన్నాభిన్నమయిపోతుందని గట్టిగా హెచ్చరిస్తోంది ఖుర్ఆన్.

నేడు సమాజంలో నెలకొని ఉన్న పరిస్థితులు, ముస్లిమ్ సమాజం లోనయి ఉన్న అనిశ్చితావస్థను గమనిస్తే, ముస్లిమ్ సముదాయం తన కర్తవ్యాన్ని విస్మరించడం మూలానే ఇదంతా ఈ విధంగా రూపొందిందని బోధపడుతోంది. సమాజంలో ఎల్లెడలా అవినీతి, నీతిబాహ్యత విలయ తాండవం చేస్తోంది. కుటుంబ వ్యవస్థ దారి తోచని స్థితిలో అగమ్య గోచరంగా రకరకాలుగా దుర్వ్యవస్థకు లోనయి నలిగిపోతోంది. ఆర్థిక వ్యవస్థ పెట్టుబడి దారులనబడే దోపిడీదారుల చేతుల్లో కీలుబొమ్మగా మారిపోయి నిరుపేదల పాలిటి అభిశాపంగా, ధనవంతుల సౌభాగ్య సౌధంగా రూపాంతరం చెందింది. రాజకీయాల్లో ప్రజాసేవాభావం లుప్తమయి అధికార పిపాస, కులమత తత్వాలు, సంకుచిత భావాలు, ఫాసిస్టు ధోరణులు చోటుచేసుకున్నాయి. అయినా ముస్లిమ్ సముదాయానికి చీమ కుట్టి నట్టయినా లేదని ఇట్టే గ్రహించవచ్చు. ప్రపంచ సముద్ధరణకు ప్రభవింపజేయబడిన సముదాయం తన ఉనికికిగల పరమార్థాన్ని మరచి, తన సమస్యల్లోనే మునిగి తేలుతూ సహాయానికి అర్రులుచాచే దురవస్థకు లోనయి ఉంది! ఎంత దౌర్భాగ్యం, ఎంతటి అనూహ్యమయిన అంధకారం!!

(19-3-04)

మానవ ఔన్నత్యం

ఇస్లామ్ మూలతః ఆధ్యాత్మిక, భౌతిక తత్వాల మేలు కలయిక. ఆధ్యాత్మిక వికాసానికి, భౌతిక కార్యకలాపాలు తోడ్పడాలి, భౌతిక అవసరాల పరిపూర్తిలో ఆధ్యాత్మిక చింతన దారి చూపాలి అని అంటుంది ఇస్లామ్. ఆధ్యాత్మికత ఏ స్థాయిలోనూ లౌకిక వ్యవహారాల నిర్వహణలో అడ్డురాకూడదు. భౌతిక మార్గాల అన్వేషణ ఏ రూపంలోనూ ఆధ్యాత్మిక సాధనకు అంతరాయం కలిగించరాదు. రెంటిలో సమతూకం, సమన్వయం, సామంజస్యం, సామరస్యం సాధించినదే పరిణతి చెందిన ఇస్లామీయ జీవితం. ఇస్లామ్ నేర్పిన ప్రార్థనల్లో ఒక ప్రముఖ ప్రార్థన-

రబ్బనా ఆతినా ఫిద్దున్యా హసనతన్
వ ఫిల్ ఆఖిరతి హసనతన్
వకినా అజాబన్నార్!

మా ప్రభూ! మాకు ప్రపంచంలోని మేళ్ళనూ ప్రసాదించు
పరలోకంలోని మేళ్ళనూ అనుగ్రహించు
మమ్మల్ని ఎట్టకేలకు నరకాగ్ని నుండి కాపాడు.

ఈ ప్రార్థన ముస్లిములకు బోధించేది, ఇస్లామీయ శిక్షణల సారం చూపేది, ఇస్లామీయ జీవన విధానం పయనింపజేసేది ఒకే రాచబాట, ఒకే గమ్యం, ఒకే లక్ష్యం. ప్రపంచ జీవితంలో మనిషి, సమస్త లౌకిక కార్యకలాపాలలో పాల్గొంటూ పరలోక సాఫల్యం సాధించేందుకు కృషి చేయాలి. ఆ కృషిలో మానవ సహజ దౌర్బల్యాల వల్ల లోటుపాట్లు సంభవిస్తాయి. అవి సంభవించకపోతే మానవుడు మానవుడు కాడు, దైవదూతలలో చేరిపోతాడు. చేరిపోవడం సాధ్యం కాకపోయినా, అలా చేరిపోవడం మానవ ఔన్నత్యానికి

చిహ్నం కాదు. దైవదాస్యమే మానవ ఔన్నత్యానికి పరమోన్నత సోపానం. ఆ దైవ దాస్యం నిర్వహణలో లోపాలు జరగడం, తప్పులు దొర్లడం కూడా మానవీయతకు నిదర్శనం. అలా వాటిల్లే కొరతలను మన్నించి "నరకాగ్ని నుండి కాపాడే" వేడుకోలు చేసుకోవడం లోనే దాగి ఉంది మానవుని ఘనత!

భౌతిక, ఆధ్యాత్మికతల సమంజస సంగమమయిన ఇస్లామీయ జీవన విధానంలోని ఈ విశిష్టతను తెలుసుకోవడం ఇస్లామ్‌ను నిశిత దృష్టితో అధ్యయనం చేసిన ప్రతి పవిత్రాత్మకు సుసాధ్యమవుతుంది. వివేకానందులవారు అలా అధ్యయనం చేసిన మహనీయుల్లో ఒకరని నిష్కర్షగా చెప్పవచ్చు. ఆయన తన రచనల్లో ఆధ్యాత్మిక, భౌతిక తత్వాలతో సమన్వయం ఆవశ్యకతను చర్చించిన ఒక సందర్భంలో ఓ చోట ఇస్లామ్‌లోని ఈ ప్రత్యేకతను గమనించారు, గుర్తించారు. అలా పరిపూర్ణ సామరస్యంతో భౌతిక, ఆధ్యాత్మిక తత్వాలను సమన్వయపరచిన మతం మరొకటి ఏదీ తన దృష్టికి రాలేదని కూడా ఆయన అన్నారు.

ఇస్లామ్‌లోని ఈ సర్వవ్యాపక గుణం కారణంగానే ముస్లిములు తమ జీవితంలో లౌకిక వ్యవహారాలు వేరని, మతైక వ్యవహారాలు వేరని విభజించలేదు. వారి విశ్వాసాలు, ఆరాధనలు, పారలౌకిక సాధనాలు ఎంతగా మతపరమయినవో అంతగానే వారి వివాహాది కార్యాలు, కుటుంబ సమస్యలు, సామాజిక సంబంధాలు సయితం, ఆర్థిక రాజకీయ వ్యవహారాలు సయితం మత పరిధికి వెలుపల లేవు. మతంతోనే ముడివడి ఉన్నాయి. సాధారణంగా పాశ్చాత్య మతభావనల్లోనూ, ఇస్లామేతర మతభావనల్లోనూ మానవుని జీవితంలోని లౌకిక, మతైక వ్యవహారాలు వేర్వేరుగా విభజించబడి ఉన్నాయి. అందువల్ల సర్వసాధారణంగా లౌకిక విషయాలుగా పరిగణించే వ్యవహారాలన్నింటిలో ముస్లిములు సహజంగానే, మతం ప్రస్తావన తెచ్చి మత నిర్దేశాలను ఎత్తిచూపగానే పాశ్చాత్య భావ జాలానికి ప్రభావితులయిన వారంతా చిర్రున లేస్తారు. ముస్లిములు లౌకిక వ్యవహారాల్లోనూ మతాన్ని ఈడుస్తారని ఎత్తి పొడుస్తారు.

ముఖ్యంగా రాజకీయాల మాట ఎత్తగానే అది పూర్తిగా లౌకిక వ్యవహారమని అందరూ తలుస్తారు. అందులో వారి తప్పులేదు. అది వారి మతభావన కారణంగా ఏర్పడిన అభిప్రాయం. కాని ముస్లిముల విషయం అలా కాదు. వారు అనుసరించవలసిన రాజకీయ పంథాను సయితం వారి మతధర్మాలు సవివరంగా బోధిస్తాయి. ఫలితంగా వారి రాజకీయాలూ మతాతీతమయినవి కాజాలవు. రాజకీయాలకు సంబంధించిన పాశ్చాత్య వైఖరి ఇటీవల, దాదాపు గత వందేళ్ళుగా బాగా ప్రచారంలోకి వచ్చింది. పాశ్చాత్యుల భావాలు, తత్వాలు, నాగరిక సాంస్కృతిక నియమాలు ఇక కేవలం పాశ్చాత్యుల వరకే పరిమితం కాలేదు; గత శతాబ్ది కాలంలో ప్రపంచమంతా విస్తరిల్లి ప్రపంచంలో

ఆమోదం పొందిన, సశాస్త్రీయ పంథాగా గుర్తింపు పొందాయి. పర్యవసానంగా రాజకీయాల్లో మతాన్ని, మతధర్మాలను ప్రస్తావించడం "మూఢత్వం, మధ్యయుగాల నాటి మాట" గా వినుతికెక్కింది. ఈ ఆలోచనా విధానం ఎంత విస్తృతంగా బలోపేతంగా ప్రబలి పోయిం దంటే సాధారణ ముస్లిములు, పాశ్చాత్య నాగరికతా సేవకులే కాదు, ముస్లిముల ధార్మిక జనం, మత గురువులు, పండితులు, ధర్మవేత్తలూ అందరూ– "అబ్బే, ఇస్లామ్‌లో రాజకీయాలకు పనేమిటీ, మతం పూర్తిగా ప్రయివేటు వ్యవహారం, అది రాజకీయాల్లో పల్లెత్తుమాట అనడానికి వీల్లేదు" అనసాగారు!

"పాశ్చాత్య" భావజాలాన్ని ఏవగించుకునే "ప్రాచ్య" ప్రముఖుల్లోనూ ఈ "అప్రాచ్యపు" భావాలు బాగా పాదుకుపోయాయి. ఇది "అప్రాచ్యం" అని కూడా గుర్తించడం లేదు. పాశ్చాత్య రాజకీయ ప్రాబల్యం కారణంగా పాశ్చాత్య నాగరికత, పాశ్చాత్య సామాజిక మర్యాదలే కాదు పాశ్చాత్య తాత్విక చింతన, పాశ్చాత్య ఆలోచనలు, పాశ్చాత్య ఆలోచనా విధానాలు సయితం పోల్చుకోలేనంతగా మనలో కలసిపోయాయి; ఇంకా మన నరనరాల్లో జీర్ణించుకుపోయాయంటే తప్పు కాదు. అందువల్లనే ధార్మిక జనులు, 'మతం' బోధించ వలసిన పెద్దలు, రాజకీయ వ్యవహారాలలో నాయకత్వం వహించడం అలా ఉంచి ఎప్పు డయినా పొరపాటున రాజకీయ విషయాల్లో నోరు విప్పినా ఆకాశం విరుచుకుపడినట్లు, భూమి బ్రద్దలయినట్లు దేశమంతా కాకిగోల మొదలవుతుంది.

ఇటువంటి వాతావరణంలో ముస్లిముల ధార్మిక నాయకులు రాజకీయాలలో తలదూర్చి, మార్గదర్శకత్వం కోసం ధార్మిక బోధనల్లోకి పరికించి చూడాలని, 'లౌకిక' సమస్యల పరిష్కారం కోసం "మతబోధన" లోనే అన్వేషించాలని, మతానికి, లౌకిక జీవితంలో కనీసం 'పెద్ద' పీట అయినా వేయాలని అంటే ఒక్క పట్టున జీర్ణమవుతుందా? ఉవ్వెత్తున ఉప్పెన లేవకుండా ఉంటుందా?? ఇటువంటి "అప్రాచ్య" ప్రభావాలను సమాజం ఒక్క క్షణమయినా సహిస్తుందా???

(26-3-04)

ఉపద్రవం రానున్నది

(విశ్వసించినవారలారా,) ఆ ఉపద్రవం నుండి రక్షించుకోండి, దాని విపత్తు కేవలం ప్రత్యేకంగా మీలో అపరాధులయిన వారి వరకే పరిమితం కాదు. తెలుసుకోండి, అల్లాహ్ ఎంతో కఠినంగా శిక్షించేవాడు.

(దివ్యఖుర్ఆన్–అల్ అన్ఫాల్ : 25)

సముదాయాలపైన విపత్కర పరిస్థితులు దాపురించినప్పుడు దైవికంగా సామూహిక శిక్షలు విధించబడినప్పుడు, ఆ శిక్ష ప్రత్యేకంగా సమాజంలో దుష్టులయిన వారి వరకే పరిమితం కాదు. సమాజంలో సదాచార సంపన్నులుగా, ఉత్తమ గుణశీలురుగా, ఎవరి జోలికీ పోనివారుగా, దుష్టులయినా, శిష్టులయినా అందరితో సఖ్యంగా మెలిగేవారుగా, తమ చుట్టూ జూదరులు, త్రాగుబోతులు, వ్యభిచారులు, ఎందరు ఎన్ని విధాలుగా సమాజాన్ని లోలోనే గుల్లచేస్తూ ఉన్నా పల్లెత్తుమాట పలకని వారుగా, సమాజంలో దుర్మార్గం, దౌర్జన్యం, పీడన, అత్యాచారం, అక్రమాలు పెచ్చురిల్లి మానవత వీధివీధినా విలవిల్లాడుతూ కనబడినా పట్టించుకోని వారుగా, పెద్ద మనుషులుగా, మంచివారుగా చెలామణి అయ్యేవారు అధికమయినప్పుడు, ప్రకృతి ప్రకోపిస్తుంది. దైవాగ్రహం సమాజం పైన ఆపదగా వర్షిస్తుంది. ఇది ప్రపంచ చరిత్రలోని అఖండనీయమయిన అనుభవం.

హేతువు కోరేదీ, న్యాయం శాసించేది, ప్రపంచమంతా ఆమోదించేది ఒకే సూత్రం. నేరం చేసినవాడికే శిక్షపడాలి. నేరానికి శిక్ష, నేరానికి తగిన శిక్ష, నేరస్థులకే పరిమితమయిన శిక్ష న్యాయబద్ధం. అపరాధం చేసినవారు మనుషుల ఒక వర్గమయితే ఆ వర్గానికే శిక్షపడాలి. కాని పై ఆయత్ మరో విధంగా ప్రకటిస్తోంది. ఈ అంశమే నేడు మనం లోతుగా పరిశీలించవలసి ఉంటుంది. అపరాధులయిన వారికి మాత్రమే శిక్షపడక మరెవరి నయినా శిక్షా పరిధిలోకి చేర్చడం సక్రమమవుతుందా? పరమోన్నత న్యాయ శీలుడయిన స్వామి, విశ్వప్రభువు, మన దైవం అపరాధులేకాక మరెవరెవరిని ఆ శిక్షకు

గురిచేయనున్నాడు?? మరెవరినయినా శిక్షించడం ఎలా హేతుబద్ధమవుతుంది, ఎలా సమంజసమవుతుంది, ఎలా న్యాయవంతమవుతుంది???

అపరాధం జరుగుతూ ఉంటే, హర్షం వ్యక్తం చేసేవారు నేరాన్ని చూసి కళ్ళప్పగించి చూస్తూ ఉండిపోయేవారు, నేరం జరుగుతూ ఉండగా చూస్తూ దాన్ని ఆపకపోగా, తమకు పట్టనట్టు, తమతో సంబంధం లేనట్టు వ్యవహరించేవారు, అపరాధాన్నీ, అపరాధుల్ని ఏవగించుకున్నా, తమదాకా రానంతవరకు కలుగజేసుకోవడం తమ బాధ్యతకానట్టు నడుచుకునేవారు- ఇలాంటి వారు సయితం నేరాన్ని పరోక్షంగా ప్రోత్సహిస్తున్నట్లే అన్నది సాధారణ బుద్ధిజ్ఞానాలున్న వారెవరయినా ఒప్పుకుంటారు. అపరాధ బుద్ధి వ్యాప్తికి ఇతర పరిస్థితులతోపాటు, ఇటువంటి నిర్లిప్తతా భావం నిండిన వారు సమాజంలో అధికమవడం కూడా ఒక కారణమన్నది వివేకం సూచించే సత్యం. అందువల్ల అపరాధం చేసినవారితో పాటు అపరాధాన్ని సహించి భరించేవాడు కూడా నైతికంగా నేరస్థులే, శిక్షార్హులే అనిపిస్తుంది. అలా అనిపించడమే కాదు, ఇది నైతికంగా సక్రమమే, న్యాయమే అని కూడా అంటుంది దైవ వచనం.

ప్రవక్త మహనీయులు (స) తన బోధనల్లో ఒక చోట ఇలా అన్నారు, "చెడు జరుగుతూ ఉండగా చూస్తే దాన్ని చేత్తో (అంటే శక్తితో) ఎదుర్కొని ఆపాలి. ఏ కారణం వల్లనయినా దాన్ని అలా ఆపడం సాధ్యం కాకపోతే నోటితో జరుగుతున్నది 'చెడు' అని ప్రకటించాలి, (చెడు అని అందరికీ తెలియజెయ్యాలి, ప్రజాభిప్రాయం మలచడం ద్వారా దాన్ని నిరోధించాలి). అదీ సాధ్యపడకపోతే మనసులో అది చెడు అని, దాని పట్ల ఏహ్యభావం కలిగి ఉండాలి. ఇది విశ్వాసానికి అధమ స్థాయి."

మనిషి తొలి రెండు అవకాశాలను ప్రయత్నించకుండానే, అంటే బలాన్ని ఉపయోగించి చెడును ఆపడం, లేదా ప్రజాభిప్రాయాన్ని ఆ చెడుకు వ్యతిరేకంగా మలచడం, రెండు విధానాలనూ ప్రయోగించకుండానే మూడవ స్థానానికి దిగి కూర్చోవడం విశ్వాసమున్న ఏ వ్యక్తికీ తగిన పద్ధతి కాదు. అలా దిగజారడం వల్ల దోషులలో తమకు తిరుగు లేదన్న దురహంకారాన్ని పెంచుతుంది. నేర ప్రవృత్తి వృద్ధి చెందుతుంది, సమాజం నేరాలతో కంటకప్రాయమయిపోతుంది. ఈ కారణంగానే నేరస్థుని చెయ్యి పట్టుకోలేక పోయిన చెయ్యిని సయితం, నేరం చేసిన చెయ్యితో పాటు శిక్షించడం అవసరం. అయితే ఆ శిక్ష దైవికంగా, సామూహిక ఉపద్రవాల రూపంలో సంభవించడం తథ్యం అంటుంది ప్రస్తావనలోని వచనం.

సమాజంలో చెడు మితిమీరిపోయినప్పుడు సంభవించే దైవికమయిన ఉపద్రవాలు నిత్యం భూకంపాల రూపంలో, కరవుల రూపంలో, ఉప్పెనల రూపంలో, వరదల

రూపంలో మాత్రమే రావు. యుద్ధాల రూపంలో, అలజడుల రూపంలో, వాణిజ్య వ్యాపార కార్యకలాపాల మాంద్యం రూపంలో, క్రింది స్థాయి నుండి పైస్థాయి వరకు దుష్టపాలకుల అధికారం రూపంలో ఇది దాపురిస్తుంది. ముఖ్యంగా సామాజిక వ్యవహారాలలో ప్రముఖ పాత్ర వహించేటటువంటి పరిపాలనా వ్యవహారాలలో, సమాజ వ్యతిరేక శక్తులు ఆధిక్యత సాధించడం కూడా దైవికమయిన శిక్షే అని హదీసుల ద్వారా తెలుస్తోంది. అటువంటి విపత్తులు ఉపద్రవాలు రాకముందే జాగ్రత్తపడటం మానవమాత్రులమయిన మనందరి కర్తవ్యం.

దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న దానికి మరో రూపం, చీకట్లు ఆవరించక పూర్వమే జాగ్రత్తపడటం! నేడు సమాజంలో దాదాపు అన్ని అంగాలలో, అన్ని రంగాలలో 'చెడు' అన్నది బహురూపధారిణి అయి దర్శనమిస్తోంది. ఈ సర్వవ్యాపకమయిన 'చెడుగు'ను చూసి అనేక మంది భీతావహులయి మూలల్లోకి వెళ్ళి దాక్కున్నారు. తాము సజ్జనులుగా, సదాచారులుగా, సౌజన్యమూర్తులుగా అలరారితే సరిపోతుంది; తమ ఇంట సమస్త పారిశుద్ధ్యపు నియమాలు పాటిస్తే తమ ఇంటికి మహమ్మారి సోకదని, తమ ఇంటిని కాపాడుకుంటే వీధిలో వ్యాపిస్తున్న మంటల నుండి తప్పించుకోవచ్చని భ్రమలకులోనయి ఉన్నారు. తమతోపాటు తమ పరిసరాలను చక్కబరచడం, ఇంకా సుదూరాన ఉన్న 'చెడుగు'ను నిరోధించడానకి నడుంకట్టుకోవడం జరగకపోతే వచ్చే మహమ్మారి అయినా, అగ్ని కీలలయినా మనల్ని దయతలచి వదలిపెట్టవని గుర్తించాలి.

సజ్జనులూ, సౌశీల్యవంతులూ, పరిశుద్ధచరితులూ, జ్ఞాన సంపన్నులూ, పవిత్రతా మూర్తులూ మూలల్లో దాక్కోవలసిన సమయం కాదిది. రొంపిలోకి దిగి వస్తున్న వెల్లువ నుంచి సమాజాన్ని కాపాడేందుకు తమ వంతు పాత్ర నిర్వహించవలసిన తరుణం ఆసన్న మయింది. లేకపోతే ప్రకృతి క్షమించదు. దేవుడు వదలిపెట్టడు, మహనీయ ముహమ్మద్ (స) సెలవిచ్చిన ఒక ప్రవచనం ప్రకారం సమాజ సముద్ధరణకు ముందుకు రావలసిన వారు వెనక మూలల్లో దాక్కున్నప్పుడు, ఆసన్నం కానున్న ఉపద్రవాన్ని ఆ నచ్చీలుర నుంచే ప్రారంభిస్తాడు దేవుడు. జాగ్రత్త!

(విశ్వసించినవారలారా,) ఆ ఉపద్రవం నుండి రక్షించుకోండి, దాని విపత్తు కేవలం ప్రత్యేకంగా మీలో అపరాధులయిన వారి వరకే పరిమితం కాదు. తెలుసుకోండి, అల్లాహ్ ఎంతో కఠినంగా శిక్షించేవాడు.

(దివ్యఖుర్ఆన్-అల్ అన్ఫాల్ : 25)

(2-4-04)

భవితవ్య రచన

ప్రతి మానవుని భాగ్యతంత్రం మేము అతని కంఠంలోనే వ్రేలాడదీసి పెట్టాము, మరి ప్రళయ దినాన మేము అతనికి చెందిన ఒక గ్రంథస్థ పత్రం వెలికితీస్తాము, దాన్ని తెరచిన పుస్తకంగా అతను కనుగొంటాడు. చదువు, నీ ఆచరణాపత్రం, నీ లెక్క కట్టడానికి నేడు స్వయంగా నీవే చాలు. ఎవరయితే రుజుమార్గాన్ని అవలంబిస్తాడో అతని రుజుమార్గగమనం అతనికే మేలు చేస్తుంది, మరెవరయితే అప మార్గం పడతారో వారి అపగమనానికి శాస్తి వారిపైనే పడుతుంది. ఏ భారం మోసే వాడున్నూ ఇతరుల భారాన్ని మోయడు. (జనులకు సత్యాసత్యాల వ్యత్యాసాన్ని బోధించడానికి) ఒక సందేశహరుణ్ణి పంపనంతవరకు మేము శిక్ష విధించేవారము కాము. (దివ్య ఖుర్‌ఆన్- బనీ ఇస్రాయీల్ : 13-15)

ఇది దైవ వచనం. ఒక్క మానవుడయినా ఒక మానవ సముదాయమయినా సూత్రప్రాయంగా విషయం ఇంతే. అంటే వ్యక్తుల లేక జాతుల సౌభాగ్య దౌర్భాగ్యాలు ఎవరో వ్రాసిపెట్టలేదు. మానవులయినా సముదాయాలయినా తమ వైఖరుల వల్ల తామే వ్రాసుకుంటారు. తమ గుణగణాల ద్వారా, తమ శీలస్వభావాల ద్వారా, తమ నిర్ణయాలు, ఎన్నికల ద్వారా, తమ శక్తిసామర్థ్యాల వినియోగం ద్వారా తాము ఎటు పయనించ దలిచారో, ఎక్కడికి చేరదలిచారో, ఏమి సాధించదలిచారో జాతులు స్వయంగానే పథక రచన చేసుకుంటారు. మంచి భవిష్యత్తుకయినా ఉత్తమ వర్తమానం కోసమయినా, మనిషి అయినా జాతి అయినా కృషి చేసినదేదో అదే ఎదురు వస్తుంది, అదే దర్శనమిస్తుంది.

తమ భవితవ్యం కొరకు సముదాయాలు బయటివారినెవరినో నిందిస్తాయి. పరదేశీయులు తమపైన దురాక్రమణ జరిపారని, తమను దోచుకుపోయారని, తమను

కొల్లగొట్టారని, తమను సంహరించారని, తమను లోబరచుకున్నారని, తమను బానిసల్లా చేసి వ్యవహరించారని వాపోతారు. ఆ అవకాశాలను కల్పించినదెవరో ఆలోచించరు, ఆత్మ విమర్శ చేసుకోరు, తమలోని లోటుపాట్లను పరిశీలించుకోరు, తమలో పొడసూపిన విభేదాలకు తాము ముందే దాసులయిన సత్యాన్ని మరచిపోతారు. తమలో ఐక్యతా సాధనకు జరగని కృషిని గుర్తు చేసుకోరు. తాము కష్టపడి, పోటీపడి ప్రపంచంలో తమ స్థానాన్ని దక్కించుకునేందుకు, దాన్ని పెంచుకునేందుకు చేయవలసిన ప్రయత్నాల లోపాన్ని పట్టించుకోరు. ఈ ప్రపంచం కార్యక్షేత్రం, ఇక్కడ చేసుకున్నవారికి చేసుకున్నంత తప్పక ప్రాప్తమవుతుందని విస్మరిస్తారు.

ఏ జాతికయినా పరాభవానికి, పరాధీనతకు, పరాశ్రయానికి గురిచేసేది ఆ జాతిలోని దుష్ట గుణశీలాలే అని, దుర్నిర్ణయాలేనని మరచిపోరాదు. అలసత్వానికి, అవిద్యకు, అజ్ఞానానికి, అధర్మానికి, అవినీతికి, అన్యాయానికి, అక్రమానికి, అనైక్యతకు, అనాగరికతకు అలవడిన జాతి తన స్వయంకృతాపరాధానికే తప్ప మరి దేనికీ వగచి ప్రయోజనం లేదు. బయటి నుండి ఎవరూ ఎవరికీ చెడు చేయలేరు, మరెవరూ ఎవరినీ బయటి నుండి వచ్చి బాగూ చేయలేరు. బలవంతాన ఏదీ వారి తలకు రుద్దబడదు. సౌభాగ్యమయినా, దౌర్భాగ్యమయినా! ఇదే వ్యక్తులయినా సముదాయాలయినా మరువ కూడని సత్యం. దైవ వచనం అదే మాటను మరీ గట్టిగా వక్కాణిస్తోంది.

ఎవరి భవితవ్య పథకం వారే రచించుకుంటారు, ఎవరి ఆచరణా పత్రాన్ని సయితం వారే వ్రాసుకుంటారు. అనుక్షణం 'గతం' అయిపోతున్న ప్రతి 'వర్తమాన క్షణం' వచ్చే 'భావి క్షణం' కోసం పునాది వేస్తోంది. వర్తమానంలో ఎటువంటి భావిని వ్రాసు కుంటారో అటువంటి గతమే చరిత్ర అయి నిలిచిపోతుంది. నేడు సవ్యమయిన మార్గాన్ని అవలంబించి సక్రమమయిన నిర్ణయాలు చేసినట్లయితే రేపు అవే మేలయి దర్శనమిస్తాయి. అన్యథా ప్రవర్తిస్తే పరిణామం మరోలానే ఉంటుంది. మన భవితవ్యాన్ని మనమే మన ఆలోచనల ద్వారా, ఆచరణల ద్వారా, ఆశయాల ద్వారా వీటన్నింటి సమ న్వయం ద్వారా నిర్మించుకుంటున్నాము, నిర్దిష్టపరచుకుంటున్నాము.

మనం దేన్ని రచించుకున్నా దాన్ని మనమే అనుభవించవలసి ఉంటుంది. మరొక రెవరూ మన ఆలోచనల అపసవ్యతకు పర్యవసానాన్ని, మన ఆచరణల అపరిశుద్ధతకు ఫలితాన్ని, మన ఆశల, ఆశయాల అపరిపక్వతకు పరిణామాన్ని అనుభవించరు. మరొక రెవరు మన భారాన్ని మొయ్యరు, మరొకరెవ్వరి భారాన్నీ మనం మొయ్యవలసిన పనిలేదు. మన సంస్కరణ వల్ల, మన సన్మార్గావలంబన వల్ల, మన సదాచరణల వల్ల ప్రయోజనం కలిగేది ఎవరికో కాదు మనకే. అలాగే మనం తప్పుదారిని నడిస్తే, చెడు పనులకు

ఒడిగడితే, చెరుపు జరిగేది, నష్టం కలిగేది మనకే, మరొకరెవరూ దాన్ని పంచుకోరు. ఇది సాధారణంగా మనుషులు మరచిపోయే సత్యం.

సత్యాన్ని మన ముందు ప్రస్ఫుటంగా, ప్రకాశమానం చేసి ఉంచేవారు మన మేలుకోరి, మన మంచి కోసమే అలా చేస్తారు. సత్యం మన ముందుకు వచ్చినప్పుడు మన కర్తవ్యమేమిటో ఆలోచించాలి. అంతేగాని సత్యబోధకులకు బోధన వల్ల కలిగే ప్రయోజనం ఏమిటో అన్న విషయాన్ని పట్టుకుని బాధపడటంకన్నా సత్యాన్ని స్వీకరించి ఆచరించడం వల్ల మనకు కలిగే ప్రయోజనం ఏమిటో పరిశీలించాలి. అదే బుద్ధికుశలత గల వ్యక్తి బాధ్యత. సత్యం ముందుకు వచ్చినా దాన్ని చూసీచూడనట్లు వ్యవహరించడం గుడ్డివాని వ్యవహారమే తప్ప కళ్ళున్న వాని వ్యవహారం కాదు. అలాంటి వారి అంతిమ పరిణామం కూడా గుడ్డివాని పరిణామంగానే రూపొందుతుంది. అలా జరగడమే సమంజసం కూడా. ఖుర్‌ఆన్ అటువంటి అవస్థను ఇలా వర్ణిస్తుంది:

ఎవడయితే ఈ ప్రపంచంలో (సత్యాన్ని చూసి కూడా) గుడ్డివానిగానే ఉండిపోయాడో అతడు పరలోకంలోనూ గుడ్డివానిగానే ఉండిపోతాడు; ఇంకా దారి కనుగొనడంలో అంతకన్నా అధ్వాన్నంగా నిష్ఫలుడవుతాడు.

(దివ్యఖుర్‌ఆన్-బనీ ఇస్రాయీల్ : 72)

వ్యక్తులు కొన్ని సందర్భాలలో జీవితపు ప్రముఖమయిన మలుపులోకి వచ్చి 'కిం కర్తవ్యం' అని నిలిచిపోతారు. అదొక నిర్ణాయక ఘడియ అయి ఉంటుంది. ఆ మలుపులో చేసే నిర్ణయం తరువాత జీవితాంతంలో ప్రభావం చూపుతుంది. సముదాయా లయినా అంతే. వారు అటువంటి సమయాల్లో చేసే నిర్ణయం చారిత్రకమయిన నిర్ణయ మయి ఉంటుంది. ఆ నిర్ణయం చరిత్ర గతినే నిర్దేశిస్తుంది. వ్యక్తులు చేసుకునే నిర్ణయాలు వారి జీవితాలు, సముదాయాల మార్గాలను సూచిస్తే, సముదాయాలు చేసే నిర్ణయాలు చరిత్రను, ప్రపంచ పరిస్థితుల్నీ, ప్రపంచ భవితవ్యాన్ని ప్రభావితం చేస్తాయి. నిర్ణయం చేసే ముందు ఆలోచించి మరీ ముందడుగు వేయాలి. అదే బుద్ధికుశలత గలవారి పద్ధతి.

(9-4-04)

చేతులు ముడుచుకు కూర్చోరాదు!

ఇంకా చూడండి, ఒక వర్గం వారు, పవిత్ర మస్జిద్‌కు వెళ్ళే దారిని మీకు మూసి వేసినట్లయితే దాని వల్ల కలిగిన ఆగ్రహం మిమ్మల్ని బాగా రెచ్చగొట్టి, వారికి ప్రతిగా మీరున్నూ అనుచితమయిన అక్రమాలు చేసేందుకు పురికొలప రాదు. అలా కాదు, అందరికీ ప్రయోజనకరమయిన పనుల్లోను, చెడుల నుండి, పాపపు కార్యాల నుండి తప్పించుకునే పనుల్లోనూ అందరితోనూ సహకరించండి, కాని పాపపు కార్యాలలోనూ, దుర్మార్గం, దౌర్జన్యకరమయిన పనుల్లోనూ ఎవ్వరికీ తోడ్పడకండి. దైవానికి భయపడండి, ఆయన శిక్ష బహు కఠినమయింది.

(దివ్యఖుర్‌ఆన్ – అల్ మాఇద : 2)

అన్ని వేళలా సత్కార్యాల్లో సహకారం, దుష్కార్యాల్లో సహాయ నిరాకరణ ఇస్లామీయ ఆచరణా నియమావళిలోని ఒక సూత్రం. మంచి పనులు ఎక్కడ జరుగుతూ ఉన్నా, ఎవరు చేస్తూ ఉన్నా దానికి చేయూతనివ్వడం ముస్లిముల ధర్మం. అదీ సామూహికంగా సహాయాన్ని అందజేయడం, అందరూ కలసి తలా ఒక బాధ్యత స్వీకరించి ఆ పనిని నెరవేర్చడం ముస్లిముల సామూహిక కర్తవ్యం. అదే విధంగా చెడు కార్యకలాపాలలో పాల్గొనకపోవడమేకాక వాటిని సామూహికంగా అడ్డుకోవడం, శాయశక్తులా నిరోధించడం కూడా ముస్లిములందరి బాధ్యత. ఈ సహకారమయినా, సహాయనిరాకరణ అయినా వ్యవస్థ మార్పునకు సంబంధించినదయితే ఈ విధి నిర్వహణ మరీ ప్రాధాన్యత సంతరించు కుంటుంది.

దేశంలో నేడు ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికలు ఎప్పుడు జరిగినా వాటి ఫలితాలు వ్యవస్థలో మార్పును సూచిస్తాయి. అయితే నేడు జరుగనున్న ఎన్నికలు కీలక మయినవని, నిర్ణాయకమయినవని పలువురు నాయకులు, సాంఘిక శాస్త్రవేత్తలు, మేధా

వులు అభిప్రాయపడుతున్నారు, అదే విధంగా ప్రకటిస్తున్నారు కూడా. ఈ ఎన్నికలు భావిలో దేశం పయనించే దిశను నిర్ణయిస్తాయని, దేశంలో రూపొందనున్న సాంఘిక, సాంస్కృతిక పరివర్తనలకు పునాది వేస్తాయని, ఆర్థిక రాజకీయ వ్యవస్థలో ప్రముఖమయిన పాత్రను పోషిస్తాయని, సామాజికంగా భారత దేశ వ్యవస్థలో చారిత్రకమయిన మార్పునకు దోహదపడతాయని అందరూ అనుకుంటున్నారు.

ఈ మార్పు చెందుతున్న దశలో ముస్లిముల పాత్ర ఏమిటి? మంచిని ప్రేమించే వారుగా, మంచిని ఆదేశించేవారుగా, మంచిని స్థాపించవలసినవారుగా, చెడును ద్వేషించే వారుగా, చెడును నిరోధించేవారుగా, చెడును నిర్మూలించవలసినవారుగా వారి పాత్ర చాలా ప్రముఖమయినది. దేశంలో మార్పు సంభవిస్తూ ఉంటే దాన్ని కేవలం మౌన ప్రేక్షకుల్లా చూడటం వారికి తగదు. ఆ మార్పులో చేదోడువాదోడుగా నిలువవలసిన బాధ్యత వారిపైనే ఉంది. నిజానికి మార్పు సంభవిస్తే దాని ఫలితాలు దేశవాసులందరూ అనుభవిస్తారు. ఆ ఫలితాలు కేవలం ఏ ఒక్కరికీ పరిమితం కావు. అలాగే మార్పు సంభవించకపోతే ఏవయినా దుష్ఫలితాలు కలిగితే వాటి ప్రభావం దేశ ప్రజలందరిపైనా ఉంటుంది. ఏ ఒక్కరికీ పరిమితం కాదు.

దేశంలో వచ్చే మంచి మార్పులకయినా, దుష్పరిణామాలకయినా బాధ్యులు పౌరులందరూ అయినప్పటికీ మంచిని సంస్థాపించేందుకు కృషి అంటూ జరుగుతు న్నప్పుడు ఆ కృషిలో పాలుపంచుకున్న వారి స్థితి అంతా వేరుగా ఉంటుంది. కృషి ఫలించి సత్పరిణామాలు ప్రజలు అనుభవిస్తూ ఉంటే అందులోని ఆనందానుభూతి సర్వ సామాన్యమే అయినప్పటికీ ఆ పరిణామానికి కారణమయిన మార్పునకు జరిగే కృషిలో పాలుపంచు కున్నవారి అనుభూతులు పూర్తిగా వేరయినవే. ఆ సత్పరిణామాలను తామూ అనుభవిస్తూ తోటి సోదరులు సయితం అనుభవిస్తూ ఉండగా చూసి చెందే ఆనంద పారవశ్యం వర్ణనాతీతమయింది.

తాము నివసిస్తున్న ఈ దేశం కోసం, ఈ దేశ పౌరులయిన 105 కోట్ల ప్రజల కోసం తాము కూడా ఉడుతా భక్తిగా ఎంతో కొంత కృషి చేశామన్న సంతృప్తి, సంతుష్టి మిగిలినా అదీ మరుపురాని శాశ్వతానందానుభూతియే అనడంలో సందేహం లేదు. ఎవరో చేసి పెట్టిన మార్పును, దాని ఫలితాలను అనుభవించడంకాక, తమ వ్యక్తిగత సామూహిక భూమిక కూడా ఉన్న మార్పును, దాని సద్ఫలితాలను అనుభవించడం పూర్తిగా విభిన్న మయిన విషయం.

పైన పేర్కొన్న దివ్యఖుర్ఆన్ వచనంలో, అనుభూతులకు, ఆనందాలకు అతీతంగా, స్వప్రయోజనాలకు, స్వార్థాలకు బహుదూరంగా, నిస్వార్థ సేవాభావంతో జరిగే ప్రతి

మంచి పనిలో ముస్లిములు తమ కృషి దానం అందజేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పడం జరిగింది. ఒక మంచి మార్పు కోసం దేశంలో జరుగుతున్న కృషిలో క్రియాశీల పాత్ర పోషించవలసిన బాధ్యత ముస్లిములపైన ఉంది. అప్పుడే వారు రానున్న రోజుల్లో మార్పులోని సత్ఫలితాలను ఆనందంగా అనుభవించగలుగుతారు. అలా కాక పోయినట్లయితే రేపు మార్పు జరిగిన తరువాత తాము ఆ మార్పులో తగిన పాత్ర పోషించలేదన్న నేరభావం వారిని వెంటాడుతూనే ఉంటుంది.

ఈ దేశ వ్యవస్థలో వచ్చే పెను మార్పులయినా చిరు మార్పులయినా వాటిలో మంచిని కాంక్షించే ప్రతి మార్పులో, ప్రజలెల్లరి శ్రేయం కోసం జరిగే ప్రతి సత్కార్యంలో, దేశ భవిష్యత్తుకు సంబంధించిన నవ నిర్మాణానికి జరిగే ప్రతి కార్యక్రమంలో, ముస్లిములు సకారాత్మకంగా, సృజనాత్మకంగా, క్రియాత్మకంగా శక్తివంచన లేకుండా, అన్ని విధాలా తమ కృషి భాగాన్ని అందజేయాలి. అదే వారి ధార్మిక చైతన్యానికి, దేశ ప్రేమకు, మానవతా భిమానానికి ఆనవాలు; అదే వారి సత్యానికి సాక్ష్యం!